పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు

సంపుటి : 1 సంచిక : 272 పేజీలు : 12 సంపాదకులు : జి.ఎ.రావు (ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : హైదరాబాద్ ఆదివారం 9 ఆగస్టు 2026 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE : 272 PAGES : 12 EDITOR : G. A. RAO (ANAND GANTYADA) PUBLISHED : HYDERABAD SUN 9 AUGUST 2026 PRICE : 1/- RS

Simultaneously Published form : Hyderabad, Thadepalligudem, Dr. B.R. Ambedkar Konasema Dist, Narasarao Peta,Bapatla,Visakhapatnam,Kakinada,Ongole, Kadapa,,SPSR Nellore, Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur, Tirupati,Chittor,Kurnool,Anantapur

భూమి.. నైపుణ్యం... నిరంతర విద్యుత్ మా బలాలు

- శాన్‌ఫ్రాన్సిస్కోలో పారిశ్రామికవేత్తలతో భట్టి విక్రమార్క
- పెట్టుబడులకు అపార అవకాశాలున్నాయని వెల్లడి

హైదరాబాద్ పెన్ పవర్:తెలంగాణలో పెట్టుబడులకు అనుకూలమైన వాతావరణం, అపార అవకాశాలు ఉన్నాయని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. పరిశ్రమలకు అవసరమైన భూమి, నైపుణ్యం ఉన్న మానవ వనరులు, నిరంతర విద్యుత్ సరఫరా, మెరుగైన మౌలిక సదుపాయాలు ఉన్నాయని వెల్లడించారు.

- మిగతా 2లో

క్లిష్టమైన వైద్యసేవలన్నీ అందించే వేదికగా టిమ్స్

- మంత్రి దామోదర్ రాజనర్సింహ
- త్వరలోనే సీఎం చేతుల మీదుగా ప్రారంభిస్తామని వెల్లడి

- మిగతా 2లో

హైదరాబాద్ పెన్ పవర్: వైద్యసేవలు అందించేందుకు సనత్‌నగర్‌లోని డా.మర్రి చెన్నారెడ్డి(డా.ఎంసీఆర్) టిమ్స్ సిద్ధమైందని వైద్యారోగ్య శాఖ మంత్రి



ప్రపంచం ఎలా మారుతుందో చెప్పలేం.. కానీ, గెలవాలంటే..!

యువతకు మోదీ కీలక సందేశం

- ఎప్పటికప్పుడు నేర్చుకునేవారే విజయం సాధిస్తారన్న మోదీ
- టెక్నాలజీతో ఉద్యోగాలు, పరిశ్రమలు మారుతున్నాయని వ్యాఖ్య
- యువత నిర్ణయాలు 'వికసిత్ భారత్'పై ప్రభావం చూపుతాయని వెల్లడి
- వచ్చే 30-35 ఏళ్లు యువతకు కీలకమని హితవు
- పరిశోధన, కొత్త ఆలోచనల్లో అవకాశాలు పెరుగుతున్నాయని వెల్ల

- మిగతా 2లో



రెంట్.. బాయ్ ఫ్రెండ్‌తో జాగ్రత్త

- ఆగస్టు ప్రత్యేక రాయితీ అంటూ మోసాలు
- అమ్మాయిలు అప్రమత్తంగా ఉండాలని సీపీ సజ్జనర్ సూచన

హైదరాబాద్ పెన్ పవర్: "సరదాగా షికార్లు కొట్టేందుకు.. సినిమాలు... కాఫీ క్లబ్‌కు వెళ్లేందుకు బాయ్ ఫ్రెండ్ కావాలా! అయితే ఈ అవకాశం మీ కోసమే అంటూ సామాజిక మాధ్యమాల్లో ప్రకటనలు హల్‌చల్ చేస్తున్నాయి. పలు రకాల పేర్లతో ఆకట్టుకునే పోస్టర్ల వెనుక సైబర్‌మోసం దాగి ఉంది" అని హైదరాబాద్ సీపీ వీసీ సజ్జనర్ హెచ్చరించారు. యువతులే లక్ష్యంగా డేటింగ్ యాప్‌తో సైబర్ మాయగాళ్లు ట్రాప్ చేస్తున్నట్లు తెలిపారు. 'రెంట్ బాయ్ ఫ్రెండ్' పేరిట సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతున్న మోసాలపై సీపీ ఎక్స్ వేదికగా శనివారం అప్రమత్తం చేశారు. "రెంట్ బాయ్ ఫ్రెండ్–యువర్ పర్సనల్ కంపానియన్ పేరిట ఫేస్‌బుక్,

- మిగతా 2లో

మా ప్రభుత్వం వచ్చాక ఆ పాలసీ రద్దు చేస్తాం..

డబ్బులు చెల్లిస్తే నష్టపోతారు జాగ్రత్త

- హిల్ట్ పాలసీ కింద డబ్బులు చెల్లిస్తే నష్టపోతారు.. జాగ్రత్త అని కేటీఆర్ హెచ్చరించారు.
- బీఆర్ఎస్ అధికారంలోకి వస్తే హిల్ట్ పాలసీని రద్దు చేస్తామని ప్రకటించారు.
- 10 వేల ఎకరాలను ఎవరికో ధారాదత్తం చేసేందుకు ప్రభుత్వం చూస్తోందని ఆరోపించారు.
- కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ ఉద్యమ స్థాయిలో పెద్దఎత్తున పోరాటం చేస్తామని కేటీఆర్ తెలిపారు.

హైదరాబాద్ పెన్ పవర్: నగరంలోని పారిశ్రామిక ప్రాంతాల్లోని భూములను బహుళ వినియోగ జోన్లుగా మార్చడమే లక్ష్యంగా ప్రభుత్వం తీసుకొచ్చిన హైదరాబాద్ ఇండస్ట్రియల్ ల్యాండ్స్ ట్రాన్స్‌ఫర్మేషన్(హిల్ట్) పాలసీపై సెప్టెంబర్‌లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. 10వేల ఎకరాలను ఎవరికో ధారాదత్తం చేయాలని చూస్తున్నారని ఆరోపించారు. ఈ పాలసీపై పారిశ్రామిక అసోసియేషన్లకు లేఖలు రాస్తామన్న ఆయన.. బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక హిల్ట్ పాలసీ రద్దు చేస్తామని ప్రకటించారు. మీడియాతో ఇష్టాగోష్టిలో మాట్లాడిన కేటీఆర్.. ఈ పాలసీ కింద ఎవరైనా డబ్బులు చెల్లిస్తే నష్టపోతారు జాగ్రత్త అని హెచ్చరించారు. భూ మాఫియాతో చేతులు కలపొద్దని పారిశ్రామికవేత్తలను కోరుతున్నట్లు పేర్కొన్నారు.

కేసీఆర్ చేసినన్ని యాగాలు ఎవరూ చేయలేదు..

బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్) చేసినన్ని యాగాలు ఎవరూ చేయలేదని కేటీఆర్ అన్నారు. కాంగ్రెస్ నేతలు చేస్తున్న వరుణ యాగాలు సహా పలు అంశాలపై స్పందిస్తూ.. "యాగాలు చేయొచ్చు కానీ.. ప్రభుత్వం కూడా తన బాధ్యతలు నిర్వర్తించాలి. దైవకృపకు మానవ ప్రయత్నం కూడా ఉంటేనే ఫలితం వస్తుంది. హరీశ్‌రావు గుడికి వెళ్తే.. కాంగ్రెస్ నేతలు చిల్లరగా మాట్లాడుతున్నారు. క్షుద్ర పూజలంటూ కాంగ్రెస్ క్షుద్ర, సిగ్గుమాలిన రాజకీయాలు చేస్తోంది. వ్యవసాయం, రైతుల పట్ల సీఎం రేవంత్ రెడ్డికి పట్టింపు, అవగాహన లేవు. పాలమూరు బిడ్డగా చెప్పుకొనే ఆయన.. ఆ జిల్లాకు సాగునీరు ఇవ్వట్లేదు.

కేసీఆర్ నాయకత్వంలో భారీ పోరాటం

అధికారంలో ఉన్నా.. లేకున్నా రాష్ట్రం బాగు కోరుకుంటాం. ఎక్కడికైనా వెళ్తాం.. 24 గంటల కరెంటు ఎక్కడ వస్తుందో చూపాలి. పోతిరెడ్డిపాడు ద్వారా ఏపీ నీరు తీసుకుంటున్నా.. ఈ ప్రభుత్వానికి పట్టడం లేదు. తెలంగాణ నీటి హక్కుల్ని ఏపీ కొల్లగొడుతుంటే పట్టించుకోవట్లేదు. కేసీఆర్ నాయకత్వంలో పెద్దఎత్తున పోరాటం చేస్తాం. తెలంగాణ ఉద్యమం స్థాయిలో మళ్లీ ఉద్యమిస్తాం. గోదావరి బోర్డు సమావేశంపై రాష్ట్ర ప్రభుత్వ వైఖరి ఏంటో స్పష్టం చేయాలి. హైడ్రా పేరిట ఈ ప్రభుత్వం పేదల కడుపు కొడుతోంది" అని విమర్శించారు.

డీలిమిటేషన్‌పై తగ్గేదే లేదన్న విజయ్ సర్కార్..

నియోజకవర్గాల పునర్విభజనకు వ్యతిరేకంగా తీర్మానం

పెన్ పవర్ డెస్క్: నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్)పై విజయ్ నేతృత్వంలోని తమిళనాడు ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదిస్తోన్న డీలిమిటేషన్?కు వ్యతిరేకంగా అసెంబ్లీలో తీర్మానం చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. శనివారం (ఆగస్ట్ 8) సీఎం విజయ్ నేతృత్వంలో జరిగిన తమిళనాడు ఎంపీల అఖిలపక్ష భేటీలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. మహిళా

- మిగతా 2లో

మోదీతో సుఖ్‌బీర్ బాదల్ భేటీ..

పొత్తు పునరుద్ధరణ దిశగా బీజేపీ-శిరోమణి అకాలీదళ్ కసరత్తు?

- డీలిమిటేషన్ కు మద్దతు ప్రకటించిన సుఖ్‌బీర్ సింగ్ బాదల్
- గతంలో సాగు చట్టాల వివాదంతో ఎన్డీయే నుంచి బయటకు వచ్చిన శిరోమణి అకాలీదళ్
- ప్రస్తుతం పంజాబ్‌లో మారుతున్న రాజకీయ పరిణామాలు

పెన్ పవర్ డెస్క్:శిరోమణి అకాలీదళ్ (ఎస్ఏడీ) అధినేత సుఖ్‌బీర్ సింగ్ బాదల్ ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో సమావేశమైన మరుసటి రోజే కీలక రాజకీయ పరిణామాలు చోటుచేసుకు న్నాయి. నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) ప్రక్రియకు బాదల్ మద్దతు ప్రకటించారు. దీంతో, పంజాబ్‌లో బీజేపీ – అకాలీదళ్ మధ్య మళ్లీ పొత్తు పొడుస్తోందనే చర్చలు ఊపందుకున్నాయి.

- మిగతా 2లో

ఢిల్లీ పోలీసుల్లా ప్రవర్తించొద్దు.. తన భద్రతా అధికారిపై అభిజీత్ దీప్కే ఆగ్రహం

- తన భద్రతా సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేసిన అభిజీత్ డిప్కే
- అతిథులను కలవకుండా ఎస్ఐ అడ్డుకుంటున్నారని ఆరోపణ
- ఢిల్లీ పోలీసుల్లా ప్రవర్తించొద్దంటూ అధికారిపై ఫైర్
- అతడిని విధుల నుంచి తొలగించాలని ఉన్నతాధికారులకు ఫిర్యాదు

పెన్ పవర్ డెస్క్:కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే తన నివాసం వద్ద భద్రతా విధుల్లో ఉన్న ఓ పోలీస్ సబ్–ఇన్‌స్పెక్టర్‌పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తనను కలిసేందుకు వచ్చే సందర్శకుల పట్ల సదరు అధికారి దురుసుగా ప్రవర్తిస్తున్నారని, వారిని అడ్డుకుంటున్నారని ఆరోపిస్తూ వెంటనే

- మిగతా 2లో

వెంకటేశ్, సురేశ్ బాబు, రానాలకు

హైకోర్టులో చుక్కెదురు!

- డెక్కన్ కిచెన్ ప్రాపర్టీ వివాదం
- నాంపల్లి కోర్టులో ఉన్న కేసును కొట్టివేయాలంటూ హైకోర్టులో దగ్గుబాటి ఫ్యామిలీ పిటిషన్
- కేసును నాంపల్లి కోర్టులోనే తేల్చుకోవాలన్న హైకోర్టు

- మిగతా 2లో

నేడు పెద్ది సుదర్శన్ రెడ్డి ఇంటికి వెళ్లనున్న కేసీఆర్

- అనారోగ్య కారణాలతో ఇటీవల కన్నుమూసిన పెద్ది సుదర్శన్ రెడ్డి
- పెద్ది కుటుంబ సభ్యులను పరామర్శించనున్న కేసీఆర్
- ఇప్పటికే పెద్ది కుటుంబానికి రూ. 2.25 కోట్ల ఆర్థిక సాయాన్ని ప్రకటించిన కేసీఆర్

హైదరాబాద్ పెన్ పవర్:పార్టీ ఆవిర్భావం నుంచి తనకు అత్యంత ఆప్తుడిగా, ముఖ్య అనుచరుడిగా ఉన్న నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి మరణంతో విషాదంలో ఉన్న బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆయన కుటుంబాన్ని స్వయంగా పరామర్శించనున్నారు. ఇందుకోసం నర్సంపేట నియోజకవర్గ పరిధిలోని పెద్ది స్వగ్రామమైన నల్లబెల్లికి రేపు ఆయన వెళ్లనున్నారు. ఇంటి పెద్దను కోల్పోయి పుట్టెడు దుఃఖంలో ఉన్న కుటుంబ సభ్యులను పరామర్శించి, ఓదార్చి కష్టకాలంలో పార్టీ ఎల్లవేళలా తోడుగా ఉంటుందనే భరోసా ఇవ్వనున్నారు.

ఈ పర్యటనలో భాగంగా పెద్ది సుదర్శన్ రెడ్డి

- మిగతా 2లో

ఎడిటర్ వ్యూ

కాక్రోచ్ కు నిధులెలా వస్తున్నాయ్...

కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) గురించి రోజువారీగా కొత్త వివరాలు బయటకు వస్తున్నాయి. పార్టీ నాయకత్వం, దాని వ్యూహాలు, వెనుక ఉన్న శక్తులు, అసలు ప్రణాళిక ఏమిటి అన్న అంశాలపై అనేక సందేహాలు ఏర్పడుతున్నాయి. ముఖ్యంగా ప్రముఖ నాయకుల వ్యక్తిగత జీవితాలు, ఆదాయ వనరులు, జీవన ప్రమాణాలు ప్రజల దృష్టిని ఆకర్షిస్తున్నాయి. ఉద్యమాలు నడిపే వారు సమాజానికి జవాబుదారులుగా ఉండాలని ఆశించే సందర్భంలో, వారి స్వంత నేపథ్యాలపై స్పష్టత లేకపోవడం చర్చకు దారితీస్తోంది. సీజేపీ చీఫ్ అభిజిత్ దీప్కే గురించి అనేక ప్రశ్నలు వస్తున్నాయి. ఆయన తండ్రి మహారాష్ట్ర ప్రభుత్వ విభాగంలో అసిస్టెంట్ ఇంజినీర్‌గా పనిచేస్తూ, నెలకు సుమారు 50 వేల నుంచి 60 వేల రూపాయల వేతనం పొందుతున్నట్లు తెలుస్తోంది. అయినప్పటికీ శంభాజీనగర్‌లో ఉన్న ఆయన భవనం రెండు కోట్ల రూపాయలకు పైగా విలువైనదిగా అంచనా. ఆ ఇంట్లోని సదుపాయాలు, అక్కడ జరిగిన సమావేశాల్లో మద్యం సరఫరా విధానం, పెద్ద ఎత్తున కార్టన్ల రాకపోకలు వంటి వివరాలు చూస్తే, ఆదాయానికి తగిన జీవనస్థాయి లేదన్న సందేహం ఏర్పడుతోంది. అభిజిత్ అమెరికాలో చదువు, కోర్సు, సహచరులు, విశ్వవిద్యాలయం గురించి స్పష్టమైన సమాధానాలు ఇవ్వడం లేదు. ప్రశ్నలు వచ్చినప్పుడు "సమయం వచ్చినప్పుడు చెబుతాను" అని దాటవేస్తున్నారు. జార్ఖండ్ ఉద్యమానికి మద్దతు ఇవ్వలేనని జ్వరం కారణంగా చెప్పిన మరుసటి రోజే మహారాష్ట్రలో సమావేశం నిర్వహించి కోక్ తాగిన వివరాలు కూడా అసమతుల్యతను చూపుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో నిధుల మూలం ఏమిటి, కుటుంబ ఆదాయంతో ఇంతటి జీవనశైలి ఎలా సాధ్యమవుతుంది అన్న ప్రశ్నలు సహజంగా తలెత్తుతున్నాయి. ఆల్ ఇండియా స్టూడెంట్ అసోసియేషన్ నాయకురాలు నేహా బోరా 26 రోజుల పాటు నిరాహార దీక్షలో పాల్గొన్నారు. ఆమె వయసు 29, గత 15 ఏళ్లుగా ఇంటికి దూరంగా ఉన్నట్లు తెలిపారు. అంటే కౌమార దశ నుంచే వామపక్ష ఉద్యమాల్లో చురుకుగా ఉన్నట్లు అర్థం. అయితే చదువు, ఫీజులు, నిర్వహణ ఖర్చులు ఎవరు భరిస్తున్నారు, ఎలా జీవిస్తున్నారు అన్న విషయాల్లో స్పష్టత లేదు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా తర్వాత ఆమె చేసిన నృత్యం, 20 నిమిషాలపాటు అనర్గళంగా మాట్లాడిన విధానం చూస్తే, దీర్ఘకాల నిరాహార దీక్ష చేసిన వ్యక్తి శారీరక స్థితికి సరిపోని ఉత్సాహం కనిపించింది. ఇలాంటి వైరుధ్యాలు ప్రజల్లో అనుమానాలను పెంచుతున్నాయి. సౌరభ్ దాస్ ఢిల్లీలో అత్యంత ఖరీదైన ప్రాంతంలో నివసిస్తున్నారు. నెలకు పది లక్షల రూపాయల అద్దె ఉన్న ఇంట్లో ఉంటున్నారు. దీనిని ఆయన తిరస్కరించడం లేదు. ఇల్లు ఆయన పేరిట లేకపోయినా, ముగ్గురు ఉద్యోగులు, కారు సౌకర్యాలతో విలాసవంతంగా జీవిస్తున్నారు. ఉద్యమ కార్యకర్తగా ఇంతటి జీవనస్థాయి ఎలా సాధ్యమవుతుంది అన్నది మరో ముఖ్య ప్రశ్న. సీజేపీ రిజిస్టర్డ్ బాడీ కాదు. ఆర్ఎస్ఎస్‌ను రిజిస్టర్ చేయాలని కోరే వారు సీజేపీ విషయంలో అదే ప్రమాణాన్ని వర్తింపజేయకపోవడం గమనార్హం. ఉద్యమాలకు, సమావేశాలకు, ప్రయాణాలకు అవసరమైన నిధులు ఎక్కడి నుంచి వస్తున్నాయి, నాయకులు ఎలా మనుగడ సాగిస్తున్నారు అన్న విషయాల్లో పారదర్శకత లేకపోవడం విమర్శలకు దారితీస్తోంది. ప్రజలను ప్రశ్నించే వారు తమ వ్యక్తిగత, ఆర్థిక విషయాల్లో కూడా స్పష్టంగా ఉండాలి. సైలెన్స్ లేదా దాటవేత ధోరణి అనుమానాలను మరింత పెంచుతుంది. సమాజం ఆశించేది సమాధానాలు, స్పష్టత, జవాబుదారీతనం. ఇవి లేకపోతే ఏ ఉద్యమమైనా విశ్వసనీయతను కోల్పోయే ప్రమాదం ఉంటుంది.

రెంటల్.. బాయ్ ఫ్రెండ్‌తో జాగ్రత్త

- మొదటి పేజీ తరువాయి

ఇన్‌స్టాగ్రామ్, టెలిగ్రామ్ వేదికలుగా ప్రకటనలు గుప్పిస్తున్నారు. ఆగస్టు ఒకటి ప్రత్యేక ఆఫర్‌గా 50% డిస్కౌంట్ ఇస్తున్నట్లు బురిడీ కొట్టిస్తున్నారు. ఇదంతా చట్టబద్ధంగా చేస్తున్నామని.. బాయ్‌ఫ్రెండ్‌ను ముందుగానే బుక్ చేసుకోవాలంటే తాము సూచించిన ఫోన్ నంబరు, సామాజిక మాధ్యమాల ఖాతాల్లో మెసేజ్ చేయమంటారు.

ఫొటోలు చూపి.. మాటలతో ఆకట్టుకొని

కృత్రిమ మేధ(ఏఐ)తో రూపొందించిన అందమైన కుర్రాళ్ల ఫొటోలను ప్రొఫైల్స్‌గా ఉంచుతారు. అట్నుంచి ఫోన్‌చేసిన అమ్మాయిలతో ఆకట్టుకునేలా మాట్లాడతారు. తమ వ్యక్తిగత వివరాలు పంచుకుంటారు. ఇదంతా నిజమని నమ్మిన యువతులు నచ్చినట్టు వచ్చేందుకు బుకింగ్ కన్ఫర్మేషన్, సెక్యూరిటీ డిపాజిట్, అడ్వాన్స్ నగదు చెల్లించాలని వాలెట్, క్యూఆర్ కోడ్ పంపుతారు. పెద్దఎత్తున నగదు జమకాగానే నకిలీ ఖాతాలను బ్లాక్ చేస్తారు. మోసపోయిన బాధితులు విషయం బయటపడితే పరువు పోతుందని మౌనం వహిస్తున్నారు. ఆన్‌లైన్ పరిచయాలతో నమ్మి అపరిచితులను కలిసేందుకు నేరుగా వెళ్తే సులభంగా ట్రాప్ చేసే ప్రమాదం ఉంది" అని సీపీ హెచ్చరించారు. నకిలీ పేర్లతో మరింత దగ్గరై ప్రేమ పేరిట మోసాలకు పాల్పడటం, చాటింగ్, ఫోన్ సంభాషణలు, వ్యక్తిగత ఫొటోలు సేకరించి బెదిరించి డబ్బు డిమాండ్ చేసే అవకాశం ఉందన్నారు. మోసాల బారిన పడినా, అనుమానాస్పద పోస్టులు కనిపించినా సైబర్‌క్రైమ్ హెల్ప్‌లైన్ నంబరు 1930, cybercrime.gov.in కు ఫిర్యాదు చేయాలని సూచించారు.

క్లిష్టమైన వైద్య సేవలన్నీ అందించే వేదికగా టిమ్స్

- మొదటి పేజీ తరువాయి

దామోదర్ రాజనర్సింహ వెల్లడించారు. సీఎం రేవంత్‌రెడ్డి త్వరలోనే ప్రారంభిస్తారని వెల్లడించారు. ఆసుపత్రిలో మౌలిక వసతులు, వైద్య సిబ్బంది, భద్రత, ఇతర సహాయక వ్యవస్థలను శనివారం మంత్రి పరిశీలించారు. వైద్యులు, సిబ్బంది, ఉద్యోగులతో మాట్లాడారు. ఆసుపత్రి నిర్వహణకు సంబంధించిన వివరాలు అడిగి తెలుసుకున్నారు. అవసరాలకు అనుగుణంగా పారా మెడికల్ సిబ్బంది, టెక్నీషియన్లు, పరిపాలనా సిబ్బందిని నియమించుకోవాలని, నిరంతరాయంగా వైద్య సేవలు అందేలా ఏర్పాట్లు చేసుకోవాలని అధికారులకు సూచించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ, రాష్ట్రంలోనే అత్యాధునిక

సూపర్ స్పెషాలిటీ వైద్యసేవలు అందించే వైద్యసంస్థగా డా.ఎంసీఆర్ టిమ్స్‌ను ప్రభుత్వం అభివృద్ధి చేస్తోందన్నారు. సూపర్ స్పెషాలిటీ వైద్య విభాగాలు, క్రిటికల్ కేర్, అత్యవసర వైద్యం, అవయవ మార్పిడి తదితర క్లిష్టమైన వైద్యసేవలు అందించే ఒకే వేదికగా టిమ్స్ నిలుస్తుందన్నారు.

భూమి.. నైపుణ్యం... నిరంతర విద్యుత్ మా బలాలు

- మొదటి పేజీ తరువాయి

అమెరికాలోని శాన్‌ఫ్రాన్సిస్కోలో భారత కాన్సులేట్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'మీట్ అండ్ గ్రీట్' కార్యక్రమంలో భట్టి పాల్గొన్నారు. తెలుగు రాష్ట్రాల ప్రవాసులు, పారిశ్రామికవేత్తలు, సాంకేతిక నిపుణులు, వృత్తి నిపుణులతో సమావేశమై తెలంగాణలో ఉన్న అవకాశాలను వివరించారు. పారిశ్రామిక కారిడార్లలో తయారీ, ఐటీ, జీవశాస్త్రం, స్వచ్ఛ ఇంధనం తదితర రంగాల్లో పెట్టుబడులకు ముందుకురావాలని కోరారు. అనంతరం శాన్‌ఫ్రాన్సిస్కోలో డ్రైవర్ లెస్(డ్రైవర్ లేకుండానే ప్రయాణించ్చ) వాహనంలో భట్టి ప్రయాణించారు. ఆ వాహనాల నిర్వహణ సంస్థ

ప్రతినిధులతో సమావేశమై దాని సాంకేతికత, నిర్వహణకు అవసరమైన మౌలిక సదుపాయాలు, నియంత్రణ తదితర వివరాలు అడిగి తెలుసుకున్నారు. హైదరాబాద్‌తోపాటు ప్రతిపాదిత ఫ్యూచర్ సిటీలో డ్రైవర్‌లెస్ మొబిలిటీని ప్రయోగాత్మకంగా అమలు చేసే అవకాశాలపై చర్చించారు.

ప్రపంచం ఎలా మారుతుందో చెప్పలేం.. కానీ, గెలవాలంటే..!

ప్రపంచం వేగంగా మారుతోంది.. టెక్నాలజీతో పాటు ఉద్యోగాలు, పరిశ్రమలు కూడా కొత్త రూపం దాలుస్తున్నాయని ప్రధాని మోదీ అన్నారు. ఈ ప్రయాణంలో ఎప్పటికప్పుడు నేర్చుకుంటూ ఉండేవారే భవిష్యత్తులో విజయం సాధిస్తారని అన్నారు. ఐఐటీ ఢిల్లీ స్నాతకోత్సవంలో శనివారం మోదీ ప్రసంగించారు. ప్రపంచంలో వ్యూహాత్మక మార్పులు వేగంగా జరుగుతున్నాయని చెప్పారు. టెక్నాలజీ అభివృద్ధి ఈ మార్పులకు ప్రధాన కారణమని పేర్కొన్నారు. రాబోయే 20-30 ఏళ్లలో ప్రపంచం ఎలా ఉంటుందో కచ్చితంగా చెప్పలేమన్నారు. అయితే మార్పులు సవాళ్లతో పాటు కొత్త అవకాశాలను కూడా తీసుకొస్తాయని తెలిపారు. ప్రస్తుత తరం యువతకు ప్రత్యేక బాధ్యత ఉందని మోదీ అన్నారు. వచ్చే 30-35 ఏళ్లలో వారు తీసుకునే నిర్ణయాలు 'వికసిత్ భారత్' ప్రయాణంపై ప్రభావం చూపుతాయని చెప్పారు. తాము తీసుకునే ప్రతి నిర్ణయం దేశానికి ఎలా ఉపయోగపడుతుందో యువత ఆలోచించాలని సూచించారు. పరిశోధన, కొత్త ఆలోచనల్లోనూ యువతకు ఎన్నో అవకాశాలు ఉన్నాయని మోదీ చెప్పారు. ప్రధానమంత్రి రీసెర్చ్ ఫెలోషిప్, రీసెర్చ్ డెవలప్‌మెంట్ అండ్ ఇన్నోవేషన్ పథకం ద్వారా యువ పరిశోధకులను ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. జాతీయ పరిశోధనా సంస్థను ఏర్పాటు చేశామని చెప్పారు. పరిశోధన రంగానికి రూ.1 లక్ష కోట్ల వరకు నిధులు సమకూరుస్తున్నట్లు వెల్లడించారు. 'వన్ నేషన్.. వన్ సబ్‌స్క్రిప్షన్' ద్వారా ప్రముఖ అంతర్జాతీయ పరిశోధనా జర్నల్స్ దేశంలోని చిన్న పట్టణాలకూ అదనపు ఖర్చు లేకుండా అందుతున్నాయని మోదీ తెలిపారు. ఐఐటీ ఢిల్లీలో 3,000 మందికి పైగా విద్యార్థులకు పట్టాలు అందించారు. ఇందులో 587 మంది పీహెచ్‌డీ విద్యార్థులు ఉన్నారు. అదే కార్యక్రమంలో ఐఐటీ ఢిల్లీ సోనిపట్ క్యాంపస్‌లో ఏర్పాటు చేసిన 'పరమ్ ప్రజ్ఞ' ఏఐ ఆధారిత సూపర్ కంప్యూటింగ్ సదుపాయాన్ని మోదీ వర్చువల్‌గా ప్రారంభించారు. ఇది ఏఐ, డేటా సైన్స్, ఆధునిక కంప్యూటింగ్, పరిశోధనకు ఉపయోగపడనుంది.

వెంకటేశ్, సురేశ్ బాబు, రానాలకు హైకోర్టులో చుక్కెదురు!

టాలీవుడ్ ప్రముఖులు దగ్గుబాటి వెంకటేశ్, సురేశ్ బాబు, రానాలకు తెలంగాణ హైకోర్టులో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఫిల్మ్‌నగర్‌లోని ప్రసిద్ధ 'డెక్కన్ కిచెన్' ప్రాపర్టీ వివాదానికి సంబంధించి నాంపల్లి కోర్టులో తమపై పెండింగ్‌లో ఉన్న క్రిమినల్ కేసును కొట్టివేయాలని కోరుతూ వారు దాఖలు చేసిన పిటిషన్‌ను హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్. తుకారాంజీ తిరస్కరించారు. వెంకటేశ్, సురేశ్ బాబు, రానాతో పాటు దగ్గుబాటి అభిరామ్, అకౌంటెంట్ గడ్డం విశ్వనాథమ్‌లు సమర్పించిన రద్దు (క్వాష్) పిటిషన్‌లో ఎలాంటి బలమైన కారణాలు లేవని స్పష్టం చేస్తూ కొట్టివేశారు. లీజు గడువు ముగియకముందే దగ్గుబాటి కుటుంబం జీహెచ్ఎంసీ అధికారులతో కుమ్మక్కై తమ ప్రాపర్టీలోకి అక్రమంగా ప్రవేశించిందని, అక్కడి నిర్మాణాలను బలవంతంగా కూల్చివేసి బెదిరింపులకు దిగారని కోరె నందు కుమార్ గతంలో కేసు పెట్టారు. ఇది కేవలం లీజుకు సంబంధించిన సివిల్ వివాదమని, క్రిమినల్ కేసు కాదని నిందితులు వాదించినప్పటికీ... ఈ వ్యవహారంలో జోక్యం చేసుకునేందుకు చట్టబద్ధమైన ప్రాతిపదిక లేదని స్పష్టం చేసిన హైకోర్టు, నాంపల్లి కోర్టులోని విచారణ కొనసాగేలా ఆదేశించింది.

వివేకా హత్య వెనుక కచ్చితంగా పెద్ద కుట్ర ఉంది:

మాజీ మంత్రి వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసుకు సంబంధించి ఆయన కుమార్తె డాక్టర్ వైఎస్ సునీతా రెడ్డి, భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు లేఖ రాశారు. తన తండ్రి హత్యకు గురై ఏడేళ్లకు పైగా గడిచినా తమ కుటుంబానికి ఇంతవరకు పూర్తి న్యాయం జరగలేదని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. వివేకా హత్య వెనుక కచ్చితంగా పెద్ద కుట్ర ఉందని ఉద్ఘాటించారు. కేసు దర్యాప్తులో వెలుగు చూడని అనేక కీలక అంశాలను వెలికితీయాలని, నిందితులకు కఠిన శిక్ష పడేలా చూడాలని ఆమె తన లేఖలో కోరారు. ఈ కేసుకు సంబంధించి ఇప్పటివరకు జరిగిన సీబీఐ దర్యాప్తు, తదనంతర పరిణామాలను సునీత తన లేఖలో రాష్ట్రపతికి వివరించారు. హత్య జరిగి ఇన్నేళ్లయినా నేటికీ హత్యకు ఉపయోగించిన ఆయుధాన్ని స్వాధీనం చేసుకోలేకపోవడంపై ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. హత్య వెనుక ఉన్న పెద్ద కుట్రను, కోట్లాది రూపాయల ఆర్థిక లావాదేవీల కోణాన్ని సమగ్రంగా విచారించాలని డిమాండ్ చేశారు. దర్యాప్తులో కొన్ని కీలకమైన అంశాలు అపరిష్కృతంగానే మిగిలిపోయాయనిం

ఆమె పేర్కొన్నారు. ఈ మేరకు దిశ, ఈనాడు పత్రికలు కథనాలు ప్రచురించాయి. ముఖ్యంగా, వివేకా హత్య వార్త బయటకు రాకముందే అప్పటి ప్రతిపక్ష నేత జగన్ కు ఎలా తెలిసిందనే అంశాన్ని లోతుగా దర్యాప్తు చేయాలని సునీత కోరారు. ఈ విషయంలో జగన్ పాత్రపై విచారణ జరపాల్సి ఉందని 2023 మే 25న సీబీఐ స్వయంగా హైకోర్టులో దాఖలు చేసిన అదనపు అఫిడవిట్‌ను ఆమె తన లేఖలో ఉటంకించారు. ఈ కీలక అంశాన్ని ట్రయల్ కోర్టు పరిగణనలోకి తీసుకోలేదని ఆమె తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మూడు ప్రత్యేక దర్యాప్తు బృందాలను (సిట్) ఏర్పాటు చేసినా, ఆ తర్వాత సీబీఐ నాలుగు చార్జిషీట్లు దాఖలు చేసినా, కేసులో లోతైన దర్యాప్తు జరగలేదనే భావనను ఆమె వ్యక్తం చేశారు.

నేడు పెద్ది సుదర్శన్ రెడ్డి ఇంటికి వెళ్లనున్న కేసీఆర్

- మొదటి పేజీ తరువాయి

కుటుంబంతో పాటు నర్సంపేట నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు, అభిమానులను కలిసి కేసీఆర్ ధైర్యం చెప్పనున్నారు. కాగా, ఇప్పటికే పెద్ది కుటుంబాన్ని ఆదుకునేందుకు బీఆర్ఎస్ పార్టీ తరఫున రూ. 2.25 కోట్ల ఆర్థిక సహాయాన్ని కేసీఆర్ ప్రకటించిన విషయం తెలిసిందే.

డీలిమిటేషన్‌పై తగ్గేదే లేదన్న విజయ్ సర్కార్..

- మొదటి పేజీ తరువాయి

రిజర్వేషన్ బిల్లుతో ముడిపెడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదిస్తోన్న డీలిమిటేషన్ ప్రక్రియపై చర్చించేందుకు రాష్ట్ర ఎంపీలతో సీఎం విజయ్ (ఆగస్ట్ 8) అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశాన్ని ప్రధాన ప్రతిపక్షమైన డీఎంకే, అన్నాడీఎంకే, పీఎంకే, ఎండీఎండీకే బహిష్కరించాయి. అధికార టీవీకే కూటమికి చెందిన కాంగ్రెస్, వీసీకే, సీపీఐ, సీపీఐ(ఎం), ఎండీఎంకే, ఐయూఎంఎల్ పార్టీల ప్రతినిధులు మాత్రమే ఈ సమావేశంలో పాల్గొన్నారు. లోక్ సభ, రాజ్య సభలో రాష్ట్రానికి చెందిన మొత్తం 57 మంది ఎంపీలలో 37 మంది ఈ సమావేశానికి గైర్హాజరయ్యారు. రాబోయే 40 నుంచి 50 ఏళ్ల వరకు ప్రజాప్రతినిధుల స్థానాల్లో ఎలాంటి మార్పులు చేయొద్దని.. ప్రస్తుతమున్న లోక్‌సభ స్థానాల సంఖ్యను అలాగే కొనసాగించాలని సమావేశంలో ఏకగ్రీవంగా నిర్ణయించారు. కేంద్ర ప్రభుత్వం ఒకవేళ డీలిమిటేషన్ ప్రక్రియ చేపట్టిన 1971 జనాభా లెక్కల ప్రకారమే చేయాలని డిమాండ్ చేశారు. జనాభా నియంత్రణను సమర్థవంతంగా అమలు చేసిన తమిళనాడు లాంటి ప్రగతిశీల రాష్ట్రాల పార్లమెంటు ప్రాతినిధ్యాన్ని తగ్గించడం అన్యాయమని నేతలు ఆందోళన వ్యక్తం చేశారు.

మోదీతో సుఖ్‌బీర్ బాదల్ భేటీ.. పొత్తు పునరుద్ధరణ దిశగా బీజేపీ-శిరోమణి అకాలీదళ్ కసరత్తు?

- మొదటి పేజీ తరువాయి

ప్రధానితో జరిగిన భేటీ సానుకూలంగా జరిగిందని, పంజాబ్ అభివృద్ధి, రైతుల ప్రయోజనాలే ధ్యేయంగా కూటమి పునరుద్ధరణ దిశగా అడుగులు పడుతున్నాయని గుసగుసలు వినిపిస్తున్నాయి. గతంలో సాగు చట్టాల వివాదంతో ఎన్డీయే నుంచి బయటకు వచ్చిన అకాలీదళ్, ప్రస్తుతం పంజాబ్‌లో మారుతున్న రాజకీయ సమీకరణాల నేపథ్యంలో మళ్లీ కమలం పార్టీతో జతకట్టేందుకు ఆసక్తి చూపుతున్నట్లు తెలుస్తోంది. పార్లమెంట్ స్థానాల పునర్విభజనపై కేంద్రం తీసుకుంటున్న నిర్ణయాలకు మద్దతు పలకడం కూడా ఈ పొత్తు సంకేతాలలో భాగమేనని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ భేటీ పంజాబ్ రాజకీయాల్లో కొత్త మైత్రికి దారితీస్తుందనే చర్చలు జోరందుకున్నాయి.

ఢిల్లీ పోలీసుల్లా ప్రవర్తించొద్దు.. తన భద్రతా అధికారిపై అభిజీత్ దీప్కే ఆగ్రహం

- మొదటి పేజీ తరువాయి

అతడిని విధుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. మహారాష్ట్రలోని ఛత్రపతి శంభాజీనగర్‌లో శుక్రవారం చోటుచేసుకున్న ఈ ఘటనకు సంబంధించిన వీడియోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. నీట్ పేపర్ లీక్ వంటి విద్యార్థి సమస్యలపై పోరాటం ద్వారా 30 ఏళ్ల అభిజీత్ దీప్కే ప్రాచుర్యంలోకి వచ్చారు. ఆయనకు, ఆయన కుటుంబ సభ్యులకు ఆన్‌లైన్‌లో బెదిరింపులు రావడంతో వాలుజ్ ఎంఐడీసీ ప్రాంతంలోని ఆయన నివాసం వద్ద పోలీసులు భద్రత ఏర్పాటు చేశారు. అయితే, మఫ్టీలో ఉన్న సురేశ్ అనే ఎస్ఐ తనను కలిసేందుకు వచ్చే వారిని లోపలికి రానీయకుండా ఆటంకం కలిగిస్తున్నారని దీప్కే ఆరోపించారు. వైరల్ అవుతున్న ఓ వీడియోలో అభిజీత్ దీప్కే సదరు ఎస్ఐని నిలదీస్తూ,"నేను రమ్మని పిలుస్తున్నప్పుడు ప్రజలను అనుమతించడానికి మీకేంటి ఇబ్బంది? ఢిల్లీ పోలీసుల్లా ఎందుకు ప్రవర్తిస్తున్నారు? ఇప్పటివరకు ఎలాంటి సమస్యా తలెత్తలేదు, మిమ్మల్ని ఇప్పుడే మొదటిసారి చూస్తున్నాను. నేను ఎవరిని కలవాలి, ఎవరిని కలవకూడదు అనేది మీరు నిర్ణయించలేరు. దయచేసి ఇక్కడి నుంచి వెళ్ళిపోండి, మీరు నా ఇంట్లో ఉండాల్సిన అవసరం లేదు" అని ఆగ్రహం వ్యక్తం చేయడం కనిపించింది. మరో వీడియోలో ఆయన ఓ ఉన్నతాధికారితో ఫోన్‌లో మాట్లాడుతూ, "సురేశ్ అనే ఎస్ఐ ఇక్కడ చాలా దురుసుగా ప్రవర్తిస్తున్నారు. ఉద్దేశపూర్వకంగానే ఇలా చేస్తున్నారా? ఆయన నాకు వద్దు, వెంటనే ఇక్కడి నుంచి తొలగించండి" అని కోరారు. అంతేకాకుండా, రాష్ట్ర సీఐడీకి చెందిన సిబ్బంది మఫ్టీలో తన ఇంటి పరిసరాల్లో ఉంటూ 'హిట్ స్ప్రే' అనే వాట్సాప్ గ్రూప్ ద్వారా సమాచారాన్ని చేరవేస్తున్నారని దీప్కే ఆరోపించారు. ఓ విలేకరి ఒక అధికారి ఫోన్‌లో ఈ గ్రూప్‌ను గమనించారని ఆయన పేర్కొన్నారు.

పట్నా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ వల్లూరి కామేశ్వరరావు



హైదరాబాద్ పెన్ పవర్: పట్నా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా (సీజే) జస్టిస్ వల్లూరి కామేశ్వరరావు పేరును సిఫార్సు చేయాలని సుప్రీం కోర్టు కొలీజియం నిర్ణయించింది. జస్టిస్ కామేశ్వరరావు ప్రస్తుతం దిల్లీ హైకోర్టు న్యాయమూర్తుల్లో సీనియారిటీ పరంగా రెండో స్థానంలో ఉన్నారు. ఆయనకు పట్నా హైకోర్టు సీజే బాధ్యతలు అప్పగించాలన్న ప్రతిపాదనకు భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని సుప్రీం కొలీజియం ఆమోదం తెలిపింది. ఇదివరకు పట్నా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా పని చేసిన జస్టిస్ వి.ఎం.పంచోలి గత ఏడాది ఆగస్టు 29న సుప్రీం కోర్టు న్యాయమూర్తిగా పదోన్నతి పొందారు. జస్టిస్ కామేశ్వరరావు స్వస్థలం ఏపీలోని తూర్పుగోదావరి జిల్లా పొన్నమండ. 1965 ఆగస్టు 7న అమలాపురం అమెరికన్ ఆసుపత్రిలో జన్మించారు. ఉద్యోగరీత్యా తండ్రి వాసుదేవ మూర్తి దిల్లీలో స్థిరపడటంతో ఆయన దేశ రాజధానిలోనే పెరిగారు. 1991లో దిల్లీ బార్ కౌన్సిల్‌లో పేరు నమోదు చేసుకుని న్యాయవాద వృత్తి ప్రారంభించారు.

పెన్ పవర్

తెలంగాణ రౌండప్

బీసీ కులగణన చేపట్టినా పూర్తిస్థాయిలో

నెరవేరని లక్ష్యాలు

తదుపరి కార్యాచరణతో ఐక్యంగా ముందుకు సాగుదాం: బీసీ మంత్రులు

హైదరాబాద్ పెన్ పవర్: రాష్ట్రంలో బీసీ కులగణన చేపట్టినా ఆ వర్గాల ఆకాంక్షలు, లక్ష్యాలు పూర్తిస్థాయిలో నెరవేరలేదనే అంశంపై తదుపరి కార్యాచరణతో ఐక్యంగా ముందుకు సాగాలని కాంగ్రెస్ పార్టీకి చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలు నిర్ణయించారు. ఈ వర్గాల సామాజిక, ఆర్థిక, రాజకీయ అభ్యున్నతికి బీసీ ఉప ప్రణాళికను ఏర్పాటు చేసి నిధులు కేటాయించే అంశంపై కృషి చేయాలని నిర్ణయించారు. శనివారం హైదరాబాద్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్ నివాసంలో బీసీ వర్గాలకు చెందిన మంత్రులు వాకిటి శ్రీహరి, కొండా సురేఖ, ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్, ప్రభుత్వ సలహాదారు కె.కేశవరావు, ఎమ్మెల్యేలు మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్, నవీన్‌యాదవ్, వీర్లపల్లి శంకర్ తదితరులు సమావేశమై పలు అంశాలపై చర్చించారు. పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, ఎమ్మెల్యే దానం నాగేందర్ జూమ్ ద్వారా పాల్గొన్నారు. బీసీల సమస్యలు, సంక్షేమ కార్యక్రమాల అమలు తదితర అంశాలకు సంబంధించి తదుపరి కార్యాచరణపై సమావేశంలో విస్తృతంగా చర్చించారు. హైదరాబాద్ హెచ్‌ఎండీఏ గ్రౌండ్స్ పక్కన ఏర్పాటు చేసిన మహాత్మా జ్యోతిరావు ఫులె, సావిత్రిబాయి ఫులె విగ్రహాలను ఈ నెల 14న, ట్యాంక్‌బండ్‌పై సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహాన్ని ఈ నెల 18న ఆవిష్కరించాలని... ఈ కార్యక్రమాలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఆహ్వానించాలని నిర్ణయించారు. ముఖ్యమంత్రికి బీసీల సమస్యలను వివరించి, పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకునేలా చూడాలన్నారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడతల వారీగా విడుదల చేసేలా చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు.

- ఆగస్టు 9, 10 తేదీల్లో లాల్‌దర్వాజా బోనాల సందర్భంగాలిలి పాతబస్తీలో భారీ ట్రాఫిక్ ఆంక్షలు, మళ్లింపులు.
- మదీనా ఎక్స్ రోడ్స్ నుంచి ఇంజిన్ బౌలి వరకు ప్రధాన రహదారి పూర్తిగా మూసివేత.
- పలు ప్రాంతాల్లో లిలిప్రత్యామ్నాయ మార్గాలు, ప్రత్యేక పార్కింగ్ ఏర్పాట్లులిలి చేసినట్లు పోలీసులు తెలిపారు.
- వాహనదారులు లిలిముందుగానే ప్రయాణాన్ని ప్లాన్ చేసుకోవాలనిలిలి ట్రాఫిక్ పోలీసులు సూచించారు.

బోనాల సందర్భంగా హైదరాబాద్‌లో

ట్రాఫిక్ ఆంక్షలు..

ఆగస్ట్ 9, 10.. ఈ రెండ్రోజులు ఆ రోడ్ పూర్తిగా క్లోజ్ !

- మిగతా 4లో...

యాదాద్రి టెండర్లపై వివాదం

బొగ్గు, బూడిద నిర్వహణ పనులను ప్రైవేటు సంస్థకు అప్పగించనున్న జెన్‌కో

పర్యవేక్షణ తమకే అప్పగించాలని ఇంజినీర్ల పట్టు

హైదరాబాద్ పెన్ పవర్: రాష్ట్రంలోని థర్మల్ విద్యుత్ ప్లాంట్లలో బొగ్గు(కోల్), బూడిద(యాష్)ల నిర్వహణ(హ్యాండ్లింగ్) పనుల వ్యయం పెంచి జెన్‌కో పిలిచిన టెండర్లపై తీవ్ర చర్చ సాగుతోంది. ఎన్నో ఏళ్లుగా వీటిని ప్రైవేటు కంపెనీలకు అప్పగిస్తున్నా నల్గొండ జిల్లా దామెరచర్లలోని యాదాద్రి విద్యుత్కేంద్రం టెండర్లపై ఉద్యోగులు నిరసన వ్యక్తం చేస్తుండటం గమనార్హం. ఇతర ప్లాంట్లలో ఈ పనులు ప్రైవేటు కంపెనీలకు అప్పగించినా వాటిపై పర్యవేక్షణ బాధ్యతలన్నీ జెన్‌కో ఇంజినీర్లకే ఉన్నాయి. పనులు చేసేది ప్రైవేటు కంపెనీలు అయినప్పుడు వాటిపై పర్యవేక్షణ తమ ఇంజినీర్లకు ఉండటంతో ఏదైనా సమస్య జరిగితే ఇబ్బందులు వస్తున్నాయని యాదాద్రిలో కొత్త విధానం అమల్లోకి తెచ్చినట్లు జెన్‌కో పేర్కొంటోంది. టెండర్ పొందిన కంపెనీకే రోజువారీ పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించాలని తాజా విధానంలో తెలిపింది. కానీ దీనివల్ల తమకు పట్టు ఉండదని, తమకే పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించాలని జెన్‌కో ఇంజినీర్లు పట్టుబడుతున్నారు. కేవలం పర్యవేక్షణ పనులకే ఇంజినీర్లు ఎందుకు పట్టుబడుతున్నారని ఉన్నతాధికారులు ప్రశ్నించినట్లు

-4లో

నిరుద్యోగులపై ప్రభుత్వం కర్కశంగా వ్యవహరిస్తోంది

హైదరాబాద్ పెన్ పవర్: నిరుద్యోగులు ఉద్యోగాల కోసం రోడ్లపైకి వస్తే రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కర్కశంగా వ్యవహరిస్తోందని మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. విద్యార్థులు, నిరుద్యోగులు అంటే కాంగ్రెస్ ప్రభుత్వానికి ఎందుకంత కక్ష అని ప్రశ్నించారు. నిరుద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తూ శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. “ఎన్నికల సమయంలో ఉద్యోగాలు ఇస్తామని హామీలు గుప్పించారు. హైడ్రాలో 150 డ్రైవర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇస్తే వేల మంది నిరుద్యోగులు దరఖాస్తు చేసుకునేందుకు తరలివచ్చారు. ఇది నిరుద్యోగుల తప్పా, లేదంటే ఉద్యోగాలు కల్పించడంలో విఫలమైన మీ ప్రభుత్వం తప్పా? అధికారంలోకి వచ్చిన మొదటి ఏడాదిలోనే రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని నాడు హామీ ఇచ్చారు. ఇప్పటికి 32 నెలలు దాటింది. హామీ ఏమైంది?” అని సీఎం రేవంత్‌రెడ్డిని ప్రశ్నించారు.

01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసిఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
' ఐదు రోజులకు '
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

150 పోస్టులు.. వేల మంది అభ్యర్థులు

హైడ్రా ఉద్యోగాలకు పోటెత్తిన నిరుద్యోగులు

స్వల్ప తోపులాట.. టోకెన్ల జారీలో గందరగోళం

హైదరాబాద్ పెన్ పవర్: హైడ్రాలో 150 ఉద్యోగాల భర్తీకి హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన ఎంపికలకు వేల మంది నిరుద్యోగులు తరలివచ్చారు. 100 డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్(డీఆర్ఎఫ్), 50 హెవీ వెహికల్ డ్రైవర్ పోస్టుల భర్తీకి శని, ఆదివారాల్లో సరూర్‌నగర్ స్టేడియంలో ఫిజికల్ ఈవెంట్లు నిర్వహించనున్నట్లు హైడ్రా ప్రకటించింది. దీంతో వివిధ జిల్లాలకు చెందిన నిరుద్యోగులు భారీ సంఖ్యలో శనివారం తెల్లవారుజామునే స్టేడియం వద్దకు చేరుకున్నారు. అభ్యర్థులు ఒకేసారి లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించడంతో స్వల్పంగా తోపులాట చోటుచేసుకుంది. అభ్యర్థులను క్రమబద్ధీకరించే క్రమంలో ఓ అధికారి పరుషంగా మాట్లాడటం కొంత ఉద్రిక్తతకు దారితీసింది. అనంతరం అధికారులు అభ్యర్థులకు నచ్చజెప్పడంతో పరిస్థితి సద్దుమణిగింది. దరఖాస్తుల స్వీకరణ, ఫిజికల్ టెస్టులకు టోకెన్ల జారీ సమయంలో కొంత గందరగోళం నెలకొంది. పోలీసులు రంగంలోకి దిగి అభ్యర్థులను విడతలవారీగా లోనికి పంపించారు. సుమారు 3 వేల మంది శనివారం నాటి

ఎంపికల్లో పాల్గొన్నట్లు సమాచారం. అభ్యర్థులు 800 మీటర్ల పరుగును 170 సెకన్లలో..100 మీటర్ల పరుగును 15 సెకన్లలో పూర్తి చేయడంతోపాటు లాంగ్‌జంప్, షాట్‌పుట్ అంశాల్లో ప్రతిభ కనబర్చాల్సి ఉంది.

వాహనాల ఓవర్‌టేకింగ్‌కుమూడో లేన్

3 కి.మీ.కి ఒకసారి కుడి నుంచి ఎడమకు... ఎడమ నుంచి కుడికి మారుస్తూ ఏర్పాటు

శ్రీశైలం ఎలివేటెడ్ కారిడార్‌లో సరికొత్త నమూనా

'మోర్త్' ఎలైన్‌మెంట్ అప్రూవల్ కమిటీ నిర్ణయం

హైదరాబాద్ పెన్ పవర్: నల్లమల అడవుల్లోంచి అమ్రాబాద్ టైగర్ రిజర్వు మీదుగా ప్రతిపాదించిన శ్రీశైలం ఎలివేటెడ్ కారిడార్‌కు కేంద్రం వినూత్న డిజైన్ ఖరారు చేసింది. 2 లేన్లతో పాటుగా పాసింగ్ లేన్ నమూనాలో నిర్మించేలా ప్రాజెక్టును అమలుచేయాలని కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖ (మోర్త్) నిర్ణయించింది. ఇందులో మూడో వరుస రోడ్డు ప్రతి 3 కి.మీ.కి ఒకసారి కుడి నుంచి ఎడమకు..ఎడమ నుంచి కుడికి మారుతూ ఉంటుంది. వెనుక నుంచి వేగంగా వచ్చే వాహనాలు ముందు వాహనాల్ని సురక్షితంగా ఓవర్‌టేక్ చేసేందుకు పాసింగ్ లేన్‌ను చేర్చింది.

నిర్మాణ వ్యయం తగ్గించేలా...

జాతీయ రహదారి-765లో భాగంగా హైదరాబాద్-శ్రీశైలం సెక్షన్‌లో రోడ్డును విస్తరించేందుకు అమ్రాబాద్ టైగర్ రిజర్వులో వన్యప్రాణుల రక్షణ ఇబ్బందిగా మారడంతో ఫ్లైఓవర్ తరహాలో ఎలివేటెడ్ కారిడార్‌గా చేపట్టనున్నారు. తెలంగాణ పరిధిలో నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట మండలం బ్రాహ్మణపల్లి నుంచి మొదలై మన్ననూరు మీదుగా పాతాళగంగ వరకు ఎలివేటెడ్ కారిడార్‌ను రూపకల్పన చేశారు. ఆ తర్వాత ఆంధ్రప్రదేశ్ పరిధిలోనూ ఈ కారిడార్ చేపడతారు. అయితే ప్రారంభంలో ఈ ప్రాజెక్టును నాలుగు లేన్లుగా ప్రతిపాదించగా... మన్ననూరు-శ్రీశైలం మధ్య ప్రస్తుత ట్రాఫిక్ పరిమాణానికి ఇది ఆర్థికంగా సమంజసం కాదని కేంద్రం అభిప్రాయపడింది. ప్రాజెక్టు నిర్మాణ వ్యయంలో 33% వాటా భరించడంతోపాటు సీనరేజ్ మినహాయింపు, రాష్ట్ర జీఎస్టీ రీయింబర్స్‌మెంట్‌కు కూడా తెలంగాణ ప్రభుత్వం ఆమోదం తెలపడంతో కేంద్రం ఈ ప్రాజెక్టును సూత్రప్రాయంగా ఆమోదించి ముందుకు తీసుకెళుతోంది. నిర్మాణ వ్యయాన్ని తగ్గించేందుకు 2 లేన్, పాసింగ్ లేన్ నమూనాలో చేపట్టేందుకు 'మోర్త్' ఎలైన్‌మెంట్ అప్రూవల్ కమిటీ తాజాగా తుది ఆమోదం తెలిపింది.

రోడ్డు రెండు వరుసలే...

శ్రీశైలం ఎలివేటెడ్ కారిడార్‌ను భూమిపైన సుమారు 30 అడుగుల ఎత్తులో నిర్మిస్తారు. ఈ ప్రాజెక్ట్‌లో మూడో లేన్ ఆసక్తికర అంశం. ఏకధాటిగా రోడ్డు ఉండేది రెండే లేన్లు.. కానీ ఓవర్‌టేకింగ్‌కు మూడో లేన్ ఉంటుంది. అది ఒకవైపు మాత్రమే ఉండదు. ఒకసారి ఎడమవైపు 3 కి.మీ. మేర మూడో వరుస రోడ్డు ఉంటే.. ఆ తర్వాత కుడివైపునకు మారుతుంది. 3 కి.మీ. అయ్యాక మూడో లేన్ మళ్లీ ఎడమకు మారుతుంది. ముందు నెమ్మదిగా వెళ్లే వాహనాలను వెనుక నుంచి వచ్చేవాళ్లు సురక్షితంగా ఓవర్‌టేక్ చేయడానికి అవకాశం లభిస్తుంది. ఈ వినూత్న నమూనాతో నిర్మాణ వ్యయం తగ్గడంతోపాటు భూసేకరణ కూడా తగ్గనుంది. అటు ఎలివేటెడ్‌తోపాటు ఇటు పాసింగ్ లేన్‌తో ఉన్న తొలి ప్రాజెక్ట్ రాష్ట్రంలో ఇదే కానుంది. రాష్ట్రంలో ఈ ప్రాజెక్ట్‌ను మొత్తం 54.91 కి.మీ. పొడవులో చేపట్టనుండగా ఇందులో 45.19 కి.మీ. ఎలివేటెడ్ కారిడార్‌గా నిర్మిస్తారు.

ట్రాఫిక్ రద్దీ నియంత్రణకు టీమార్స్

టీజీసీఎస్‌బీ.. ఈగల్ తరహాలో త్వరలోనే సరికొత్త బ్యూరో

900 మంది పోలీసులతో రోడ్డు భద్రతకు ప్రాధాన్యం

ట్రాఫిక్ చలానాల్లో 50% నిధులు కేటాయించే అవకాశం

ప్రభుత్వానికి చేరిన ప్రతిపాదనలు

హైదరాబాద్ పెన్ పవర్: సైబర్ నేరాల నియంత్రణకు టీజీసీఎస్‌బీ.. మాదకద్రవ్యాల కట్టడికి ఈగల్.. ఇప్పుడు ఈ కోవలోనే తెలంగాణలో మరో సరికొత్త విభాగం ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ అండ్ రోడ్ సేఫ్టీ బ్యూరో(టీమార్స్) అందుబాటులోకి రాబోతోంది. ట్రాఫిక్ ఇక్కట్ల పరిష్కారం కోసం పోలీస్ ఉన్నతాధికారుల మేధోమథనం నుంచి ఈ విభాగం రూపుదిద్దుకొంది. ఇప్పటివరకు రాష్ట్రంలో ట్రాఫిక్ విభాగాలు ఏ పోలీస్ యూనిట్‌కవే ప్రత్యేకంగా ఉన్నాయే తప్ప రాష్ట్రమంతటా ఏకరూపత లేదు. టీజీసీఎస్‌బీ, ఈగల్ మాదిరిగా రాష్ట్ర స్థాయి నుంచి పర్యవేక్షణా లేదు. రాజధాని ప్రాంతంలో తరచూ ట్రాఫిక్ ఇక్కట్లతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్న క్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి సైతం తన వాహనశ్రేణికి ట్రాఫిక్ విభాగం ఇచ్చే గ్రీన్‌ఛానల్ సదుపాయాన్ని వీలైనంత తక్కువ సమయానికి కుదించాలని ఆదేశించిన విషయం తెలిసిందే. మరోవైపు రాష్ట్రంలో జరుగుతున్న రోడ్డు ప్రమాదాల్లో ఏటా సుమారు 7 వేల మరణాలు సంభవిస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే రోడ్డు భద్రతతోపాటు ట్రాఫిక్ ఇక్కట్ల పరిష్కారం దిశగా పోలీస్ ఉన్నతాధికారులు కొత్త బ్యూరోను ప్రతిపాదించారు. ప్రభుత్వం వద్దకు చేరిన ప్రతిపాదనల దస్త్రానికి ఆమోదం లభిస్తే ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి దోహదమవుతుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

నిధుల సమీకరణకు కీలక ప్రతిపాదన

ఉల్లంఘనలకు పాల్పడిన వాహనదారులకు ట్రాఫిక్ పోలీసులు చలానాలను విధిస్తుండగా... మరోపక్క సిగ్నళ్లు సక్రమంగా పనిచేయకపోవడం.. జీబ్రా క్రాసింగ్‌లు, స్టాప్ లైన్లు తరచూ చెరిగిపోవడం.. గుంతల రోడ్లు తదితర ఇబ్బందులతో వారు విమర్శలు ఎదుర్కొంటున్నారు. వాస్తవానికి మున్సిపల్, ఆర్‌అండ్‌బీ శాఖల మధ్య సమన్వయ లోపం ఇందుకు ప్రధాన కారణం. కొత్త బ్యూరోను నెలకొల్పే క్రమంలో నిధుల సమీకరణకు ఉన్నతాధికారులు ప్రాధాన్యమిచ్చారు. ఏటా రూ.400 కోట్ల నుంచి రూ.600 కోట్ల మేర ట్రాఫిక్ చలానాల రూపంలో ప్రభుత్వానికి ఆదాయం వస్తుండగా అందులో ఒక్క రూపాయి కూడా ట్రాఫిక్ పోలీస్ విభాగానికి రావడంలేదు. ఇకపై ఇందులో 50% మేర ట్రాఫిక్ విభాగానికి కేటాయించాలని ప్రతిపాదించారు.

అదనపు డీజీపీ లేదా ఐజీ నేతృత్వం

కొత్త బ్యూరో అదనపు డీజీపీ లేదా ఐజీ నేతృత్వంలో ఏర్పాటు కానుంది. రాష్ట్రవ్యాప్తంగా 900 మంది సిబ్బందికి ప్రత్యేకంగా ట్రాఫిక్ నిర్వహణ బాధ్యతల్ని అప్పగించనున్నారు. ఇటీవలే గ్రేహౌండ్స్, ఆక్టోపస్‌ల నుంచి వెనక్కి రప్పించిన సిబ్బందిని కొత్త విభాగానికి కేటాయించనున్నారు.

రాష్ట్రవ్యాప్తంగా ట్రాఫిక్ నిబంధనల అమలులో ఒకే తరహా విధానాన్ని పాటించనున్నారు.

హైదరాబాద్‌లో వాహన విస్ఫోటం ఇలా..

రాజధాని రోడ్లపై రోజూ సంచరిస్తున్న వాహనాలు సుమారు 95 లక్షలు.

రోజుకు కొత్తగా దాదాపు 1,500 వాహనాల రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయి.

ఒక్క హైదరాబాద్ జిల్లాలోనే ఏకంగా 40.73లక్షల వాహనాలున్నాయి.

కేవలం 217 చదరపు కి.మీ. విస్తీర్ణమున్న ఈ జిల్లాలో ఒక్కో చ.కి.మీ.కు 18,770 వాహనాలున్నాయి.

బోనాల సందర్భంగా హైదరాబాద్‌లో ట్రాఫిక్ ఆంక్షలు..

ఆగస్టు 9, 10.. ఈ రెండ్రోజులు ఆ రోడ్ పూర్తిగా క్లోజ్ !

హైదరాబాద్ పెన్ పవర్: బోనాల ఉత్సవాల సందర్భంగా హైదరాబాద్‌లో ట్రాఫిక్ ఆంక్షలు, మళ్లింపులు అమల్లోకి రానున్నాయి. లాల్ దర్వాజా బోనాల సందర్భంగా ఆగస్టు 9, 10న పాతబస్తీలో భారీ ట్రాఫిక్ మళ్లింపులు ఉంటాయని.. వాహనదారులు గమనించాలని పోలీసులు సూచించారు.మదీనా ఎక్స్ రోడ్స్ నుంచి ఇంజిన్ బౌలి వరకు ప్రధాన రహదారి పూర్తిగా మూసివేస్తున్నట్లు తెలిపారు. దర్బార్ మైసమ్మ బోనాల సందర్భంగా కార్వాన్‌లో ట్రాఫిక్ మళ్లింపులు ఉంటాయని.. ఆగస్టు 8వ తేదీ రాత్రి నుంచి ఆగస్టు 10వ తేదీ ఉదయం వరకు.. మహంకాళి ఆలయం, అంబర్‌పేట్ దగ్గర ఆగస్టు 9 ఉదయం నుంచి ఆగస్టు 10 మధ్యాహ్నం వరకు ట్రాఫిక్ ఆంక్షలు ఉంటాయి.

చిలకలగూడ కట్ట మైసమ్మ-పోచమ్మ ఆలయం వద్ద 2 రోజుల పాటు ట్రాఫిక్ మళ్లింపులు

పాతబస్తీ వైపు వెళ్లే RTC బస్సులు, భారీ వాహనాలకు ప్రత్యామ్నాయ మార్గాలు

భక్తుల కోసం పలు ప్రాంతాల్లో ప్రత్యేక పార్కింగ్ ఏర్పాట్లు

వాహనదారులు ముందుగానే ప్రయాణాన్ని ప్లాన్ చేసుకోవాలని ట్రాఫిక్ పోలీసుల సూచన

ట్రాఫిక్ అత్యవసర సహాయం కోసం హెల్ప్‌లైన్: 9010203626

తెలంగాణ గ్రామ దేవతలైన మహంకాళి, ఎల్లమ్మ, పోచమ్మలకు మహిళలు భక్తిశ్రద్ధలతో సమర్పించే నైవేద్యాన్నే బోనం అంటారు. ఆషాఢ మాసంలో మహిళలు కొత్త మట్టి లేదా రాగి పాత్రలో అన్నం, పాలు, పెరుగు, బెల్లంతో బోనం తయారు చేస్తారు. ఆ పాత్రను పసుపు, కుంకుమ, వేపాకులతో అలంకరించి, పైభాగంలో దీపం వెలిగించి తలపై మోసుకుంటూ డప్పుల మోత, పోతరాజుల నృత్యాల మధ్య ఆలయాలకు ఊరేగింపుగా వెళ్తారు. అమ్మవారికి బోనం సమర్పించి పట్టు వస్త్రాలు, సారె అర్పించి తమ మొక్కులు తీర్చుకుంటారు.

యాదాద్రి టెండర్లపై వివాదం

- 3 పేజి తరువాయి

విశ్వసనీయంగా తెలిసింది. ఇప్పటికే భద్రాద్రి థర్మల్ ప్లాంటులో ఒక ఇంజినీరుపై తీవ్ర అవినీతి ఆరోపణలున్నాయి. ఈ నేపథ్యంలో గత నెలలో ప్రైవేటు కంపెనీల నుంచి ఆసక్తి వ్యక్తీకరణ కోరుతూ జెన్‌కో టెండర్ ప్రకటన జారీ చేయగా మూడు అర్హత పొందాయి. వాటిలో ఒకదానిని ఈ నెలలో ఎంపిక చేయనున్నారని తెలుస్తోంది.

రూ.180 కోట్ల నుంచి రూ.250 కోట్లకు...

యాదాద్రి ప్లాంటులో ఇప్పటికే నాలుగు యూనిట్లలో విద్యుదుత్పత్తి జరుగుతున్నా బొగ్గు కొరత, దానితోపాటు బూడిద నిర్వహణ పనులు సమస్యాత్మకంగా మారాయి. ఈ బాధ్యత నెరవేర్చడానికి ఆరు నెలలకు రూ.30 కోట్లకు తీసుకోవాలని గతంలో ఈ ప్లాంటు నిర్మాణ సంస్థ భెల్‌ను జెన్‌కో కోరింది. కానీ రూ.60 కోట్లు కావాలని భెల్ అడగటంతో ఆ ప్రతిపాదనను విరమించుకుని జెన్‌కో టెండర్లు పిలిచింది. తొలుత భెల్‌కు ఇస్తామన్న ప్రకారం లెక్కేస్తే ఈ మొత్తం రూ.180 కోట్లు కాగా... ఇప్పుడు రాబోయే మూడేళ్ల కాలానికి రూ.250 కోట్లు చెల్లిస్తామని టెండర్ ప్రకటనలో తెలిపింది. పర్యవేక్షణ ఇంజినీర్లను కూడా టెండర్ పొందిన సంస్థే నియమించుకోవాలని నిబంధన చేర్చినందున వ్యయం పెరిగినట్లు జెన్‌కో వర్గాలు చెపుతున్నాయి. పర్యవేక్షణను తమకే అప్పగిస్తే ఈ వ్యయం తగ్గుతుందని జెన్‌కో ఉద్యోగులు వాదిస్తున్నారు. మరోవైపు రామగుండం, భూపాలపల్లి, కొత్తగూడెం, భద్రాద్రిలలో పనిచేస్తున్న 60 మంది ఇంజినీర్లు, ఇతర ఉద్యోగులను యాదాద్రికి బదిలీ చేయగా ఇంతవరకు ఇద్దరే చేరారు. ప్రజాప్రతినిధులతో సిఫార్సులు చేయిస్తూ తమ బదిలీ ఉత్తర్వులను నిలిపివేయించుకుంటున్నారు. ఇప్పటివరకు యాదాద్రి నిర్వహణకు పూర్తిస్థాయిలో ఇంజినీర్ల నియామకాలు పూర్తికాలేదు. మరోవైపు రామగుండంలో 2024లో మూతపడిన థర్మల్ ప్లాంటులో జెన్‌కో 100 మందిని ఖాళీగా కూర్చోబెట్టి ఏటా రూ.కోట్లలో జీతాలను చెల్లిస్తోంది.

హైదరాబాద్ మియాపూర్‌లో పేలిన బెలూన్ సిలిండర్.. నలుగురికి గాయాలు

హైదరాబాద్ పెన్ పవర్: హైదరాబాద్‌లోని మియాపూర్ పరిధిలో శనివారం గ్యాస్ సిలిండర్ పేలి నలుగురు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. స్థానిక జీఎస్ఎం మాల్ సమీపంలో బెలూన్లలో గ్యాస్ నింపేందుకు ఉపయోగించే సిలిండర్ ఒక్కసారిగా పేలడంతో ఈ ప్రమాదం సంభవించింది. ఈ ఘటనతో ఆ ప్రాంతంలో ఒక్కసారిగా తీవ్ర కలకలం రేగింది.మాల్ వద్ద బెలూన్లు విక్రయించే వ్యక్తి వద్ద ఉన్న సిలిండర్ పేలడంతో సమీపంలో ఉన్న నలుగురు గాయపడ్డారు. వీరిలో ఐస్ క్రీమ్ బండి నడుపుకునే ఓ యువకుడి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. అతడిని వెంటనే మెరుగైన చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. గాయపడిన వారిలో ఒక కళాశాల విద్యార్థిని, ఒక ఐటీ ఉద్యోగినితో పాటు మరో వ్యక్తి ఉన్నట్లు స్థానికులు పేర్కొన్నారు.ఈ ఘటనపై సమాచారం అందుకున్న మియాపూర్ పోలీసులు తక్షణమే ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. అనంతరం కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ప్రమాదానికి గల కచ్చితమైన కారణాలు ఇంకా తెలియాల్సి ఉందని, విచారణ అనంతరం పూర్తి వివరాలు వెల్లడిస్తామని పోలీసులు తెలిపారు.

పొత్తులపై జనసేన తెలంగాణ శాఖ కీలక వ్యాఖ్యలు

హైదరాబాద్ పెన్ పవర్: తెలంగాణలో పొత్తులపై జనసేన రాష్ట్ర శాఖ అధ్యక్షుడు శంకర్ గౌడ్ కీలక వ్యాఖ్యలు చేశారు. బీజేపీతో పొత్తుల అంశాన్ని పార్టీ అధినేత పవన్ కల్యాణ్, బీజేపీ జాతీయ నాయకులు నిర్ణయిస్తారని తెలిపారు. ఈ నిర్ణయం తీసుకునే విషయం బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు పరిధిలోని అంశం పరిధిలోనిది కాదని ఆయన స్పష్టం చేశారు.

బీజేపీతో పొత్తు కుదరకపోతే తెలంగాణలో జనసేన సొంతంగా ఎన్నికల బరిలోకి దిగుతుందని శంకర్ గౌడ్ పేర్కొన్నారు. రాష్ట్రంలో జనసేనకు ఆదరణ క్రమంగా పెరుగుతోందని చెప్పారు. పవన్ కల్యాణ్ మంచి పనులు చేస్తున్నారనే నమ్మకం ప్రజల్లో ఏర్పడిందని.. దీంతో ముఖ్యంగా యువత పెద్ద సంఖ్యలో పార్టీలో చేరుతున్నారని తెలిపారు. మరోవైపు బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు రాంచందర్ రావు కూడా పొత్తులపై శుక్రవారం కీలక వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే. ఢిల్లీలో పార్టీ పెద్దలను కలిసిన అనంతరం ఆయన మాట్లాడుతూ.. జీహెచ్ఎంసీ ఎన్నికల్లో ఏ పార్టీతోనూ పొత్తు ఉండదని ప్రకటించారు. తెలంగాణలో బీజేపీ ఒంటరిగానే పోటీ చేస్తుందని స్పష్టం చేశారు.జాతీయ స్థాయిలో బీజేపీ, జనసేన మిత్రపక్షాలుగా కొనసాగుతున్నాయి. రాష్ట్రంలో మాత్రం రానున్న ఎన్నికల్లో ఇరు పార్టీల మధ్య పొత్తు ఉంటుందా? లేదా? అన్నదానిపై ప్రస్తుతం స్పష్టత లేదు.

మెట్రో. ఆర్టీసీ బస్సు కామన్ పాస్

హైదరాబాద్ పెన్ పవర్:
హైదరాబాద్‌లో ప్రజా రవాణా వ్యవస్థను ఒకే తాటిపైకి తెచ్చేందుకు తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ, హైదరాబాద్ మెట్రో రైల్ కీలక ముందడుగు వేశాయి. ప్రయాణికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తొలగించి, వారి ప్రయాణాన్ని మరింత సులభతరం చేసేందుకు కామన్ పాస్ విధానాన్ని అమలులోకి తీసుకురావాలని నిర్ణయించాయి. ఈ నిర్ణయం హైదరాబాద్ నగర రవాణా రంగంలో ఒక విప్లవాత్మక మార్పుగా నిలవనుంది. ఇప్పటి వరకు ఆర్టీసీ బస్సులకు, మెట్రో రైళ్లకు వేర్వేరుగా టికెట్లు లేదా పాస్‌లు తీసుకోవాల్సిన వచ్చేది. కానీ రాబోయే రోజుల్లో ఒకే పాస్‌తో మెట్రో రైళ్లు, నగరంలోని వివిధ రకాల ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించవచ్చు. అంతేకాకుండా, మెట్రో స్టేషన్ల నుంచి గమ్య స్థానాలకు చేరుకోవడానికి ఆర్టీసీ ఉపయోగించుకునే వెసులుబాటు కల్పించనున్నారు.ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ఆదేశాల మేరకు రవాణా శాఖ అధికారులు ఈ కార్యాచరణను వేగవంతం చేశారు. ఇటీవల బస్ భవన్‌లో ఆర్టీసీ, హెచ్ఎంఆర్ఎల్, ఎల్ అండ టీ మెట్రో అధికారులు సమావేశమై దీనిపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ కామన్ పాస్ విధానం వెనుక ప్రధానంగా మూడు లక్ష్యాలు ఉన్నాయి. ప్రయాణికులు ఆర్టీసీ బస్ దిగి మెట్రో ఎక్కేటప్పుడు లేదా మెట్రో నుంచి బస్‌కు మారేటప్పుడు పదే పదే టికెట్లు తీసుకోవాల్సి అవసరం ఉండదు. వేర్వరుగా పాస్‌లు తీసుకోవడం కంటే ఒకే పాస్ ఉండం వల్ల ప్రయాణికులకు ఛార్జీల భారం తగ్గుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం నగరంలో ప్రతి రోజూ 22 లక్షల మంది బస్సుల్లో4.7 లక్షల మంది మెట్రోలో ప్రయాణిస్తున్నారు. ఉమ్మడి పాస్‌లు వస్తే సంఖ్య మరింత పెరగవచ్చు. ప్రస్తుతానికి దీనిపై ప్రాథమిక నిర్ణయం తీసుకున్నారు. ఉమ్మడి పాస్‌ల ఛార్జీల నిర్ధారణ, పాస్‌ల రూపకల్పనపై మెట్రో అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఈ వారంలోనే ఎఖమీూా ప్రతిపాదించిన ఉమ్మడి మొబైల్ యాప్ గురించి, ఛార్జీల గురించి మరోసారి సమావేశం కానున్నారు. ఈ సమావేశంలో ధరలపై స్పష్టత వచ్చిన వెంటనే ఈ పాస్‌లను ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకురానున్నారు.
ప్రస్తుతం ఆర్టీసీలో ఉన్న డైలీ, మంత్లీ పాస్‌లనే మెట్రోకు కూడా వర్తింపజేసేలా అధికారులు ప్లాన్ చేస్తున్నారు. అదనంగా ఇప్పటి వరకు లేని వీక్లీ పాస్ సౌకర్యాన్ని కూడా కొత్తగా ప్రవేశపెట్టనున్నారు. ప్రస్తుతం ఆర్టినరీ బస్‌లకు నెలకు 1600, మెట్రో ఎక్స్‌ప్రెస్‌కు నెలకు 1800, మెట్రో డీలక్స్‌కు 2200, డైలీ పాస్ 150 రూపాయలుగా వసూలు చేస్తున్నారు. కామన్ పాస్ విధానం వస్తే, మెట్రోరైళ్లతోపాటు ఈ మూడు రకాల బస్‌లలోనూ ఒకే పాస్‌తో ప్రయాణించవచ్చు. అయితే మెట్రో రైళ్లకు మాత్రమే పరిమితమయ్యేలా డైలీ, వీక్లీ, మంత్లీ పాస్‌లను కూడా ప్రత్యేకంగా తీసుకురానున్నారు.

02
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
శుభాకాంక్షలు యాడ్స్
కేవలం
యాడ్ 300/-
'పోస్టుకార్డు సైజు'
'పో. 12 సెం.మీ, వె.16 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి'
93948 55244
షరతులు వర్తిస్తాయి

శాతవాహన అన్ని పిజి రెండవ సెమిస్టర్ పరీక్షల తేదీల విడుదల

కరీంనగర్: పెన్ పవర్: కరీంనగర్ శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలోని పిజి రెండవ సెమిస్టర్ (రెగ్యులర్, బ్యాక్ లాగ్)ఎం ఏ, ఎం కాం, ఎం ఎస్సి, ఎం బి ఏ, ఎం సి ఎ, థియరీ పరీక్షల టైమ్ టేబుల్‌ను పరీక్షల నియంత్రణ విభాగం విడుదల చేసింది. పరీక్షలు 12-08-2026 నుండి ప్రారంభమై 27-08-2026 తో ముగియనున్నాయి. పరీక్షలు మధ్యాహ్నం 2:00 గంటల నుండి సాయంత్రం 5:00 గంటల వరకు జరుగుతాయి. మరిన్ని వివరాలకు విద్యార్థులు ఆయా కళాశాలలో గాని లేదా విశ్వవిద్యాలయ వెబ్సైట్ ని సందర్శించాలని పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ డి సురేష్ కుమార్ తెలిపారు.

బోనాల పండుగ మద్యం అమ్మకాలపై నిఘా

హైద్రాబాద్, ఆగస్టు 8: పెన్ పవర్: బోనాల పండుగ సందర్భంగా మందుబాబులకు పోలీసులు బ్యాడ్ న్యూస్ చెప్పారు. పండుగ వేడుకలు ప్రశాంతంగా జరగాలనే ఉద్దేశంతో శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా నగరంలో మద్యం అమ్మకాలపై ఆంక్షలు విధిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఆగస్టు 9న జరగనున్న బోనాల ఉత్సవాల నేపథ్యంలో హైదరాబాద్, సైబరాబాద్, ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనరేట్ల పరిధిలో నిర్దేశిత సమయాల్లో వైన్ షాపులు, కల్లు దుకాణాలు, బార్లను మూసివేయనున్నారు.హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వి.సి. సజ్జనార్ జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం నగరంలో జోన్ల వారీగా ఆంక్షలు అమలులో ఉంటాయి. ముఖ్యంగా చార్మినార్ జోన్‌లో ఆగస్టు 9 ఉదయం 10 గంటల నుంచి ఆగస్టు 11 ఉదయం 10 గంటల వరకు (48 గంటలు) మద్యం దుకాణాలు, రెస్టారెంట్లకు అనుబంధంగా ఉన్న బార్‌లు పూర్తిగా మూసివేయనున్నారు. రాజేంద్రనగర్, గోల్కొండ జోన్లలో ఆగస్టు 9 ఉదయం 10 గంటల నుంచి మరుసటి రోజు (ఆగస్టు 10) ఉదయం 10 గంటల వరకు ఈ ఆంక్షలు అమల్లో ఉంటాయి. అయితే, స్టార్ హోటళ్లు, రిజిస్టర్డ్ క్లబ్బుల్లోని బార్లకు ఈ నిబంధనల నుంచి మినహాయింపు ఇచ్చారు.సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోని కూకట్‌పల్లి, అల్లాపూర్, రాయదుర్గం, జీడిమెట్ల, మేడ్చల్, చందానగర్ పోలీస్ స్టేషన్ల పరిధిలో ఆదివారం ఉదయం 10 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు మద్యం అమ్మకాలు నిలిపివేయాలని పోలీస్ కమిషనర్ ఆదేశించారు. ఇక, ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఆగస్టు 9 ఉదయం 10 గంటల నుంచి ఆగస్టు 10 ఉదయం 6 గంటల వరకు మద్యం దుకాణాలు మూసివేయనున్నారు.బోనాల పండుగ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు భద్రతా చర్యల్లో భాగంగానే ఈ నిర్ణయం తీసుకున్నట్లు మూడు కమిషనరేట్ల పోలీసులు స్పష్టం చేశారు. పండుగ వేళ వేల సంఖ్యలో భక్తులు, ప్రజలు రోడ్లపైకి వస్తారని, వారి భద్రతను దృష్టిలో ఉంచుకుని ఈ ఆంక్షలు విధించామని తెలిపారు. ప్రజలు నిబంధనలు పాటించి, పోలీసులకు సహకరించాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.

మద్యం ధరల పెంపు

హైద్రాబాద్, ఆగస్టు 8: పెన్ పవర్: మద్యం ధరలు పెంచేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధమైంది. బడ్జెట్, మిడ్-రేంజ్, ప్రీమియం సహా అన్ని రకాల బ్రాండ్ల ధరలను పెంచేందుకు కసరత్తు చేస్తోంది. దీనిపై ఏర్పాటు చేసిన సబ్-కమిటీ, సవరించిన ఎంఆర్పీ ధరలతో కూడిన నివేదికను గురువారం ప్రభుత్వానికి సమర్పించింది. ఈ నివేదికను పరిశీలించిన తర్వాత ఎక్సైజ్ శాఖ తుది నిర్ణయం తీసుకోనుంది. ఆగస్టు 15 తర్వాత ఎప్పుడైనా కొత్త ధరలు అమల్లోకి వచ్చే అవకాశం ఉందని అధికార వర్గాలు అంచనా వేస్తున్నాయి.రాష్ట్రంలో చివరిసారిగా 2022-23 ఆర్థిక సంవత్సరంలో మద్యం ధరలను సవరించారు. నిబంధనల ప్రకారం ప్రతి రెండేళ్లకోసారి ధరలను సమీక్షించాల్సి ఉన్నప్పటికీ, గత మూడేళ్లుగా పెంపుదల లేకపోవడంతో తీవ్రంగా నష్టపోతున్నామని మద్యం తయారీ సంస్థలు (డిస్టిలరీలు) ప్రభుత్వానికి విన్నవించాయి. ముడిసరుకుల ధరలు, రవాణా ఛార్జీలు, సిబ్బంది జీతాలు, పన్నుల భారం గణనీయంగా పెరిగిందని వారు తమ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం 'ధరల నిర్ణయ కమిటీ'ని ఏర్పాటు చేసి, డిస్టిలరీల ప్రతినిధులతో చర్చలు జరిపింది. పెరిగిన వ్యయాన్ని పరిగణనలోకి తీసుకుని కమిటీ ఈ నివేదికను రూపొందించింది.ప్రస్తుత పరిస్థితుల్లో 10 నుంచి 15 శాతం వరకు ధరలు పెంచాలని డిస్టిలరీలు డిమాండ్ చేస్తున్నాయి. అయితే, ధరల పెంపు విషయంలో ప్రభుత్వం ఆచితూచి వ్యవహరిస్తోంది. మద్యం ధరలను భారీగా పెంచితే, పొరుగు రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, కర్ణాటకల నుంచి మద్యం అక్రమ రవాణా పెరిగే ప్రమాదం ఉందని ప్రభుత్వం భావిస్తోంది. దీనివల్ల రాష్ట్ర ఆదాయానికి గండి పడుతుంది. అందుకే, పొరుగు రాష్ట్రాల్లోని ధరలతో పోల్చి చూసిన తర్వాతే పెంపుదల శాతాన్ని ఖరారు చేయాలని ప్రభుత్వం యోచిస్తోంది. సబ్-కమిటీ నివేదికను క్షుణ్ణంగా పరిశీలించి, త్వరలోనే ప్రభుత్వం తుది నిర్ణయాన్ని ప్రకటించనుంది.

పాతబస్తీలో మెగా డాటర్

హైదరాబాద్, ఆగస్టు 8: పెన్ పవర్: హైదరాబాద్ బోనాల జాతర ఉత్సవాల్లో మెగా డాటర్, హీరోయిన్, ప్రముఖ నిర్మాత నిహారిక కొణిదెల సందడి చేశారు. పాతబస్తీ మీర్ ఆలం మండిలోని శ్రీమహాకాళేశ్వరున్ని దర్శించి అమ్మవారికి బంగారు బోనం సమర్పించారు. మహాకాళేశ్వరుని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారికి బంగారు బోనం సమర్పించారు నిహారిక. అంతకు ముందు ఆమెకు ఆలయ ఛైర్మన్, అధికారులు, అర్చకులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. అమ్మవారికి బంగారు బోనం నైవేద్యంగా సమర్పించిన తర్వాత ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు నిహారిక. ఆమెకు అమ్మవారి శేష వస్త్రాలు, తీర్థ ప్రసాదాలు అందించారు అధికారులు. అర్చకులు వేద మంత్రోచ్చరణలతో ఆశీర్వదించారు. ఆలయ చరిత్రను ఆమెకు వివరించారు. బోనాల సందర్భంగా ఆలయం ప్రాంగణంలో సందడి వాతావరణం నెలకొంది. సంప్రదాయ దుస్తుల్లో మహిళలు తలపై బోనాలు ఎత్తుకుని ఊరేగింపుగా వెళ్లడం చిన్నప్పటి నుంచి తనను ఎంతో ఆకర్షిస్తుందని చెప్పారు నిహారిక. 'ప్రధాన బోనాల రోజున షూటింగ్స్ షెడ్యూల్స్ వల్ల రావడం వీలుపడలేదు. అందుకే ఈ రోజు అమ్మవారిని దర్శించుకుని బంగారు బోనం సమర్పించాను. కొద్ది రోజుల క్రితం బోనం సమర్పించాలని అనుకున్నా. అమ్మవారి ఆశీస్సులతో ఈ రోజు అది నెరవేరింది.' అని అన్నారు. ఈ ఫోటోలు, వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. నిహారికతో సెల్ఫీలు దిగేందుకు ఫ్యాన్స్ పోటీ పడ్డారు. వారికి అభివాదం చేస్తూ నవ్వుతూ పలకరించారు. మెగా డాటర్‌గా పలు సినిమాల్లో హీరోయిన్‌గా చేసిన నిహారిక కొణిదెల... ఆ తర్వాత పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ బ్యానర్ స్థాపించి మూవీస్ నిర్మిస్తున్నారు. ఫస్ట్ మూవీ కమిటీ కుర్రోళ్లుతోనే బిగ్ సక్సెస్ అందుకున్నారు. ఈ మూవీ రెండు విభాగాల్లో నేషనల్ అవార్డ్స్ వచ్చాయి. ఇక రెండో మూవీ రాకాస సైతం బాక్సాఫీస్ వద్ద మంచి కలెక్షన్స్ రాబట్టింది. తాజాగా, తన అన్న వరుణ్ తేజ్ హీరోగా బరి మూవీని నిర్మిస్తున్నారు. నిర్మాతగా వరుస హిట్లతో దూసుకెళు_న్నారు నిహారిక. ఎప్పుడూ షూటింగులతో బిజీగా ఉండే ఆమె... సంప్రదాయ దుస్తుల్లో అమ్మవారికి బంగారు బోనం సమర్పించడం అందరినీ ఆకర్షించింది.

నాలుగు లేబర్ కోడ్స్ రద్దు చేసి కార్మికులకు కనీస వేతనాలు కల్పించాలి

హైదరాబాద్ పెన్ పవర్:
ఎమ్మిగనూరు పట్టణంలో పోరాటాల ద్వారా సాధించుకున్న కార్మిక చట్టాలను రద్దు చేసి మోడీ ప్రభుత్వం యాజమాన్యాలు కనుగుణంగా నాలుగు లేబర్ కోడ్స్ తీసుకువచ్చిందని, అమెరికాతో భారత ప్రభుత్వం చేసుకున్న ఒప్పందాలు ద్వారా రైతులకు తీవ్రంగా నష్టం జరుగుతున్న నేపథ్యంలో వాటిని రద్దు చేయాలని కోరుతూ ఈనెల 10న నిర్వహించే క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో జైల్ భరో సందర్భంగా కార్మిక సంఘాలు ఏఐటీయూసీ, సిఐటియు, ఐఎఫ్టియు, రైతు సంఘాలు ఆధ్వర్యంలో ఎమ్మిగనూరు పట్టణంలో శ్రీనివాస్ థియేటర్ దగ్గర నుండి సోమప్ప సర్కిల్ శివ సర్కిల్ మీదుగా బంగారు బజార్, నీలకంఠేశ్వర స్వామి టెంపుల్, శ్రీనివాస్ టాకీస్ ముగించడం జరిగింది. ఈ సందర్భంగా కార్మిక రైతు సంఘం నాయకులు తిమ్మగురుడు, రాముడు, ప్రసాద్, మాలిక్, రాజు, గోవిందు, విజేంద్ర, అబ్దుల్ మాట్లాడుతూ
మోడీ అధికారం వచ్చిన తర్వాత రైతు వ్యవసాయ కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబిస్తూ కార్పొరేట్ సంస్థలకు తొత్తుగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వ రంగ సంస్థలను మూసివేయడం నిరుద్యోగ సమస్య రోజురోజు పెరుగుతున్న ఉద్యోగాలు కల్పనలో వైఫల్యం చెందారు. నిత్యవసర సరుకులు ధరలు ఆకాశమందుతున్న వాటిని తగ్గించేందుకు ఎలాంటి చర్యలు తీసుకుపోవడంతో ప్రజలపై భారం పెరిగిందని విమర్శించారు.
దేశంలో రైతులు వేసిన పంటలు కనీసం మద్దతు ధర కల్పించలేకపోవడంతో రైతుల ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని, వ్యవసాయ ఖర్చులు మరియు కమిషన్ నిర్ణయించిన ధరలకు ఉత్పత్తి పంటలపై అదనంగా 50 శాతం కలిపి మద్దతు ధర కల్పించినప్పుడే రైతులు బాగుపడతారని తెలిపారు. రాష్ట్రంలో వర్షాలు తక్కువ పడంతో రైతులు వేసిన పంటలు పూర్తిగా ఎండిపోయాయని కర్నూలు జిల్లాను కరువు ప్రాంతంగా ప్రకటించి రైతుల బ్యాంకు రుణాలు రద్దు చేయాలని కరువు పింఛన్లు రైతులకు నిత్యవసర సరుకులు పంపిణీ చేసి జిల్లా ప్రజలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.
ప్రాజెక్టుల ద్వారానే కరువు నివారణ సాధ్యం
కర్నూలు జిల్లాలో కరువు నివారణ చర్యలు భాగంగా పెండింగ్లో ఉన్న వేదవతి, గుండ్రేవుల, ఆర్డీఎస్ ప్రాజెక్టుల నిర్మాణ కే తక్షణమే నిధులు విడుదల చేసి వాటిని పూర్తి చేయడం ద్వారానే కరువు నివారణకు సాధ్యమవుతుందని తెలిపారు. దేశంలో అత్యధిక వర్షపాతం తక్కువ ఉన్న కర్నూలు జిల్లాను వెనుకబాటుకు ప్రాంతంగా కేంద్ర ప్రభుత్వం గుర్తించి అధిక నిధులు కేటాయించాలని, సాగు త్రాగునీటి ప్రాజెక్టులకు ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాలని డిమాండ్ చేశారు. హంద్రీనీవా కాల్వ ద్వారా జిల్లాలో పంటలు సాగు చేసేందుకు పంట కాలువ నిర్మాణాన్ని చేపట్టాలని డిమాండ్ చేశారు.
ఉపాధి కూలీలకు కనీస వేతనం 700 ఇవ్వాలి
ఉపాధి వ్యవసాయ కార్మికులకు కనీస వేతనం రోజుకి 700 రూపాయలు సంవత్సరానికి 200 పని రోజులు కల్పించాలని, కేంద్రం 90 శాతం రాష్ట్రం 10% నిధులు పాత పద్ధతి కొనసాగించాలని వి బి జి రామ్ జి పేరు మార్చడం ద్వారా అభివృద్ధికి సాధ్యం కాదని మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని యధావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కార్మిక రైతు సంఘం నాయకులు వీరేష్, సురేష్, నరసయ్య, రమేష్,జయన్నా, ఖాజా నాగరాజు, తిమ్మప్ప, గుంటేప్ప ,తదితరులు పాల్గొన్నారు.

40 ఆధార్ నంబర్లకు ఏకంగా 80 మంది ఉద్యోగులు

హైదరాబాద్ పెన్ పవర్:
తెలంగాణ ప్రభుత్వ పాలనా యంత్రాంగంలో విస్తుపోయే అక్రమం వెలుగులోకి వచ్చింది. ఒకే ఆధార్ నంబర్‌తో వేర్వేరు పేర్లతో ప్రభుత్వ ఉద్యోగాలు సంపాదించడమే కాకుండా, నెలకు లక్షల్లో రెండు జీతాలు దర్జాగా గుంజుతున్న ఘరానా మోసం బట్టబయలైంది. రాష్ట్ర ఆర్థిక శాఖ చేపట్టిన సాంకేతిక తనిఖీల్లో ఈ దిగ్భ్రాంతికరమైన విషయం నిగ్గుతేలింది. ప్రభుత్వ ఉద్యోగుల వివరాలను మరింత పారదర్శకంగా మార్చేందుకు ఐఎఫ్ఎంఐఎస్ పోర్టల్‌లో ఉద్యోగుల ఆధార్, సర్వీస్ వివరాల ధృవీకరణ చేపట్టాల్సిందిగా సర్కార్ ఇటీవల ఆదేశాలు జారీ చేసింది. ఈ క్రాస్ చెకింగ్ ప్రక్రియలోనే అసలు అవకతవకలు బయటపడ్డాయి.ఆర్థిక శాఖ ప్రాథమిక పరిశీలన ప్రకారం.. కేవలం 40 ఆధార్ నంబర్లకు ఏకంగా 80 మంది ఉద్యోగుల వివరాలు అనుసంధానమై ఉన్నట్లు అధికారులు గుర్తించారు. అంటే ప్రతి ఒక్క ఆధార్ నంబర్‌పై ఇద్దరేసి ఉద్యోగులు వేర్వేరు పేర్లతో ప్రభుత్వ ఖజానా నుంచి ప్రతి నెలా జీతాలు పొందుతున్నారు. ఇందులో విస్తుపోయే అంశమేమిటంటే.. ఇలా ఒకే ఆధార్‌పై రెండేసి జీతాలు తీసుకుంటున్న వారిలో ఎక్కువ మంది రెగ్యులర్ ఉద్యోగులే ఉన్నారు. ఒక్కో ఉద్యోగి హోదాను బట్టి నెలకు 1 లక్ష నుంచి ఏకంగా 4 లక్షల వరకు ప్రభుత్వ ధనాన్ని చట్టవిరుద్ధంగా డ్రా చేస్తున్నట్లు సమాచారం. ముఖ్యంగా పోలీస్, రెవెన్యూ, విద్యా శాఖ, పంచాయతీ రాజ్, ప్రజారోగ్య శాఖల్లో ఇలాంటి డూప్లికేట్ కేసులు ఎక్కువగా నమోదైనట్లు ఆర్థిక శాఖ అధికారులు ప్రాథమికంగా నిర్ధారించారు.ఐఎఫ్ఎంఐఎస్ సిస్టమ్‌లో పనిచేస్తున్న రెగ్యులర్, గ్రాంట్-ఇన్-ఎయిడ్ , తాత్కాలిక సిబ్బంది డేటాను ఆధార్‌తో అనుసంధానించి క్రాస్‌చెక్ చేయడంతో ఈ బండారం బయటపడింది. వేర్వేరు శాఖల్లో, వేర్వేరు పేర్లతో ఉద్యోగాలు చేస్తూ ఒకే ఆధార్‌ను ఉపయోగించడం వెనుక పెద్ద ఎత్తున సాంకేతిక అక్రమాలు లేదా ఐడెంటిటీ ఫ్రాడ్ ?? ఉండవచ్చని అధికారులు భావిస్తున్నారు. దీనిని తీవ్రంగా పరిగణించిన రాష్ట్ర ప్రభుత్వం.. డూప్లికేట్ ఆధార్ మ్యాపింగ్‌లపై తక్షణమే సమగ్ర విచారణ జరిపించాలని, అక్రమాలకు పాల్పడిన వారిపై నిర్దాక్షిణ్యంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించింది.ఒకటి కంటే ఎక్కువ ప్రభుత్వ సంస్థలు లేదా శాఖల నుంచి అక్రమంగా జీతాలు పొందినట్లు రుజువైతే సదరు ఉద్యోగులపై తక్షణమే శాఖాపరమైన క్రమశిక్షణ చర్యలు తీసుకోవడంతో పాటు, ఇప్పటివరకు అక్రమంగా డ్రా చేసిన ప్రభుత్వ సొమ్మును పైసా సైతం వదలకుండా రికవరీ చేయాలని స్పష్టం చేసింది. తీవ్రమైన అక్రమాలకు పాల్పడిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి జైలుకు పంపాలని ఆదేశించింది. అంతటితో ఆగకుండా.. ఈ అవకతవకలకు సహకరించిన, లేదా డ్రాయింగ్ అండ్ డిస్‌బర్సింగ్ స్థాయిలో నిర్లక్ష్యం వహించిన అధికారుల బాధ్యతను కూడా నిర్ధారించి వారిపై కూడా చర్యలు తీసుకోనున్నారు.ఈ వ్యవహారంపై అన్ని శాఖలు తక్షణమే దృష్టి సారించి, సమగ్ర విచారణ, రికవరీ మరియు క్రిమినల్ చర్యల వివరాలతో కూడిన యాక్షన్ టేకెన్ రిపోర్ట్ ను సరిగ్గా 7 రోజుల్లోగా తమకు సమర్పించాలని ఆర్థిక శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఈ స్కామ్‌తో సంబంధం ఉన్న ఉద్యోగుల్లో, సహకరించిన అధికారుల్లో తీవ్ర భయాందోళనలు మొదలయ్యాయి.

హైడ్రాలో 150 ఉద్యోగాలకు వేలల్లో అభ్యర్థులు..

సరూర్‌నగర్ స్టేడియంలో తోపులాట..

హైదరాబాద్ పెన్ పవర్:
హైదరాబాద్‌లో కొద్దిపాటి ప్రభుత్వ ఉద్యోగాల కోసం నిరుద్యోగులు ఏ స్థాయిలో ఎదురుచూస్తున్నారో చెప్పేందుకు సరూర్‌నగర్ స్టేడియంలో జరిగిన ఘటనే నిదర్శనం. 'హైడ్రా' ప్రకటించిన 150 పోస్టుల కోసం వేలాది మంది యువత తరలిరావడంతో తీవ్ర తోపులాట చోటుచేసుకుంది. దీంతో అక్కడ ఉద్రిక్త వాతావరణం నెలకొంది.వివరాల్లోకి వెళితే.. హైడ్రా విభాగంలో 100 డీఆర్ఎఫ్ అసిస్టెంట్లు, 50 హెవీ వెహికల్ డ్రైవర్ల పోస్టుల భర్తీకి అధికారులు ప్రకటన విడుదల చేశారు. దీని కోసం ఆగస్టు 8, 9 తేదీల్లో సరూర్‌నగర్ స్టేడియంలో ఉదయం 5 గంటల నుంచి ఫిజికల్ ఈవెంట్స్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 800 మీటర్ల పరుగు, 100 మీటర్ల స్ప్రింట్, లాంగ్ జంప్, షాట్‌పుట్ వంటి ఈవెంట్లలో అర్హత సాధించాలని సూచించారు.అయితే, ప్రకటించిన పోస్టుల కంటే కొన్ని వందల రెట్లు ఎక్కువగా నిరుద్యోగులు ఇవాళ తెల్లవారుజామునకే స్టేడియం వద్దకు చేరుకున్నారు. లోపలికి వెళ్లే క్రమంలో ఒకరినొకరు తోసుకోవడంతో పరిస్థితి అదుపుతప్పింది. ఈ క్రమంలో జరిగిన తోపులాటతో కొద్దిసేపు గందరగోళం నెలకొంది. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే రంగ ప్రవేశం చేసి, గుంపును చెదరగొట్టి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు.ఈ తోపులాటకు సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. కేవలం 150 ఉద్యోగాలకే ఈ స్థాయిలో పోటీ ఉందంటే రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య తీవ్రతను అర్థం చేసుకోవచ్చని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.

హైకోర్టు మళ్లీ చివాట్లు

హైదరాబాద్ నగరాన్ని వరద ముప్పు నుంచి కాపాడటానికి, చెరువులను ఆక్రమణదారుల నుంచి విముక్తి చేయడానికి రేవంత్ రెడ్డి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతతో 'హైడ్రా' (న్ణ=ూాా) వ్యవస్థను ఏర్పాటు చేసింది. రంగంలోకి దిగిన తొలి రోజుల్లోనే అనేక అక్రమ నిర్మాణాలను నేలమట్టం చేస్తూ సంచలనం సృష్టించిన ఈ సంస్థ, ప్రస్తుతం ఒక కీలకమైన న్యాయపోరాటాన్ని ఎదుర్కొంటోంది. సల్కం చెరువు పరిధిలోని ఆక్రమణలపై చర్యలు తీసుకోవడంలో జాప్యం జరగడంతో తెలంగాణ హైకోర్టు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తూ ఉన్నతాధికారులకు నోటీసులు జారీ చేసింది.నగరంలోని సల్కం చెరువు ఫుల్ ట్యాంక్ లెవల్ (ఖీూా), బఫర్ జోన్ పరిధిలో శాశ్వత నిర్మాణాలు వెలిశాయనేది ప్రధాన వివాదం. ఎంఐఎం అధినేత, ఎంపీ అసదుద్దీన్ ఒవైసీకి చెందిన విద్యాసంస్థలు ఇక్కడ అక్రమంగా భవనాలు నిర్మించాయని పిటిషనర్ కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. శాటిలైట్ చిత్రాలు, రెవెన్యూ రికార్డులను ఆధారంగా చూపుతూ, ఈ ఆక్రమణల వల్ల వర్షాకాలంలో సమీప ప్రాంతాలన్నీ జలమయమవుతున్నాయని వాదించారు. చెరువు ఉనికికే ప్రమాదం ఏర్పడినప్పటికీ, సంబంధిత యంత్రాంగం ఉపేక్ష వహిస్తోందని కోర్టులో పేర్కొన్నారు.గతంలోనే ఈ అంశంపై విచారణ జరిపిన ధర్మాసనం, చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని స్పష్టమైన ఆదేశాలిచ్చింది. అయితే ఆదేశాలు వెలువడి నెలలు గడుస్తున్నా క్షేత్రస్థాయిలో ఎలాంటి చర్యలు తీసుకోకపోవడాన్ని హైకోర్టు తీవ్రంగా పరిగణించింది. న్యాయస్థాన ఉత్తర్వులను అమలు చేయకపోవడాన్ని కోర్టు ధిక్కరణగా భావిస్తూ, హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్‌తో పాటు పురపాలక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, రెవెన్యూ, నీటిపారుదల, విద్యాశాఖల ఉన్నతాధికారులకు నోటీసులు జారీ చేసింది.ఈ వ్యవహారంలో బాధ్యులైన ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు తమ సమాధానాలను కౌంటర్ అఫిడవిట్ రూపంలో దాఖలు చేయాలని న్యాయస్థానం స్పష్టం చేసింది. తదుపరి విచారణను ఈ నెల 11వ తేదీకి వాయిదా వేసింది. అధికారులు ఇచ్చే వివరణ సంతృప్తికరంగా లేకపోతే, కోర్టు ధిక్కరణ చట్టం-1971 ప్రకారం సివిల్ లేదా క్రిమినల్ చర్యలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించింది.హైడ్రా ప్రారంభమైనప్పటి నుంచి అనేక ప్రాంతాల్లో సామాన్యుల ఇళ్లు, చిన్న తరహా వ్యాపార సముదాయాలపై బుల్డోజర్లు నడిచాయనే విమర్శలు ఉన్నాయి. అయితే రాజకీయ ప్రాబల్యం, పలుకుబడి ఉన్న బడా సంస్థలు, విద్యాసంస్థల జోలికి వెళ్లేసరికి ప్రభుత్వం వెనకడుగు వేస్తోందని, ద్వంద్వ ప్రమాణాలు పాటిస్తోందని విపక్షాలు ఆరోపిస్తున్నాయి. చట్టం ముందు అందరూ సమానులేనని నిరూపించుకోవాల్సిన బాధ్యత ఇప్పుడు యంత్రాంగంపై పడింది.హైకోర్టు తీసుకున్న ఈ కఠిన నిర్ణయం తెలంగాణ పరిపాలనా వర్గాల్లో పెద్ద ఎత్తున ప్రకంపనలు సృష్టిస్తోంది. ఇప్పటికే హైడ్రా బాధ్యతల నుంచి రంగనాథ్ ను తప్పించాలని హైకోర్టు ఆదేశించింది. ఇప్పుడు మరింత కఠిన ఆదేశాలిచ్చింది. తన విశ్వసనీయతను నిలబెట్టుకోవాలంటే ఈ న్యాయపరమైన సవాలును హైడ్రా ఎలా ఎదుర్కొంటుంది? విపక్షాల ఆరోపణలకు చెక్ పెడుతూ నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటుందా లేదా అనేది వేచి చూడాల్సి ఉంది.

మరో క్విట్ ఇండియా ఉద్యమం లా ఆగష్టు 10న జైలు భరో కార్యక్రమం

మాట్లాడుతున్న సిపిఎం నాయకులు శ్రీనివాస్

గార్ల, పెన్ పవర్, ఆగస్టు 8:కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న సంఘటిత, అసంఘటిత రంగా కార్మిక, రైతు, వ్యవసాయ కార్మిక,ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా జరిగే జైల్ భరోలో కార్మికులు, వ్య,కా,స కార్మికులు, రైతులు,యువకులు పాల్గొని జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు కందునూరి శ్రీనివాస్ పిలుపునిచ్చారు.ఈ నెల 10న జరపనున్న జైల్ భరో కార్యక్రమలో భాగంగా స్థానిక సిపిఎం కార్యాలయంలో వి.పి. వెంకటేశ్వర్లు అధ్యక్షతన సిఐటియు, రైతు, వ్యవసాయ

కార్మిక సంఘాల సంయుక్త సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు.లేబర్ కోడ్‌ను రద్దు చేయాలని, మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని రద్దు చేసి బడ్జెట్ తగ్గించే కుట్రలను తిప్పికొట్టాలని డిమాండ్ చేశారు.అమెరికాతో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం, లేబర్ కోడ్స్ రద్దు చేయాలని, అంగన్‌వాడీ, ఆశా, మధ్యాహ్న భోజన తదితర స్కీమ్ వర్కర్లకు కనీస వేతనం రూ.31 వేలు చెల్లించాలని, అన్ని పంటలకు పెట్టుబడికి అదనంగా 50 శాతం కలిపి కనీస మద్దతు ధర చెల్లించాలని, కౌలు రైతులకు గుర్తింపు కార్డులు, పంట రుణాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ పనులు 200 రోజులు కల్పించడంతో పాటు రోజుకు రూ.700 కూలీ చెల్లించాలని,పట్టణ

ఉపాధి హామీ పథకాన్ని ప్రారంభించాలని కోరారు. దళితులకు ప్రత్యేక శ్మశాన వాటికలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.ఈ సమావేశంలో సిపిఎం మండల కార్యదర్శి అలవాల సత్యవతి, ఆయా సంఘాల నాయకులు ఎ. వీరాస్వామి, ఎం. నాగమణి,కె. ఈశ్వర్ లింగం,కె. రామకృష్ణ,ఎ. రామకృష్ణ,జి. వీరభద్రం,బి. శ్రీను, ఎస్. నాగరాజు, తదితరులు ఉన్నారు

ప్రజలలో చిరస్మరణీయురాలుగా నిలిచిన 'సుభద్రమ్మ'

నివాళులర్పిస్తున్న నేతలు

గార్ల పెన్ పవర్ ఆగస్టు 8: ఎంపీటీసీ గా, సిపిఎం నాయకురాలు గా పేద ప్రజలకు సుభద్రమ్మ చేసిన సేవలు మరవలేనివని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కందునూరి శ్రీనివాస్, మండల కార్యదర్శి అలవాల సత్యవతి లు అన్నారు. మాజీ ఎంపీటీసీ,ఐద్వా, సిపిఎం సీనియర్ నాయకురాలు అలవాల సుభద్రమ్మ 7వ వర్ధంతి ని స్థానిక మంగపతి రావు భవనశీలో సిపిఎం ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్బంగా సుభద్రమ్మ చిత్ర పటానికి పుల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ వర్ధంతిలో వారు మాట్లాడుతూ అణాగారిన ప్రజలు వ్య.కా.స కూలీ లు , రైతు లు సమస్య లపై సిపిఎం, ఐద్వా ఆధ్వర్యంలో నిరంతరం పోరాటాలు చేశారని,పేద విద్యార్థుల కు చదువు లను అందించేశీదుకు సిపిఎం సీనియర్ నాయకులు ఐతపు మంగపతిరావు ఆధ్వర్యంలో స్వచ్చేందశీగా నిర్వహించిన వసతీ గృహంలో వంటలు చేసి అనేకమంది విద్యార్థుల కు ఆకలి తీర్చారని,ప్రజా సమస్యలపై ఉద్యమంచేస్తూనే,కళాకారురాలుగా గళం విప్పి ప్రజలను చైతన్యశీ చేశారని అన్నారు. ఈకార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు వి.పి.వెంకటేశ్వర్లు,ఎ.వీరాస్వామి,యం. నాగమణి,ఈశ్వర్ లింగం లు ఉన్నారు

నారాయణపూర్ రిజర్వాయర్ కు మహర్దశ

హైదరాబాద్ పెన్ పవర్:
శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టులో భాగంగా ఉన్న కరీంనగర్ జిల్లా గంగాధర మండలం నారాయణపూర్ రిజర్వాయర్ కు మహర్దశ పట్టింది. ఇక్కడి నిర్వాసితులకు పరిహారం చెల్లించడంతోపాటు, రిజర్వాయర్, గ్రావిటీ కాలువల పూర్తి కోసం ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది.చొప్పదండి నియోజకవర్గం ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి నారాయణపూర్ రిజర్వాయర్ అభివృద్ధికి రూ. 20 కోట్లు మంజూరు చేయించారు. ఇందులో భాగంగా కట్ట మరమత్తు, గ్రావిటీ కాలువల పూర్తి, బండ్ పటిష్టం చేయడం వంటి పనులను చేయనున్నారు. నిధులు మంజూరు కావడంతో రిజర్వాయర్ పనులు వేగవంతం కానున్నాయి. ప్రాజెక్టు పూర్తయితే చొప్పదండి నియోజకవర్గంతో పాటు, ప్రక్క నియోజకవర్గంలో ప్రత్యక్షంగా సుమారు 49,500 ఎకరాలకు సాగునీరు అందనుంది. అలాగే రిజర్వాయర్లో బ్యాలెన్సింగ్ నీటి ద్వారా భూగర్భ జలాలు పెరిగి మరో లక్ష ఎకరాలకు సాగునీరు అందే అవకాశం ఉంది. అంతేకాకుండా కట్టకింద ముంపునకు గురవుతున్న ఇండ్లకు, భూములకు పరిహారం అందజేయడానికి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఇప్పటికే రూ. 23.50 కోట్లు మంజూరు చేయించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మాట్లాడుతూ చొప్పదండి నియోజకవర్గం లోని సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేసి ప్రతి ఎకరాకు సాగునీరు ఇవ్వడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా నారాయణపూర్ నిర్వాసితులకు పరిహారం అందించడానికి రూ. 23.50 కోట్లు మంజూరు చేయించినట్లు తెలిపారు. కట్ట అభివృద్ధి, బండుపటిష్టం, గ్రావిటీ కాల్వల పూర్తి చేయడానికి మరో రూ. 20 కోట్లు మంజూరు చేయించినట్లు ఆయన తెలిపారు. నారాయణపూర్ రిజర్వాయర్ అభివృద్ధి కోసం నిధులు మంజూరు చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డికి ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు.

సర్పంచ్ భర్తను పరామర్శించిన చోప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

హైదరాబాద్ పెన్ పవర్: కరీంనగర్ జిల్లా గంగాధర మండలం నారాయణపూర్ గ్రామ సర్పంచ్ దీకోండ బాబాలక్ష్మి భర్త మధు అనారోగ్యంతో బాధపడుతూ కరీంనగర్ లోని వన్ హాస్పిటల్ లో చికిత్స పొందుతున్నారని తెలుసుకున్న చోప్పదండి నియోజకవర్గం మాజి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ హాస్పిటల్ కు వెళ్లి మధను శనివారం పరామర్శించారు. ఈ సందర్భంగా మధు ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్న చోప్పదండి మాజీ శాసనసభ్యులు సుంకె రవిశంకర్ మెరుగైన వైద్యం అందించాలని డా" మహేశ్వర్ రెడ్డికి సూచించారు. అలాగే కుటుంబ సభ్యులతో మాట్లాడి ధైర్యం చెప్పి, మధు త్వరగా కోలుకోని సంపూర్ణ ఆరోగ్యంతో ప్రజల మధ్యకు రావాలని ఆకాంక్షించారు.మాజి ఎమ్మెల్యే వెంట పలువురు బీ ఆర్ ఎస్ నాయకులు ఉన్నారు.

ఆదివాసీ హక్కుల పరిరక్షణకు ఐక్య ఉద్యమం

ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా మాజీ జెడ్పీటీసీ పాల్వంచ. దుర్గ పిలుపు

భద్రాద్రి కొత్తగూడెం పెన్ పవర్: ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా ఆదివాసీల హక్కులు, అస్తిత్వం, ఆత్మగౌరవం, జీవనాధారాల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ ఐక్యంగా ఉద్యమించాలని మాజీ జెడ్పీటీసీ పాల్వంచ దుర్గ పిలుపునిచ్చారు. శనివారం ఆమె మాట్లాడుతుతూ, ఆదివాసీ సమాజం దేశ సంస్కృతి, ప్రకృతి పరిరక్షణలో కీలక పాత్ర పోషిస్తోందని ఆమె పేర్కొన్నారు.

తరతరాలుగా అడవులు, భూములను ఆధారంగా చేసుకుని జీవిస్తున్న ఆదివాసీలకు రాజ్యాంగం కల్పించిన హక్కులను సంపూర్ణంగా అమలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. ముఖ్యంగా ఆదివాసీ భూముల పరిరక్షణ, అటవీ హక్కుల చట్టం అమలు, పోడు భూముల సమస్యల పరిష్కారం, గ్రామసభల హక్కుల పరిరక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు.

ఆదివాసీ ప్రాంతాల్లో విద్య, వైద్యం, తాగునీరు, రహదారులు, విద్యుత్, ఉపాధి వంటి మౌలిక సదుపాయాలను మరింత మెరుగుపరచాలని పాల్వంచ దుర్గ అన్నారు. ఆదివాసీ యువతకు ఉన్నత విద్య, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు మహిళల ఆర్థిక, సామాజిక సాధికారతకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు.

ఆదివాసీల సంస్కృతి, సంప్రదాయాలు, భాష, కళలు, ఆచారాలను కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. అభివృద్ధి పేరుతో ఆదివాసీల జీవనాధారాలకు, అస్తిత్వానికి నష్టం కలిగించే చర్యలు చేపట్టకుండా వారి అభిప్రాయాలను గౌరవించాలని కోరారు.

"జల్--జంగల్--జమీన్‌పై ఆదివాసీల హక్కులను కాపాడటమే నిజమైన అభివృద్ధి" అని ఆమె పేర్కొన్నారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా ఆదివాసీ హక్కుల సాధన కోసం ప్రజాస్వామ్య పద్ధతిలో ఐక్యంగా ముందుకు సాగాలని, హక్కుల పరిరక్షణకు నిరంతరం కృషి చేయాలని మాజీ జెడ్పీటీసీ పాల్వంచ దుర్గ పిలుపునిచ్చారు.

పిరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే, ప్రజలు సహకరించాలి

ఉమ్మడి జిల్లా గణాంక శాఖ అధికారి గుర్రం శ్రీనివాస్ గౌడ్..

హైదరాబాద్ పెన్ పవర్:
జాతీయ గణాంక శాఖ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న పిరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వేలో భాగంగా ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలోని జమ్మికుంట పట్టణంలో సర్వే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఉమ్మడి జిల్లా గణాంక శాఖ అధికారి గుర్రం శ్రీనివాస్ గౌడ్, తెలిపారు.ఈ సందర్భంగా జమ్మికుంట మున్సిపల్ కమిషనర్ గుట్టల మల్లికార్జున స్వామి, మేనేజర్ జి. రాజిరెడ్డి, జమ్మికుంట పట్టణ సీఐ రామకృష్ణ గౌడ్,లను వారి కార్యాలయాల్లో కలిసి సర్వేకు సంబంధించిన కరపత్రాలను అందజేశారు. సర్వే లక్ష్యాలు, ప్రాముఖ్యతను వివరించారు.దేశంలో ఉపాధి, నిరుద్యోగం, కార్మిక శక్తి భాగస్వామ్యం, స్వయం ఉపాధి తదితర అంశాలకు సంబంధించిన విశ్వసనీయమైన గణాంకాలను రూపొందించేందుకు ఈ సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

సర్వేలో మొదటి దశలో కుటుంబాల సాధారణ వివరాలను నమోదు చేసిన అనంతరం, ఎంపికైన కుటుంబాలను మూడు నెలల పాటు ప్రతి నెలా ఒకసారి సందర్శించి మొబైల్ ట్యాబ్ ద్వారా సమాచారాన్ని సేకరిస్తామని తెలిపారు.కుటుంబ సభ్యుల విద్యార్హతలు, విద్యాభ్యాసం, వృత్తి విద్య, ఉద్యోగం, స్వయం ఉపాధి, రోజువారీ కూలి పనులు, పని చేసిన గంటలు, వేతన వివరాలు, మహిళల ఆదాయ వనరులు తదితర వివరాలను నమోదు చేస్తామని పేర్కొన్నారు. అలాగే జొమాటో, స్విగ్గీ, రాపిడో, ఓలా, ఉబెర్ వంటి డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌ల ద్వారా పనిచేస్తున్న గిగ్ మరియు ప్లాట్‌ఫారమ్ కార్మికుల వివరాలను కూడా సేకరిస్తామని తెలిపారు.ఈ సర్వే ద్వారా సేకరించిన సమాచారం పూర్తిగా గోప్యంగా ఉంచబడుతుందని, గణాంకాల రూపకల్పనకు మాత్రమే వినియోగిస్తామని ఆయన తెలిపారు. ప్రజలు ఎలాంటి సందేహాలు లేకుండా సరైన సమాచారాన్ని అందించి సర్వే విజయవంతం కావడానికి సహకరించాలని గుర్రం శ్రీనివాస్ గౌడ్, విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో స్థానిక వార్డు కౌన్సిలర్ మాచర్ల రాజు గౌడ్, బిల్ కలెక్టర్ గుంటి సాయికృష్ణ, మెప్మా సెక్షన్ సిబ్బంది బండి రజిత, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు..

యూఏఈ బతుకమ్మ సంబరాలకు కేటీఆర్‌కు ఆహ్వానం

హైదరాబాద్ పెన్ పవర్:
యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ)లో నిర్వహించనున్న బతుకమ్మ సంబరాలకు ముఖ్య అతిథిగా హాజరు కావాలని భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ను ఎమిరేట్స్ తెలంగాణ కల్చరల్ అండ్ వెల్ఫేర్ అసోసియేషన్ (ఈటీసీఏ--యూఏఈ) ప్రతినిధులు ఆహ్వానించారు. ఈ మేరకు శుక్రవారం నంది నగర్‌లోని కేటీఆర్ నివాసంలో ఆయనను కలిసి ఆహ్వాన పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా బతుకమ్మ వేడుకలకు సంబంధించిన పోస్టర్‌ను కేటీఆర్ చేతుల మీదుగా విడుదల చేశారు.ఈటీసీఏ ఆధ్వర్యంలో గత 16 సంవత్సరాలుగా యూఏఈలో బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహిస్తున్నామని ప్రతినిధులు కేటీఆర్‌కు తెలిపారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు అద్దం పట్టేలా ప్రతి ఏటా బతుకమ్మతో పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని వివరించారు. ఈసారి అక్టోబర్ 11, 2026న దుబాయ్‌లోని అల్ అహిలి స్పోర్ట్స్ క్లబ్లో నిర్వహించనున్న బతుకమ్మ సంబరాలకు ముఖ్య అతిథిగా హాజరు కావాలని కేటీఆర్‌ను కోరారు.

గల్ఫ్ కార్మికుల పరిస్థితులపై ఆరా

ఈ సందర్భంగా ఈటీసీఏ ప్రతినిధులతో సమావేశమైన కేటీఆర్ గల్ఫ్‌లోని తెలంగాణ కార్మికుల పరిస్థితులు, ఉపాధి అవకాశాలు, వారు ఎదుర్కొంటున్న సమస్యలు తదితర అంశాలపై ఆరా తీశారు. తెలంగాణ నుంచి గల్ఫ్ దేశాలకు వెళ్లిన కార్మికుల ప్రస్తుత పరిస్థితులు, వారి సంక్షేమానికి సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు.

తెలంగాణకు దూరంగా గల్ఫ్ దేశాల్లో నివసిస్తున్నప్పటికీ తమ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుతూ బతుకమ్మతో పాటు ఇతర సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తున్న ఈటీసీఏ ప్రతినిధులను కేటీఆర్ అభినందించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రపంచవ్యాప్తంగా చాటిచెప్పడంలో ప్రవాస తెలంగాణ సంఘాలు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు.ఈటీసీఏ కేవలం సాంస్కృతిక కార్యక్రమాలకే పరిమితం కాకుండా గల్ఫ్ కార్మికుల కష్టనష్టాల్లోనూ అండగా నిలుస్తూ, ఇబ్బందుల్లో ఉన్న తెలంగాణ బిడ్డలకు సహాయ సహకారాలు అందిస్తున్న తీరు గొప్పదని కేటీఆర్ అన్నారు. గల్ఫ్‌లో తెలంగాణ కార్మికులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా తమ వంతు సహకారం అందిస్తామని ఆయన హామీ ఇచ్చారు.

సొంత నానమ్మ డెట్ సిర్టీఫికేట్ సృష్టించిన కాంగ్రెస్ నేత

హైదరాబాద్ పెన్ పవర్:
కాంగ్రెస్ పార్టీ కోఆర్డినేటర్ అరాచకాలు బయటపడ్డాయి. కాంగ్రెస్ సోషల్ మీడియా కోఆర్డినేటర్ శ్రీహరి గౌడ్ సొంత నానమ్మ ఫేక్ డెత్ సర్టిఫికెట్ సృష్టించి, భూమిని కబ్జా చేసాడని బంధువులు ఆరోపించారు. దుర్గం శ్రీహరి గౌడ్, 2023 లో ఫేక్ సర్టిఫికెట్ సృష్టించాడు. దానని నిలదీసిన బాబాయ్ భార్య, కొడుకుపై విచక్షణారహితంగా దాడి చేసాడు. తన భర్త పేరిట ఉన్న ఇంటి స్థలాని తన పేరు మీదకు బదిలీ చేయాలని జీహెచ్ఎంసి కార్యాలయానికి మహిళ వెళ్లింది. ఈ సమయంలో శేరిలింగంపల్లి కాంగ్రెస్ సోషల్ మీడియా కోఆర్డినేటర్ శ్రీహరి గౌడ్ తన భర్త పేరిట ఫేక్ డెత్ సర్టిఫికెట్ సృష్టించి, భూమిని తన పేరుమీదకు బదిలీ చేయించుకున్నాడని భార్య గుర్తించింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి విచారణ జరిపించారు. న్యాయం కోసం శ్రీహరి గౌడ్ ఇంటి ముందు అతని బాబాయ్ భార్య, ఆమె కొడుకు నిరసనకు దిగారు. దీంతో కోపంలో బాబాయ్ భార్య, కొడుకు అని కూడా చూడకుండా వారిపై విచక్షణారహితంగా శ్రీహరి గౌడ్, అతని సోదరుడు సతీష్ గౌడ్ దాడి చేసారు. దాడి చేశారని ఫిర్యాదు చేయగా, కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ జగదీశ్వర్ గౌడ్ ఆదేశాల మేరకు నిందితులపై పోలీసులు కేసు నమోదు చేయడం లేదని బాధితులు ఆరోపిస్తునన్నారు.

ఫిర్యాదు చేసేందుకు ప్రయత్నిస్తున్నారని తెలిసి బాధితులను చంపేస్తామని బెదిరింపులకు పాల్పడుతున్నాడని ఆరోపించారు.

ఒంటరిగా బరిలోకి జనసేన

హైదరాబాద్, ఆగస్టు 8, పెన్ పవర్:
తెలంగాణలో జనసేనతో పొత్తు లేదని బిజెపి సంకేతాలు ఇచ్చింది. ఢిల్లీ వేదికగా తెలంగాణ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలతో ప్రత్యేక భేటీ జరిగింది. అయితే అక్కడే జనసేనతో పొత్తుపై చర్చ జరిగింది. అయితే జనసేనతో పొత్తు అనేది ఏపీకి మాత్రమే పరిమితం అని.. తెలంగాణలో లేదని క్లారిటీ ఇచ్చింది బిజెపి. : తెలంగాణలో జనసేనతో పొత్తు లేదని బిజెపి సంకేతాలు ఇచ్చింది. ఢిల్లీ వేదికగా తెలంగాణ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలతో ప్రత్యేక భేటీ జరిగింది. అయితే అక్కడే జనసేనతో పొత్తుపై చర్చ జరిగింది. అయితే జనసేనతో పొత్తు అనేది ఏపీకి మాత్రమే పరిమితం అని.. తెలంగాణలో లేదని క్లారిటీ ఇచ్చింది బిజెపి. దీంతో సొంతంగానే పోటీకి సిద్ధమవుతోంది జనసేన తెలంగాణలో. త్వరలో జరిగే గ్రేటర్ ఎన్నికలతో పాటు ప్రభావం చూపించగలిగిన జిల్లాల్లో ప్రాదేశిక ఎన్నికల్లో సైతం పోటీ చేయాలని చూస్తోంది జనసేన. అయితే ఉన్నట్టుండి బిజెపి జనసేన విషయంలో ఆ ఆలోచన చేయడానికి కారణం ఏంటనే ప్రశ్న వినిపిస్తోంది. భారత రాష్ట్ర సమితి తో బిజెపి పొత్తు ఉంటుందన్న పరిణామ క్రమంలోనే జనసేన ను దూరం పెట్టినట్లు తెలుస్తోంది. అయితే జనసేన మాత్రం ఒంటరి పోరాటానికి అన్ని ఏర్పాట్లు మొదలుపెట్టినట్లు సమాచారం.వాస్తవానికి ఏపీ మాదిరిగా తెలంగాణలో రాజకీయాలు ఉండవు. బిజెపి ఆది నుంచి స్వంతంగా ఎదిగేందుకు ప్రయత్నాలు చేస్తూ వస్తోంది. కానీ ఆశించిన స్థాయిలో ఆ ప్రయత్నాలు ఏవి ఫలించడం లేదు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో మాత్రం గట్టి ప్రభావం చూపింది. అధికార కాంగ్రెస్ పార్టీతో సమానంగా ఎనిమిది పార్లమెంట్ స్థానాలను తెచ్చుకుంది. అయితే బిజెపి అంతలా ప్రభావం చూపడానికి కారణం భారత రాష్ట్ర సమితి బలహీనం కావడమే. అయితే ఇప్పటికీ గ్రామీణ ప్రాంతాల్లో బిజెపి బలపడలేదు. ఆ బలాన్ని భర్తీ చేయాలంటే భారత రాష్ట్ర సమితితో పొత్తు బిజెపికి అవసరం. అదే సమయంలో పూర్వవైభవం దిశగా అడుగులు వేయాలంటే ఓట్లతో పాటు సీట్లు పెంచుకోవడం భారత రాష్ట్ర సమితికి అవసరం. అందుకే ఆ రెండు పార్టీలు ఇప్పుడు పరస్పరం ఒక అవగాహనకు వచ్చినట్లు తెలుస్తోంది. జనసేన ను బిజెపి దూరం పెట్టడానికి అదే ప్రధాన కారణం అని ఢిల్లీ వర్గాలు చెబుతున్నాయి.తెలంగాణలో మొన్న ఆ మధ్యన జరిగిన పరిణామాలు తెలియనివి కావు. పవన్ కళ్యాణ్ ను తెలంగాణ నుంచి కొంతమంది వ్యతిరేకించడం ప్రారంభించారు. దీంతో తెలంగాణలో కార్యకలాపాలు మొదలు పెట్టింది జనసేన. హైదరాబాదులో రాష్ట్ర కార్యాలయాన్ని కూడా ప్రారంభించారు. అయితే బిజెపితో పొత్తు ఉంటుందన్న తరుణంలోనే ఇలా చేస్తున్నారని అంతా భావించారు. కానీ భారతీయ జనతా పార్టీ ఆలోచన మరోలా ఉంది. అందుకే జనసేనతో పొత్తు విషయంలో క్లారిటీ ఇచ్చింది. కానీ ఏపీ అనుభవాల నేపథ్యంలో ఒంటరిగా ముందు పోటీ చేసి.. ఓట్ల శాతాన్ని పెంచుకుంటే ఇతర పార్టీలు పొత్తుకు ముందుకు వస్తాయని.. అందుకే ఒంటరిగా ముందుకు వెళ్దామని జనసేన వర్గాలు ఒక నిర్ణయానికి వచ్చాయి. సెటిలర్స్ అధికంగా ఉన్న ప్రాంతాలతో పాటు అభిమానులు ఉన్నచోట పార్టీని మరింత బలోపేతం చేయాలని జనసేన భావిస్తోంది. అందుకు అనుగుణంగా అడుగులు వేస్తోంది.

దోమల నివారణకు ప్రత్యేక మాన్సూన్ డ్రైవ్

ప్రతి శుక్రవారం 'ఫ్రైడే-డ్రైడే' పాటించాలి

ఆగస్టు 11 నుంచి 21 వరకు స్పెషల్ మాన్సూన్ డ్రైవ్లో భాగంగా IEC కార్యక్రమం!

హైదరాబాద్ పెన్ పవర్:
నగరంలో దోమల ద్వారా వ్యాప్తి చెందే వ్యాధులను అరికట్టేందుకు జీహెచ్ఎంసీ ఎంటమాలజీ విభాగం ఆధ్వర్యంలో ప్రత్యేక చర్యలు చేపడుతున్నాం. ఆగస్టు 11 నుంచి 21వ తేదీ వరకు చేపట్టనున్న స్పెషల్ మాన్సూన్ డ్రైవ్లో భాగంగా దోమల నివారణపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు మినిస్టర్ క్వార్టర్స్లో ×జుజ కార్యక్రమాన్ని మంత్రి ఫ?న్నం ప్రబాకర్ ప్రారంభించారు.
ఈ సందర్భంగా దోమల నివారణకు ఎంటమాలజీ విభాగం ఉపయోగిస్తున్న వివిధ పరికరాలను పరిశీలించి, వాటి పనితీరును అధికారులను అడిగి తెలుసుకున్నారు.
మంత్రి మాట్లాడుతూ దోమల నివారణకు విస్తృత చర్యలు దోమల ద్వారా వ్యాప్తి చెందే వ్యాధులను అరికట్టేందుకు ముందస్తు చర్యల్లో భాగంగా పలు కార్యక్రమాలు చేపడుతున్నాం. ప్రతి శుక్రవారం 'ఫ్రైడే--డ్రైడే' కార్యక్రమం నిర్వహిస్తున్నాం. ఇంటింటికీ వెళ్లి నీరు నిల్వ ఉండకుండా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. దోమల లార్వాలు వృద్ధి చెందే ప్రాంతాలను గుర్తించి యాంటీ లార్వా ఆపరేషన్స్ నిర్వహిస్తున్నాం. జీహెచ్ఎంసీ పరిధిలో విస్తృతంగా ఫాగింగ్ చేపడుతున్నాం. దోమల నివారణపై కరపత్రాల ద్వారా అవగాహన కల్పిస్తున్నాం. పాఠశాలల్లో విద్యార్థులకు దోమల నివారణ, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని అన్నారు.
వర్షాల కారణంగా నిల్వ ఉన్న నీటిని తొలగించేలా ప్రజలకు సూచనలు చేస్తున్నాం. ప్రజలు స్వీయ బాధ్యతతో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. హైదరాబాద్ ప్రజల ఆరోగ్య పరిరక్షణలో భాగంగా జీహెచ్ఎంసీ ద్వారా ఇంటింటికీ వెళ్లి పరిసరాల పరిశుభ్రత, దోమల నివారణపై అవగాహన కల్పిస్తున్నాం. ప్రజలందరూ స్వీయ బాధ్యతతో తమ ఇళ్లను, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. ప్రతి శుక్రవారం 'ఫ్రైడే--డ్రైడే' కార్యక్రమంలో భాగంగా ఇళ్లలో, పరిసరాల్లో నిల్వ ఉన్న నీటిని తొలగించి దోమల లార్వాలు పెరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. డెంగ్యూ, చికున్గున్యా వంటి వ్యాధులు రాకుండా ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపడుతోంది. ప్రజలు కూడా ప్రభుత్వానికి సహకరించి తమ ఇళ్ల పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలి. ప్రభుత్వం ఎన్ని చర్యలు చేపట్టినా ప్రజలు తమ ఇళ్లను, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచినప్పుడే హైదరాబాద్ను ఆరోగ్యకరమైన నగరంగా తీర్చిదిద్దగలం. వ్యాధి వచ్చిన తర్వాత చికిత్స తీసుకోవడం కంటే వ్యాధులు రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడమే ఉత్తమం. జీహెచ్ఎంసీ చేస్తున్న విజ్ఞప్తిని ప్రతి ఒక్కరూ పాటించి దోమల నివారణలో భాగస్వాములు కావాలని కోరుతున్నానని అన్నారు.

ఎస్ ఐ ఆర్ ప్రక్రియపై కార్యకర్తలు దృష్టి సారించాలి

హైదరాబాద్ పెన్ పవర్: తెలంగాణలో కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక సమగ్ర సవరణ రెండవ విడత ప్రక్రియపై బిజెపి నాయకులు, ప్రజాప్రతినిధులు మరియు కార్యకర్తలు పూర్తిస్థాయిలో దృష్టి సారించాలని బిజెపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు శ్రీ ఎన్. రాంచందర్ రావు పిలుపునిచ్చారు.శనివారం హైదరాబాద్లోని ఖైరతాబాద్ 'విశ్వేశ్వరయ్య భవన్'లో బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మరియు రాష్ట్ర కన్వీనర్ వేముల అశోక్ అధ్యక్షతన నిర్వహించిన ప్రత్యేక సమగ్ర సవరణ ఫేజ్-2 రాష్ట్రస్థాయి వర్క్షాప్ కు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు.ఈ సందర్భంగా ఎన్. రాంచందర్ రావు మాట్లాడుతూ... ప్రక్రియ ముగియడానికి కేవలం మరొక రెండు రోజులు మాత్రమే (ఆగస్టు 10 వరకు) సమయం ఉన్నందున, ప్రతి నియోజకవర్గంలోనూ అర్హులైన ప్రతి ఒక్కరిచేత ఫారమ్-6 ద్వారా కొత్త ఓటు నమోదు వేగవంతంగా పూర్తి చేయించాలని పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ఈ గడువు ముగిసిన తర్వాత కూడా రాబోయే రోజుల్లో డ్రాఫ్ట్ నోటిఫికేషన్ల పరిశీలన, నకిలీ ఓట్ల గుర్తింపు, అభ్యంతరాల (రాఎియవష్ఱఅశీఅం) దాఖలు వంటి కీలకమైన అంశాలు ఉంటాయని రాంచందర్ రావు స్పష్టం చేశారు. ఫారమ్-7 (ఓట్ల తొలగింపు), ఫారమ్-8 (సవరణలు) సరైన రీతిలో దాఖలు చేయడం, నోటీసులకు తగిన ఆధారాలతో లీగల్గా సమాధానాలు ఇవ్వడం, పోలింగ్ బూత్ల రేషనలైజేషన్ ప్రక్రియను క్షుణ్ణంగా పరిశీలించడంపై బిఎల్ఏ-1లు (దీూా-1) మరియు లీగల్ టీమ్స్ నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించడంలో ఓటర్ల జాబితా పారదర్శకత అత్యంత కీలకమని, ఆ బాధ్యతను బిజెపి ప్రతినిధులు సమర్థవంతంగా నిర్వహించాలని కోరారు.

,ఆగస్టు 10 న జరిగే జైలు భరో కార్యక్రమాన్ని విజయవంతం చేయండి

హైదరాబాద్ పెన్ పవర్: పట్టణంలోనిమల్లు స్వరాజ్యం నగర్ కాలనిలో జనరల్ బాడీ సమావేశాము కుంచపు మహేందర్ అధ్యక్షతన నిర్వహించడం జరిగిందిఈ సమావేశానికి ముఖ్య అతిథిగా సిపిఎం పట్టణ కార్యదర్శి భానోత్ సీతారాం నాయక్ పాల్గొని మాట్లాడుతూకేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఆగస్టు 10న జైల్ భరో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారుకేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కొడ్స్ ను రద్దు చేయాల ని రైతు మూడు నల్ల చట్టాలను రద్దు చేయాలని వ్యవసాయ కూలీలు పోరాడి సాధించుకున్న ఉపాధి హామీ చట్టాన్ని మార్పు బి బి జి రామ్ పథకాన్ని తీసుకురావడం జరిగింది దీనివలన గతంలో కేంద్ర ప్రభుత్వం 90% నిదురిస్తే రాష్ట్ర ప్రభుత్వాలు 10 శాతమే ఇచ్చేవారు
కానీ ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం 60 శాతం రాష్ట్ర ప్రభుత్వం 40% ఇవ్వాలని చెప్పడం జరుగుతుంది దీనివలన ఉపాధి హామీ పని రద్దు చేయాలనే యోజనలో కేంద్ర ప్రభుత్వం ఉన్నాడని అన్నారు కేంద్ర ప్రభుత్వం విద్యుత్ రంగంలో కూడా ఉచితలను తీసేవేసే జీవోలు తీసుకురావడం జరిగిందని అన్నారు ప్రభుత్వం ఆ జీవోలను
కూడా రద్దు చేయాలని అన్నారుబిజెపి తీసుకొచ్చిన కార్మిక కర్షక రైతు ప్రజా వ్యతిరేక చట్టాలని తక్షణమే రద్దు చేయాలనిరాష్ట్ర ప్రభుత్వం అర్హులైన వారికి పెన్షన్స్.ఇందిరామ్మా ఇండ్లు.ఇంటి పట్టాలు.ఇండ్ల స్థలాలు. రైతులు రైతుల సాగులో ఉన్న వ్యవసాయ భూమికి పట్టాలు ఇవ్వాలనే డిమాండ్ తోమహబూబాబాద్ లో వివేకానంద సెంటర్ నుండి తహసీల్దార్ కార్యాలయం వరకు వెలది మందితో జరిగే భారీ జైలు భరోకార్యక్రమంలో కార్మికులు కర్షకులు రైతు కూలీలు విద్యార్థులు ప్రజలు కాలనీవాసులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పో. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

ఉచితాలే రాజకీయ మంత్రం.. గెలుపు తర్వాత అదే ప్రజలకు గుదిబండ!



హైదరాబాద్ పెన్ పవర్: ఒకప్పుడు పాలిటిక్స్ అంటే.. మంచి నేతలు.. క్లీన్ చిట్ ఉన్న నాయకులు కనిపించేవారు.. వారి మాటలు వినిపించేవి. ఇప్పుడు అవేవీ లేవు!. ఆశ్చర్యంగా ఉన్నా నిజం. మీకు ఓటేస్తే మాకేంటి? అనే టైపులో ఇటు ఓటర్లు.. మాకు ఓటేస్తే.. మీకిది!.. అంటూ నాయకులు కూడా విచ్చల విడి హామీలు గుప్పిస్తున్నారు. వీటిలో ప్రధానంగా ఉచిత పథకాలపై తెలంగాణ హైకోర్టు కన్నెర్ర చేసింది. అయితే.. న్యాయవ్యవస్థకు ఏం తెలుసు మా కష్టాలు.. అని నాయకులు బుగ్గలు నొక్కుకుంటున్నారు. తాజాగా తమ నుంచి వసూలు చేసిన సర్ చార్జీని వెనక్కి ఇప్పించాలంటూ దాఖలైన ఓ పిటిషన్పై విచారణ చేసిన తెలంగాణ హైకోర్టు ఉచిత పథకాల అమలుపై తీవ్ర వ్యాఖ్యలే చేసింది. కూర్చుంటే.. సొమ్ము, నించుంటే సొమ్ము అంటూ తనదైన బాణిలో విమర్శలు గుప్పించింది. అయితే.. ఉచితాలపై కోర్టులు ఇలా వ్యాఖ్యానించడం కొత్తకాదు.. నాయకులు, పార్టీలు వాటిని పెడచెవిన పెట్టడమూ కొత్తకాదు. గత మూడేళ్ల కిందటే సుప్రీంకోర్టులో ఉచిత పథకాలపై పిటిషన్లు దాఖలయ్యాయి.
ఈ విషయంలో తాము జోక్యం చేసుకునేది లేదని సర్వోన్నత న్యాయస్థానం అప్పట్లోనే తేల్చి చెప్పింది. పార్టీలు వ్యక్తిగతంగా ఆలోచన చేసుకోవాలని కూడా కోరింది. ఇదే సమయంలో కేంద్ర ప్రభుత్వం వివరణ కూడా కోరింది. అయితే.. తాము వ్యతిరేకమంటూ.. కేంద్రం ముక్తసరిగా సమాధానం ఇచ్చి ఊరుకుంది. కానీ, చిత్రంగా ఆ తర్వాత జరిగిన బీహార్, పశ్చిమ బెంగాల్, ఒడిశా రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో ఇదే కేంద్రంలోని బీజేపీ పార్టీ ఉచిత పథకాలకు తెరదీసింది. ఏకంగా విద్యార్థులకు స్కూటీలు, ఉచిత ఫీజులు, రీయింబర్సు మెంట్లు అంటూ ఊదరగొట్టి.. ఆయారాష్ట్రాలలో అధికారం దక్కించుకుంది.

పేగు బంధంగా మారింది!

ఇక, ఓటుకు-ఉచితాలకు మధ్య బంధం పేగుబంధంగా మారిందన్నది వాస్తవం. ఎన్నికలకు ముందే ఉచితాలు ప్రకటిస్తున్న పార్టీలు పెరుగుతున్నాయి. ఇక, ఎన్నికల సమయంలో ఒక పార్టీకి మించి మరో పార్టీ ఉచితాలపై గొప్పలు పోతున్నాయి. ఇటీవలే తమిళనాడులో ఉచిత తాళిబొట్ల పంపిణీ కోసం 800 కోట్ల రూపాయలను ప్రభుత్వం కేటాయించింది. నిజానికి పాఠశాల విద్యకు కేటాయించాల్సిన 500 కోట్లలో సగం కోత పెట్టి.. దీనికి కేటాయించడం గమనార్హం. అలానే ఉచిత ల్యాప్ టాప్ పథకానికి ఏకంగా 2 వేల కోట్లను కుమ్మరించింది. సో.. ఇవన్నీ ఎన్నికల హామీలే. న్యాయవ్యవస్థకు ఏం తెలుసు.. తమ కష్టాలు అంటూ.. రాజకీయ నేతలు ఉసూరు మంటున్నారు. అధికారంలోకి వచ్చేందుకు ఉచితాలు పనిచేస్తున్నా.. వచ్చిన తర్వాత చుక్కలు చూపిస్తున్నాయనడానికి రెండు తెలుగు రాష్ట్రాలూ.. మినహాయింపు కాకపోవడం గమనార్హం.

ఏం చేయాలి?

ఉచితాలకు బదులుగా.. సంస్థాగత అభివృద్ధికి సంబంధించిన పథకాలను ప్రకటించాలి.
వ్యక్తిగత లబ్ధి కంటే కూడా.. సామాజిక ప్రయోజనాలకు పెద్దపీట వేయాలి.
వేల కోట్ల రూపాయలను ఉచితాలకు ఇస్తున్న పార్టీలు.. ఈ దిశగా ఆలోచన చేయాలి.
అధికారమే పరమావధి అయినా.. పార్టీలు ఉచితాల నుంచి మేల్కొనాల్సిన అవసరం ఉంది.
ఒక పార్టీని చూసి మరోపార్టీ చేతులు కాల్చుకునే పరిస్థితి రాకుండా ఉండడమే కాదు.. ప్రజలను సైతం ఆ దిశగా మళ్లించాలి.. ఒప్పించాలి!.

ఉదయ్ కృష్ణారెడ్డి.. అందరినీ ఇరికించేస్తున్నాడే!

హైదరాబాద్ పెన్ పవర్: శిక్షణలో ఉన్న ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డి వ్యవహారం.. కీలక మలుపు తిరుగుతోంది. ప్రస్తుతం ఆయనను కస్టడీలోకి తీసుకుని విచారించిన పోలీసులపై గుండుగుత్తగా ఆయన కేసులు పెట్టేందుకు రెడీ కావడం పోలీసులకు కంటిపై కునుకు లేకుండా చేసింది. ట్రైనీ మహిళా ఐపీఎస్పై లైంగిక వేధింపులకు పాల్పడ్డారన్న కేసులో ఉదయ్ కృష్ణారెడ్డి అరెస్టు కావడం.. ఆయనను అత్తాపూర్ పోలీసులు కస్టడీలోకి తీసుకుని విచారించడం తెలిసిందే.
అయితే.. విచారణ అనంతరం.. కోర్టులో హాజరు పరిచిన సందర్భంగా కృష్ణారెడ్డి మేజిస్ట్రేట్కు ఇచ్చిన వాంగ్మూలం.. కంటతడి పెట్టిన తీరు వంటివి పోలీసులను ఇరకాటంలోకి నెట్టాయి. ఆయన ఏకంగా సీపీ సజ్జనార్పై మేజిస్ట్రేట్కు ఫిర్యాదు చేయడం సంచలనంగా మారింది. సీపీ తన కుటుంబ సభ్యులను ఎన్కౌంటర్ చేస్తానని బెదిరించాడంటూ ఫిర్యాదు చేశారు. కస్టడీ సమయంలో విచారణ చేసిన ప్రతి పోలీసుపై ఫిర్యాదు చేయడం మరో కొసమెరుపు.నిబంధనలకు విరుద్ధంగా అత్తాపూర్ పోలీసులు వ్యవహరించారని, తనపై అనుచితంగా ప్రవర్తించారని, బూతులు తిట్టారని ఉప్పర్పల్లి కోర్టు
దృష్టికి తీసుకువెళ్లాడు. ఉదయ్ కృష్ణారెడ్డిని విచారించేందుకు అత్తాపూర్ పోలీస్ స్టేషన్కు వెళ్లిన సీపీ సజ్జనార్.. అభ్యంతరకర మాటలు మాట్లాడారని ఉదయ్ కృష్ణారెడ్డి మేజిస్ట్రేట్కు ఫిర్యాదు చేశారు. అంతేకాదు, సీపీ సజ్జనార్తో పాటు విచారణ చేసిన పోలీసులకు నోటీసులు ఇవ్వాలని మేజిస్ట్రేట్కు విన్నవించాడు.
అంతేకాదు, సీసీటీవీ కెమెరాలు లేని చోట విచారణ చేసినట్లు ఆరోపించడం గమనార్హం. అదే సమయంలో రిటైర్డ్ ఏసీపీ పూర్ణచందర్ రావు విచారణలో ఎలా పాల్గొన్నాడని తెలిపారు. అడ్వకేట్లను కూడా చంపేస్తామని బెదిరించినట్లు ఉదయ్ కృష్ణారెడ్డి తరఫు న్యాయవాదులు కోర్టుకు చెప్పారు. టాస్క్ ఫోర్స్ ఆఫీస్కు తీసుకెళ్లి టార్చర్ చేసి, కొట్టారని చెప్పారు. ఈ నేపథ్యంలో అత్తాపూర్ ఇన్స్పెక్టర్కు కోర్టు షోకాజ్ నోటీసు జారీ చేసింది. అంతేకాదు, సీసీటీవీ కెమెరాలు లేని చోట ఎలా విచారణ చేశారని ప్రశ్నించింది. రెండు రోజుల్లోగా వివరణ ఇవ్వాలని ఆదేశించింది. ఈ పరిణామాలతో పోలీసుల చుట్టూ ఉచ్చుబిగిసుకునే అవకాశం ఉందని తెలుస్తోంది.

తాండూర్ పట్టణంలో కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రామ్

- విస్తృత తనిఖీలు

హైదరాబాద్ పెన్ పవర్: వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, ఆదేశాల మేరకు తాండూర్ డీఎస్పీ ఎన్. యాదయ్య ఆధ్వర్యంలో తాండూర్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మాణిక్ నగర్ మరియు మున్సిపల్ క్వార్టర్స్ ప్రాంతాల్లో కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రామ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తాండూర్ డీఎస్పీతో పాటు తాండూర్ టౌన్ ఇన్స్పెక్టర్ పరమేశ్వర్, కరణ్ కోట్ ప్రవీణ్ కుమార్ రెడ్డి, డివిజన్ పోలీసు సిబ్బంది, ఏఆర్ పార్టీ సిబ్బంది పాల్గొని అనుమానాస్పద వ్యక్తులు, వాహనాలు మరియు అక్రమ కార్యకలాపాలపై విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు.తనిఖీలలో భాగంగా ఇద్దరు అనుమానిత వ్యక్తులను తనిఖీ చేయడంతో పాటు, పాపిలాన్ పరికరాన్ని ఉపయోగించి తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా 65 ద్విచక్ర వాహనాలు, 3 ఆటోలు మరియు 56 మద్యం బాటిళ్లను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు.స్వాధీనం చేసుకున్న వాహనాలకు సంబంధించిన పత్రాలు, రిజిస్ట్రేషన్ వివరాలు మరియు ఇతర రికార్డులను పరిశీలించిన అనంతరం, నిబంధనల ప్రకారం తదుపరి చర్యలు తీసుకోనున్నారు.ఈ కార్యక్రమం లో తాండూర్ డీఎస్పీ మాట్లాడుతూ తాండూర్ పట్టణంలో కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రామ్ నిర్వహించాం. ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని అనుమానాస్పద వ్యక్తులు, వాహనాలు మరియు అక్రమ కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి సారించాం. తనిఖీల్లో గుర్తించిన వాహనాల పత్రాలను పూర్తిస్థాయిలో పరిశీలించి, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటాం.నేరాల నియంత్రణ, అక్రమ కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయడం, ప్రజలకు సురక్షిత వాతావరణం కల్పించడమే పోలీసుల ప్రధాన లక్ష్యం. ప్రజలు కూడా పోలీసులకు సహకరించి అనుమానాస్పద వ్యక్తులు, కార్యకలాపాలపై సమాచారం అందించాలని కోరుతున్నాం. అని తెలిపినారు.

విజయసాయి పార్టీకి స్పేస్ ఉందా

నెల్లూరు, ఆగస్టు 8, పెన్ పవర్:
ఏపీలో మరో కొత్త పార్టీకి తెర లేవనుందని లోకల్ పొలిటికల్ సర్కిల్స్‌లో టాక్. పొలిటికల్ ఎంట్రీకి మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి రంగం సిద్ధం చేసుకుంటున్నారని సమాచారం. 2029 ఎన్నికలే టార్గెట్‌గా విజయసాయి వ్యూహం రచిస్తున్నట్టు సమాచారం. తన పార్టీకి వెన్నుదన్నుగా ఉండేలా సొంత మీడియాను కూడా ఆయన ఏర్పాటు చేసుకుంటున్నారని తెలుస్తోంది. సోషల్ మీడియా, మీడియా ప్లాట్‌ఫామ్‌ల అండతో తన వాయిస్‌ని, వాదనని ప్రజల్లోకి తీసుకెళ్లేలా చూసుకుంటున్నారట.ఏపీ రాజకీయాలు వైసీపీ వర్సెస్ కూటమి అన్నట్టు సాగుతూ ఉంటాయి. అక్కడ మిగిలిన పార్టీలకు పెద్దగా పొలిటికల్ స్పేస్ ఉండదు. ఇలాంటి పరిస్థితుల్లో....విజయసాయిరెడ్డి పార్టీకి ఎంతవరకు పొలిటికల్ స్పేస్ దొరుకుతుందో చూడాలంటున్నాయి పొలిటికల్ సర్కిల్స్.చాలాకాలం వైసీపీలో ఉన్న ఆయన, కొన్నాళ్ల కిందట ఆ పార్టీకి గుడ్‌బై చెప్పారు. అడపాదడపా వైసీపీ టార్గెట్‌గా విమర్శల బాణాలు సంధిస్తున్నారు. వైసీపీకి వ్యతిరేకంగా ఖలో పోస్టులు పెడుతున్నారు. అటు టీడీపీపై కూడా విమర్శలు ఎక్కుపెడుతున్నారు. రాజధాని నిర్మాణంలో అవినీతి జరుగుతోందని ఆరోపిస్తున్నారు. ఆయన వైసీపీని వద్దనుకున్నారు. టీడీపీలోకి ఎంట్రీ ఇచ్చే పరిస్థితి లేదు. అయితే బీజేపీకి కోరస్‌గా హిందుత్వ సైరన్ మోగిస్తున్నారు. మొదట్లో ఆయన బీజేపీలోకి వెళదామనుకున్నారనే టాక్ వినిపించింది. అయితే కూటమిలో భాగస్వామిగా ఉన్న బీజేపీలోకి ఆయన వెళ్లే అవకాశం తక్కువగా ఉందంటున్నారు.దీంతో సొంత పార్టీ పెట్టాలనే నిర్ణయానికి వచ్చారట విజయసాయి రెడ్డి. దీనిలో భాగంగా ప్రాంతాలవారీగా త్వరలోనే సన్నాహక సమావేశాలు పెట్టడానికి ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలుస్తోంది. కొత్త పార్టీపై శ్రావణమాసంలో అధికారికంగా ప్రకటన చేయడానికి విజయసాయి సిద్ధమవుతున్నట్టు సమాచారం. ఈ కొత్త పార్టీ ఏర్పాటు విషయంలో లెక్కల మాస్టారు ఆచితూచి అడుగులు వేస్తున్నట్టు చెబుతున్నారు. జెండాను, అజెండాను కేర్‌ఫుల్‌గా డిజైన్ చేస్తున్నారట. మోదీని ఆదర్శంగా తీసుకుని రాజకీయం చేయనున్నారట విజయసాయి. ఇక జెన్-జీ టార్గెట్‌గా పాలిటిక్స్ ఉంటాయని సమాచారం. జెన్-జీని ఆకట్టుకునే అజెండా, వ్యూహాలు రూపొందిస్తారట. దానిలో భాగంగా పార్టీలో యువతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తారని సమాచారం. రాబోయే ఎన్నికల్లో పార్టీ టికెట్లలో ఎక్కువభాగం వాళ్లకే అని చెబుతున్నారు. ఇక తమిళనాడు ఎన్నికల్లో విజయదుందుభి మోగించిన విజయ్‌ను కూడా విజయసాయి స్ఫూర్తిగా తీసుకున్నట్టు తెలుస్తోంది. విజయ్ తరహాలో డబ్బు లేని రాజకీయంపై ఫోకస్ పెట్టనున్నారట. ఇక హిందుత్వం సెంట్రిక్‌గా సాగే విజయసాయి రాజకీయంలో...సమానత్వం, కులాలకు అతీతంగా సామాజిక న్యాయం అంశాలను పొందుపరిచారట. యువత, మహిళలు, రైతులను ఆకర్షించేలా పార్టీ విధానాలు ఉంటాయని చెబుతున్నారు. పార్టీకి బూస్టప్ ఇచ్చేందుకు, విజయసాయిరెడ్డి త్వరలో పాదయాత్రకు కూడా సిద్ధమవుతున్నట్టు తెలుస్తోంది.

మళ్లీ పాత నియోజకవర్గాల కోసం డిమాండ్

విజయవాడ, ఆగస్టు 8, పెన్ పవర్:
వైసీపీ నేతలు తమ పాత నియోజకవర్గాలను కేటాయించాలని పార్టీ హైకమాండ్ పై వత్తిడి తెస్తున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం సాధించాలంటే ఖచ్చితంగా కూటమి పార్టీలకు గట్టి పోటీని ఇవ్వాలంటే తమకు పాత నియోజకవర్గాలకు పంపాలని కోరుతున్నారు. ఈ వాయిస్ ఇటీవల కాలంలో పార్టీ అధినేత జగన్ వద్ద ఎక్కువగా వినిపిస్తుంది. జగన్ జిల్లాల పర్యటనలకు వచ్చినప్పుడు కానీ, తాడేపల్లి పార్టీ కేంద్ర కార్యాలయంలో సమావేశమయినప్పుడు కానీ ఇదే విషయాన్ని పదే పదే ప్రస్తావిస్తున్నారట. తమకు ఇష్టం లేని, పరిచయాలు లేని నియోజకవర్గాల్లోనే కొనసాగిస్తే లోకల్ బాడీ ఎన్నికల్లో పార్టీకి ఇబ్బందికరమైన పరిస్థితులుంటాయని హెచ్చరిస్తున్నారట. తర్వాత తమను నిందించి, ఓటమిని తమ ఖాతాల్లో వేయవద్దని కోరుతున్నట్లు తెలిసింది. 2024 ఎన్నికలకు వైసీపీ అనేక ప్రయోగాలు చేసింది. అందులో ఒకటి మంత్రులతో పాటు ఎమ్మెల్యేలను వారి సొంత నియోజకవర్గాల నుంచి తప్పించి కొత్త నియోజకవర్గాలకు అభ్యర్థులుగా పంపింది. కొత్త అభ్యర్థులయితే.. స్థానికంగా ఉండే అసంతృప్తి నుంచి బయటపడి గెలవచ్చని నాడు జగన్ తీసుకున్న నిర్ణయం ఫలించలేదు. ఒకరకంగా చెప్పాలంటే ఆ బదిలీ వ్యూహం వికటించిందనే చెప్పాలి. మంత్రులుగా ఉన్న విడదల రజని, తానేటి వనిత, మేకపాటి సుచరిత, ఆదిమూలం సురేష్, అనిల్ కుమార్ యాదవ్, వెల్లంపల్లి శ్రీనివాస్ తో పాటు అనేక మంది ఎమ్మెల్యేలను మార్చి జగన్ నాడు పెద్ద ప్రయోగమే చేశారు. కానీ ఇష్టం లేకుండానే అక్కడకు వెళ్లిన నేతలు దాదాపుగా అందరూ ఓటమి పాలయ్యారు. వైసీపీకి కేవలం పదకొండు స్థానాలకే పరిమితమై ప్రతిపక్ష కూడా హోదా దక్కకపోవడానికి ఈ మార్పిడి నిర్ణయమూ ఒక కారణమంటున్నారు... దీంతో త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు ఆంధ్రప్రదేశ్ లోజరగనున్నాయి. స్థానిక సంస్థల ఎన్నికలలో గెలవాలంటే తమ పాత నియోజకవర్గాలకు పంపాలని వైసీపీ నేతలు నాయకత్వానికి మొర పెట్టుకుంటున్నారు. కానీ జగన్ మాత్రం ఇప్పటి వరకూ దీనిపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. స్థానిక సంస్థల ఎన్నికల సమయం ముంచుకొస్తుండటంతో జగన్ విజయవాడ వచ్చినప్పుడల్లా కలసి తమ బాధను చెప్పుకుంటున్నారు. అయితే నవ్వడం మినహా జగన్ నుంచి నిర్ణయం వెలువడక పోవడంతో కొంత ఇబ్బంది కరమైన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. కొత్త నియోజకవర్గాల్లో ఓటమి తర్వాత ఆ నేతలు క్యాడర్ కు దూరంగా ఉంటూ వస్తున్నారు. అలాగే తమకు బలం ఎక్కడ ఉంది? ఎక్కడ ప్రతిపక్షం బలంగా ఉందన్న విషయం తెలియదని, అందుకే తమకు ఓల్డ్ ఈజ్ గోల్డ్ అని చెబుతున్న నేతల మొర జగన్ పట్టించుకుంటారా? లేదా? అన్నది చూడాలి.

గెలుపే ధ్యేయంగా వైసీపీ వ్యూహం

వచ్చే ఎన్నికల్లో గెలుపే ధ్యేయంగా వైసీపీ వ్యూహం మార్చిందా అంటే అవుననే సమాధానాలు వినిపిస్తున్నాయి. ఈ మధ్యకాలంలో వైసీపీ నేతల వ్యాఖ్యలతో పాటే, నిరసనలు, ఆందోళనల్లో వినిపిస్తున్న ఆ పేరే.. దీనికి బలం చేకూరుస్తోంది. తాజాగా డీఎస్సీ అక్రమాలపై చేపట్టిన రిలే నిరాహార దీక్షా శిబిరాలపై దాడులు జరుగుతున్నాయని ఆరోపిస్తూ వైసీపీ అధినేత వైఎస్ జగన్ చేసిన ట్వీట్‌లోనూ ఇదే పదం కనిపించడంతో.. రాజకీయ నిపుణులు కూడా ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు.2029 ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వ్యూహం మార్చిందా.. ఢిల్లీ ప్రభావం ఏపీలోని గల్లీపైనా పడిందా.. అంటే అవుననే సమాధానాలే వినిపిస్తున్నాయి. నీట్ పేపర్ లీకేజ్ వ్యవహారంపై ఢిల్లీ వేదికగా సాగిన జెన్ జీ ఉద్యమం దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైన సంగతి తెలిసిందే. చివరకు కేంద్ర ప్రభుత్వం దిగివచ్చి.. విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌తో రాజీనామాచేయించింది కూడా. ఈ ఉద్యమంతో రాజకీయాల్లో జెన్ జీ పాత్ర ఏమిటనే దానిపై పొలిటికల్ పార్టీలకు ఓ క్లారిటీ వచ్చింది. దీంతో అన్ని పార్టీలు కూడాజెన్ జీలను ప్రసన్నం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నాయి. వారి సమస్యలపై ప్రధానంగా దృష్టి పెడుతున్నాయి.ఈ క్రమంలోనే ఏపీలోని యువతరాన్ని తమవైపు ఆకర్షించేందుకు వైసీపీ ప్రయత్నిస్తోంది. యువత, విద్యార్థుల సమస్యలను లేవనెత్తుతోంది. నీట్ తరహాలోనే ఏపీలో డీఎస్సీలో అక్రమాలు జరిగాయంటూ వైసీపీ ఆరోపిస్తోంది. జెన్ జీ ఉద్యమం ముందు వరకూ డీఎస్సీలో అక్రమాలపై వైసీపీ సాగించిన పోరాటం.. ప్రధాన్ రాజీనామా అనంతరం దేశవ్యాప్తంగా మారిన పరిస్థితుల కారణంగా కొత్త రూపు తీసుకుంది. వైసీపీ చేసే నిరసన కార్యక్రమాలు, ఆందోళనలలోనూ జెన్ జీ పేరును వైసీపీ నేతలు ఎక్కువగా ప్రచారంలోకి తీసుకువస్తున్నారు. వైసీపీ అధినేత వైఎస్ జగన్ ఇటీవల పొగాకు రైతులను పరామర్శించేందుకు తూర్పుగోదావరి జిల్లా దేవరాపల్లిలో పర్యటించారు.జగన్ పర్యటనకు జెన్ జీల నుంచి అనూహ్య స్పందన వచ్చిందని... యువతరం పెద్ద సంఖ్యలో జగన్ కార్యక్రమానికి హాజరయ్యారని వైసీపీ నేతలు సోషల్ మీడియాలో షేర్ చేశారు. ఇప్పుడు డీఎస్సీ అక్రమాలపై వైసీపీ చేపడుతున్న రిలే నిరాహార దీక్షల వద్ద జెన్ జీ ప్రస్తావన తేవడం మారిన వైసీపీ స్ట్రాటజీకి నిదర్శనమనే విశ్లేషణలు వినిపిస్తున్నాయి.

వచ్చే జనాలు ఓట్లుగా మారుతాయా

కాకినాడ, ఆగస్టు 8, పెన్ పవర్:
వైసీపీ అధినేత వైఎస్ జగన్ ఎక్కడకు వెళ్లినా జనం పోటెత్తుతున్నారు. ప్రాంతాలకు అతీతంగా ఆయనకు జేజేలు కొడుతున్నారు. కానీ ఆ జేజేలు ఓట్ల రూపంలో మారతాయా? అన్నది పెద్ద డౌటు. ఎందుకంటే జగన్ పర్యటనలకు వచ్చిన జనం ఎన్నికల సమయంలో ఓట్లు వేస్తారన్న గ్యారంటీ లేదు. జన సమూహాన్ని చూసి ఇక తాము గెలిచినట్లేనని వైసీపీ సీనియర్ నేతలు మాత్రం మురిసి పోవడం లేదు. ఎందుకంటే జగన్ కు ఇప్పటి నుంచి కాదు. 2012లో వైసీపీ పార్టీ పెట్టిన నాటి నుంచి జగన్ ఎక్కడ పర్యటనలకు వెళ్లినా వేలాది మంది వస్తున్నారు. స్థానిక నేతలు వారిని తరలిస్తున్నారా? లేక స్వచ్ఛందంగా తరలివస్తున్నారా? అన్నది పక్కన పెడితే వారిని చూసి గెలిచేస్తామనుకుంటే అంతకు మించిన వెర్రితనం మరొకటి ఉండదన్న కామెంట్స్ వినపడుతున్నాయి.మరో మెగా డీఎస్సీ.. ఎప్పుడంటే? బయటకు వస్తే చాలు... గత పథ్నాలుగేళ్ల నుంచి జగన్ బయటకు వస్తే చాలు.. అది ఏ పర్యటన అయినా.. ఏ ప్రాంతమయినా తండోపతండాలుగా తరలి వస్తున్నారు. కానీ జగన్ గెలిచింది కేవలం 2019 మాత్రమేనన్న విషయాన్ని గుర్తుంచుకోవాలని అన్నారు. జగన్ కు వచ్చే జనాలను చూసిన వారికి ఎవరికైనా ప్రతి ఎన్నికల్లో జగన్ గెలుస్తారని భావిస్తారు. కానీ 2014, 2024లోదారుణ ఓటమికి గల కారణాలను మాత్రం ఇప్పటికీ వైసీపీ అధినేత జగన్ తెలుసుకోలేకపోతున్నారని అంటున్నారు. అనేక అంశాలు ఎన్నికలలో ప్రభావితం చేయనున్నాయి. కేవలం జన బలం మాత్రమే కాదు. యాటిట్యూడ్, విధానాలు, అభ్యర్థి ఎంపిక వంటి అంశాలు కీలకంగా పనిచేస్తాయి. అంతే తప్ప జనం వచ్చినంత మాత్రాన గెలిచినట్లు కాదని, రానంత మాత్రాన ఓడినట్లు కాదని కొందరు ఈ సందర్భంగా గుర్తు చేస్తున్నారు. జగన్ పర్యటనల్లో జనసందోహాన్ని చూసిన వారు ఎవరైనా ఇంత ఫాలోయింగ్ ఏంటి సామీ అని ఆశ్చర్యపడకమానరు. ఇటీవల కాలంలో ఆయన వరసగా పర్యటనలు చేస్తున్నారు. శ్రీకాకుళం, పశ్చిమ గోదావరి, తూర్పు గోదావరి జిల్లాల్లో జగన్ పర్యటనలు వైసీపీ నేతల మాటల్లో సూపర్ సక్సెస్ అయ్యాయి. నిజమే.. సూపర్ సక్సెస్ అయింది నిజమే కాని దాని వల్ల అధికారం లభిస్తుందా? అన్నది పెద్ద సందేహం. ఎందుకంటే ఎన్నికల్లో ఎలక్షనీరింగ్ ముఖ్యం. ఇందులో టీడీపీని కొట్టేవారు లేరు. ఒక స్కెచ్ ప్రకారం, చంద్రబాబు వ్యూహాల ప్రకారం ఎన్నికల వేళ ఫలితం తారుమారయ్యేటట్లు చేయగలరు. అందుకే జనాన్ని చూసి గెలిచామని ఊహించుకుని ఊహల లోకంలో విహరించడం కంటే ...క్షేత్రస్థాయిలో బూత్ లెవెల్ కమిటీలను బలోపేతం చేసుకోవడం, అభ్యర్థుల ఎంపిక సక్రమంగా చేయడం, ప్రత్యర్థుల ఎత్తులు ముందుగానే పసిగట్టి వాటికి పై ఎత్తులు వేస్తేనే గెలవగలమని ఉత్తరాంధ్ర సీనియర్ నేత ఆఫ్ ది రికార్డుగా వ్యాఖ్యానించడాన్ని ఎవరూ కాదనలేరు. ఈ విషయాన్ని జగన్ తెలుసుకుంటే మంచిదని అంటున్నారు.కొన్నిచోట్ల వైసీపీ పోస్టర్లపై జెన్జీ వార్ అంటూ ముద్రిస్తుండటం గమనార్హం. తాజాగా వైఎస్ జగన్ చేసిన ట్వీట్‌తో వైసీపీ వ్యూహం మారిందనే క్లారిటీ వచ్చిందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.డీఎస్సీ అక్రమాలపై విజయవాడలో నిర్వహించిన రిలే నిరాహార దీక్షా శిబిరాన్ని ఎమ్మెల్యే, అతని అనుచరులు దాడి చేసి ధ్వంసం చేశారని జగన్ ఆరోపించారు.పోలీసుల కళ్లముందే, వారి సమక్షంలోనే టెంట్లు లాగిపడేశారని.. మా మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణుతో పాటు యువతను లక్ష్యంగా చేసుకుని రాళ్లు, కోడిగుడ్లు, టమాటాలతో దాడి చేశారని జగన్ ఆరోపించారు. రాష్ట్రవ్యాప్తంగా చాలా చోట్ల నిరసన శిబిరాలపై దాడులు చేశారన్న జగన్.. ప్రభుత్వాన్ని ప్రశ్నించే హక్కును నిరుద్యోగ యువతకు లేకుండా చేశారని ఆరోపించారు.దీక్షా శిబిరాలను ధ్వంసం చేసి, నిరసనకారులను అరెస్టు చేసి, నిరుద్యోగ యువతలో రగులుతున్న ఆగ్రహాన్ని అణచివేయలేరని.. ఆంధ్రప్రదేశ్ గొంతును మూయలేరంటూ జగన్ ట్వీట్ చేశారు. ఈ నేపథ్యంలో జగన్ ట్వీట్ 2029 ఎన్నికలకు వైసీపీ స్ట్రాటజీని తెలియజేస్తోందని పొలిటికల్ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. వైసీపీ నిరసనలు, ఆందోళన కార్యక్రమాల వైపు యువతరాన్ని ఆకర్షించి, వారి భాగస్వామ్యులను చేసుకుని ప్రభుత్వంపై ఒత్తిడి పెంచడమే కాకుండా వచ్చే ఎన్నికల్లో విజయఢంకా మోగించాలనే ఆలోచనలో ఉన్నట్లు విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు

అక్టోబర్‌లో డీఎస్సీ నోటిఫికేషన్, డిసెంబర్ నెలలో పరీక్షలు.. విద్యాశాఖ ప్రకటన

విజయవాడ, ఆగస్టు 8, పెన్ పవర్: వతకు గుడ్ న్యూస్. అక్టోబర్ నెలలో డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్లు పాఠశాల విద్యాశాఖ ప్రకటించింది. అక్టోబర్ నెలలో నోటిఫికేషన్ విడుదల, డిసెంబర్ నెలలో పరీక్షలు ఉంటాయని ఏపీ విద్యాశాఖ కమిషనర్ తమీమ్ అన్సారియా తెలిపారు. డీఎస్సీ 2025పై వస్తున్న ఆరోపణలకు సంబంధించి విద్యాశాఖ అధికారులు శుక్రవారం మరోసారి క్లారిటీ ఇచ్చారు. ఎంపికైన అభ్యర్థులు ఈ దుష్ప్రచారాన్ని నమ్మవద్దని విజ్ఞప్తి చేశారు.ఉపాధ్యాయ ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న యువతకు ఆంధ్రప్రదేశ్ పాఠశాల విద్యాశాఖ శుభవార్త చెప్పింది. వచ్చే అక్టోబర్ నెలలో మరో డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్లు ఏపీ విద్యాశాఖ కమిషనర్ తమీమ్ అన్సారియా తెలిపారు. డిసెంబర్‌లో డీఎస్సీ పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మెగా డీఎస్సీపై వస్తున్న ఆరోపణల మీద ఆంధ్రప్రదేశ్ పాఠశాల విద్యాశాఖ శుక్రవారం మరోసారి వివరణ ఇచ్చింది. అమరావతి సచివాలయంలో విలేకర్లతో మాట్లాడిన తమీమ్ అన్సారియా.. డీఎస్సీ 2025పై వస్తున్న ఆరోపణలను ఖండించారు. డీఎస్సీ 2025 ద్వారా 16,347 టీచర్ పోస్టులను భర్తీ చేశామని.. కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ విధానంలో అత్యంత పారదర్శకంగా ప్రక్రియ నిర్వహించామన్నారు. అయినప్పటికీ డీఎస్సీ 2025పై నిరాధార ఆరోపణలు, దుష్ప్రచారం చేస్తున్నారని అన్నారు. డీఎస్సీలో ఎంపికైన అభ్యర్థులు తప్పుడు ప్రచారాలు నమ్మవద్దని.. ఆందోళనకు గురికావద్దని సూచించారు.మరోవైపు 2025 డీఎస్సీపై వస్తున్న ఆరోపణలకు సంబంధించి ఇప్పటి వరకూ మూడుసార్లు వివరణ ఇచ్చామని.. అయినా కూడా దుష్ప్రచారం చేస్తుంటే మరోసారి క్లారిటీ ఇస్తున్నట్లు వివరించారు. హారిజాంటల్ రిజర్వేషన్ ప్రకారమే అర్హులకే పోస్టులు దక్కాయన్న తమీమ్ అన్సారియా.. ఏవైనా అనుమానాలు ఉంటే తమ వద్దకు రావాలని సూచించారు. 12 పద్ధతులను అనుసరించి డీఎస్సీ నిర్వహించామని.. డీఎస్సీ మెరిట్, సెలక్షన్ లిస్టును ఆన్ లైన్‌లో ఎప్పుడైనా చూసుకునే అవకాశం ఉందన్నారు. ఎంపికైన అభ్యర్థులు ఆందోళనకు గురికావొద్దని.. ప్రభుత్వం పూర్తి అండగా ఉంటుందని తమీమ్ అన్సారియా తెలిపారు. ఉద్యోగాలు రాని అభ్యర్థులు.. ఇలాంటి దుష్ప్రచారాన్ని నమ్మకుండా వచ్చే డీఎస్సీపై దృష్టిపెట్టాలని తమీమ్ అన్సారియా సూచించారు.మరోవైపు స్పోర్ట్స్ కోటా టీచర్ల నియామకాలపై ఏపీ స్పోర్ట్స్ అథారిటీ వైస్ చైర్మన్ భరణి స్పందించారు. అన్ని ఫెడరేషన్లు, స్పోర్ట్స్ అసోసియేషన్లు నుంచి పూర్తి వివరాలు సేకరించామని, ప్రతి అభ్యర్థి ధ్రువపత్రాలను క్షుణ్ణంగా పరిశీలించామని వివరించారు. ఆ తర్వాతే ప్రిలిమినరీ ప్రాధాన్యత జాబితాను రూపొందించి విద్యాశాఖకు పంపినట్లు భరణి క్లారిటీ ఇచ్చారు. మరోవైపు డీఎస్సీలో అక్రమాలు జరిగాయంటూ వైసీపీఆరోపిస్తున్న సంగతి తెలిసిందే. ఈ అంశంపై రాష్ట్రవ్యాప్తంగా రిలే నిరాహార దీక్షలు కూడా చేపట్టింది

మున్సిపల్, పంచాయతీ ఎన్నికలు ఓటుకు ఈవీఎంలా.. బ్యాలట్ బాక్సులా?

ఒంగోలు ఆగస్టు 8, పెన్ పవర్: స్థానిక సంస్థల ఎన్నికల నగారా అతి త్వరలో మోగనుంది. దీనిపై రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అధికారులతో సమావేశమయ్యారు. 2021లో జరిగిన తీరును, ఇప్పుడు జరగనున్న విధానంపై చర్చించారు. కోర్టు కేసుల్లో ఉన్న వాటిని వీలైనంత త్వరగా పరిష్కరించాలని చెప్పారు. అదేవిధంగా ఈ స్థానిక సంస్థల ఎన్నికలకు బ్యాలట్ బాక్సులు ఉపయోగించాలా? లేక ఈవీఎంలు వాడాలా? అన్న విషయంపై కూడా అధికారులు చర్చించారు. ఎన్నికల తేదీ వచ్చేలోపే అంతా సిద్ధం చేసుకోవాలని ఎన్నికల కమిషనర్ ఆదేశించారు.ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఏ క్షణమైనా మున్సిపల్, పంచాయతీ ఎన్నికల నగారా మోగొచ్చని.. అధికారులు సిద్ధంగా ఉండాలంటూ రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా అలర్ట్ చేశారు. త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఇప్పటి వరకు చేసిన ఏర్పాట్లపై ముఖ్య అధికారులతో సమావేశం నిర్వహించారు. మున్సిపల్, పంచాయతీ ఎన్నికలకు పెండింగ్‌లో ఉన్న అంశాలు, వాటి పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలపై పురపాలక, పంచాయతీ రాజ్ శాఖ ముఖ్య కార్యదర్శులు, కమిషనర్లతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలోనే ఈ ఎన్నికలకు బ్యాలట్ బాక్సులు వినియోగించాలా, ఈవీఎంలు వాడాలా అనే అంశంపై కూడా చర్చించారు.రాష్ట్రంలోని 123 మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు, నగర పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించే ఆలోచనలో ఉన్నట్లు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ చెప్పారు. కొన్ని చోట్ల కోర్టు కేసులు ఉన్నందున వాటిని పరిష్కరించే దిశగా కూడా చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ చీఫ్ సెక్రటరీ వివరించారు. పెండింగ్‌లో 23 కోర్టు కేసులు ఉంటే వాటిల్లో నాలుగు పరిష్కారమయ్యాయి అని తెలిపారు.ఇక పంచాయతీల విషయానికి వస్తే రాష్ట్రంలో మొత్తం 13,359 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఇందులో 2021లో 354 పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించలేదని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కాంతిలాల్ దండే ఒక ప్రజంటేషన్ కూడా ఇచ్చారు. పురపాలకశాఖతో సమన్వయం చేసుకుని పెండింగ్ కేసులు పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు. ఓటర్ల తుది జాబితా ప్రచురణ, పోలీస్ కేంద్రాల ఏర్పాటు తదితర అంశాలపైనా సిబ్బందిని సన్నద్ధం చేస్తున్నామని అధికారులు తెలిపారు.ఈ ఎన్నికలకు బ్యాలట్ బాక్సులు ఉపయోగించాలా? ఈవీఎంలు వాడాలా? అనే అంశంపై కూడా రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అధికారులతో చర్చించారు. జిల్లాల వారీగా ఎన్ని బ్యాలట్ బాక్సులు ఉన్నాయి, ఎన్ని ఈవీఎంలు ఉన్నాయి అనే వివరాలను అధికారులు నివేదించారు. 2021లో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు రూ. 3.5 కోట్ల వరకు ప్రభుత్వం బడ్జెట్ కేటాయించగా.. ఈ ఏడాది ఎంత బడ్జెట్ అవుతుందో కూడా చర్చించారు

వైజాగ్ వాసులకు ట్రాఫిక్ కష్టాలు తీరినట్టే.. ఆ 35 కూడళ్లలో సరికొత్తగా!

విశాఖపట్టణం, ఆగస్టు 8, పెన్ పవర్: వైజాగ్‌లో రోజురోజుకూ పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. విశాఖ కలెక్టర్ అభిషిక్త్ కిశోర్ ఆదేశాల మేరకు ఇటీవల ఓ సర్వే కూడా నిర్వహించారు. గాజువాక నుంచి కొమ్మాది వరకు అత్యంత క్లిష్టమైన కూడళ్లను పరిశీలించిన అధికారులు 35 కూడళ్ల వద్ద అభివృద్ధి పనులు చేసి ట్రాఫిక్ సమస్యను రూపుమాపే ప్రయత్నాలు చేస్తున్నారు. ఒక్కో కూడలిలో రూ. 1.5 కోట్ల నుంచి రూ. 2 కోట్ల వరకు వెచ్చించనున్నారు.ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన తర్వాత వైజాగ్ ప్రాంతం అభివృద్ధి బాట పట్టింది. సాఫ్ట్‌వేర్ కంపెనీలు కూడా ఈ ప్రాంతానికి రావడానికే మొగ్గు చూపుతున్నాయి. ఎయిర్‌పోర్ట్, నౌకాశ్రయం, స్టీల్‌ప్లాంట్ ఇలా అభివృద్ధికి కీలక మార్గాలన్నీ ఇక్కడే ఉండటంతో జనాభా పెరగడం, ట్రాఫిక్ సమస్య కూడా రోజురోజుకూ పెరుగుతూ వస్తోంది. దాతో ట్రాఫిక్ రద్దీకి జీవీఎంసీ చర్యలు చేపట్టింది.విశాఖ కలెక్టర్ అభిషిక్త్ కిశోర్ ఆదేశాల మేరకు ట్రాఫిక్ పోలీసుల సహకారంతో జాతీయ రహదారిలో అత్యంత రద్దీగా ఉండే ప్రాంతాలు, వాహనాల సంఖ్య, తీసుకోవాల్సిన చర్యలపై జీవీఎంసీ ఇటీవల సర్వే చేపట్టింది. గాజువాక నుంచి కొమ్మాది వరకు అత్యంత క్లిష్టమైన కూడళ్లను పరిశీలించిన అధికారులు 35 కూడళ్ల వద్ద తీసుకోవాల్సిన చర్యలపై ఒక నిర్ణయానికి వచ్చారు.ఈ 35 కూడళ్లలో ప్రైవేట్ ఏజెన్సీతో ప్రణాళికలు రూపొందించి అమలు చేయడానికి జీవీఎంసీ సిద్ధమైంది. ఒక్కో కూడలిలో రూ. 1.5 కోట్ల నుంచి రూ. 2 కోట్ల వరకు వెచ్చించనున్నారు. ఇక్కడ ప్రధానంగా సర్వీసు రహదారి ఏర్పాటు చేయడం.. ప్రస్తుతం ఉన్న ఫ్రీ లెఫ్టులను మరింత అభివృద్ధి చేయాలని నిర్ణయించారు.వెంకోజీపాలెం వద్ద హెచ్‌బీ కాలనీకి వెళ్లే రహదారి విస్తరించడం, విశాఖ వ్యాలీ కూడలి వద్ద మరో సర్వీసు రహదారి నిర్మించడం, ఎండాడ వద్ద సర్వీసు రహదారి అభివృద్ధి చేయడం వంటి ప్రతిపాదనలు అధికారులు తీసుకున్నారు. ఈ పనులను చేయడానికి త్వరలోనే టెండర్లను ఆహ్వానించనున్నారు. జీవీఎంసీ ప్రధాన ఇంజినీరు, అసిస్టెంట్ పోలీస్ కమిషనర్ ఈ ట్రాఫిక్ సమస్యల పరిష్కారంపై సమావేశం కూడా నిర్వహించారు.జీవీఎంసీ, ట్రాఫిక్ పోలీసుల బృందం సర్వే ఆధారంగా ఒక అవగాహనకు వచ్చి అభివృద్ధి పనులు చేయట్టాలని నిర్ణయించారు. ఈ పనులను రెండు దశల్లో చేపట్టనున్నారు. మొదటి దశలో 11 కూడళ్లు ఎంపిక చేస్తారు.. ఆ తర్వాత మరో 24 కూడళ్లకు పనులను విస్తరించనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ పనులన్నీ రెండు నెలల వ్యవధిలోనే పూర్తి చేయాలని భావిస్తున్నారు.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965

ట్రంప్ '100% పంచ్'.. భారత్ పారిపోయి చైనా ఒళ్లో పడుతుందా? భయపడిపోతున్న అమెరికా సెనేటర్లు

రష్యా దగ్గర చమురు కొంటున్నారని కోపం వచ్చిందంట.. భారత్ మీద ఏకంగా 100% పన్నుల బాంబు పేల్చారు అమెరికా పెద్దలు.. దానికి భారత్ భయపడాలి కానీ.. అమెరికా సెనేటర్లే ఆందోళన చెందుతున్నారు. బిల్లు పాస్ అయి ట్రంప్ మామ చేతికి ఆ పవర్ వస్తే భారత్ దిగుమతులపై సుంకాల బాదుడే బాదుడు. అయితే ఈ ఆవేశంలో అమెరికా ఒక చిన్న విషయాన్ని మరచిపోతోందని కొందరు సెనేటర్లు గుండెలు బాదుకుంటున్నారు. అదేంటంటే "మనం పన్నులతో బాదితే భారత్ వెళ్ళి చైనా ఐస్ క్రీమ్ తింటుందేమో!" అని.

'నిందితులు' దొరికేశారు రోయ్..

అమెరికా సెనేటర్ రిచర్డ్ బ్లూమెంటల్ గారైతే ఏకంగా వేలు చూపిస్తూ "ఇదిగోండి.. రష్యా యుద్ధానికి డబ్బులిస్తున్న అసలు నిందితులు భారత్, చైనాలే" అని బాహాటంగానే ప్రకటన ఇచ్చేశారు. పుతిన్ దగ్గర చౌకగా లభించే క్రూడ్ ఆయిల్ కొని దేశంలో పెట్రోల్ ధరలు పెరగకుండా చూసుకోవడం భారత్ చేసిన 'పెద్ద నేరం' అట.. ఉక్రెయిన్ యుద్ధానికి భారత్ ఇంధన కొనుగోళ్లే ఇంధనం పోస్తున్నాయని వారి భావన.

భారత్‌ను తోసేసి, చైనాను ఆపుతారా?

అసలైన కామెడీ ఏంటంటే.. ఇండో-పసిఫిక్ ప్రాంతంలో చైనా దాష్టీకాన్ని అడ్డుకోవడానికి భారత్‌ను 'రాతి బండ'లా వాడుకోవాలని చూసింది అమెరికాయే.. సెమీకండక్టర్లు, రక్షణ, సాంకేతికత అంటూ భారత్‌ను భుజాన వేసుకుని ఆడిన అంకుల్ సామ్ ఇప్పుడు అదే భారత్‌పై 100% పన్నులు వేస్తాననడం నిజంగా విడ్డూరమే. "నన్ను తాకితే చైనా వైపు పోతా" అని భారత్ బెదిరించకపోయినా అమెరికా అమాయకత్వమే భారత్‌ను చైనా-రష్యా వైపు నెట్టేసేలా ఉందనేది కొందరు విశ్లేషకుల మాట.

అమెరికాకే ముప్పు.. మనకేం నష్టం..

ఒకవేళ 100% పన్నులు పడితే మన ఫార్మా, టెక్స్‌టైల్స్, ఆటో రంగాలు దెబ్బతింటాయి సరే.. మరి అమెరికా వినియోగదారులు ఐఫోన్ల నుంచి మందుల వరకు అన్నీ రెట్టింపు ధరకు కొనుక్కోవాల్సి వస్తుంది కదా? అది ఆలోచించారా అంటే.. "ముందు విదేశాంగ నీతి, ఆ తర్వాతే పౌరుల జేబులు" అన్నట్టుంది వారి తీరు. భారత్ ఎప్పుడూ ఏ ఒక్కరి పాకెట్‌లోనూ ఉండే దేశం కాదు. తన ఇంధన భద్రత కోసం ఎక్కడైనా కొంటుంది. ఇప్పటికైతే ఈ 100% టారిఫ్ బిల్లు ఇంకా ప్రతినిధుల సభను దాటాల్సి ఉంది. బిల్లు పాస్ అయి చట్టంగా మారినా భారత్‌ను బెదిరించి చైనా వైపు నెట్టాలా లేక చల్లబడాలా అనేదే ఇప్పుడు 'అంకుల్ సామ్' ముందున్న పెద్ద మిలియన్ డాలర్ల ప్రశ్న

రాష్ట్ర వ్యాప్తంగా వైసీపీ వర్సెస్ టీడీపీ.. ఏం జరుగుతోంది?

ఏపీలో శనివారం ఉదయం నుంచి టీడీపీ వర్సెస్ వైసీపీ నాయకుల మధ్య పోటా పోటీ నిరసనలు, ధర్నాలతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. డీఎస్సీ-2025 ఉద్యోగాల విషయంలో కూటమి ప్రభుత్వం అక్రమాలు చేసిందని ఆరోపిస్తూ.. వైసీపీ నేతలు రాష్ట్ర వ్యాప్తంగా ధర్నాలు చేపట్టారు. అయితే. ఆయా ధర్నాలకు అనుమతులు ఇవ్వలేదని పేర్కొంటూ.. పోలీసులు కొన్ని ప్రాంతాల్లో ధర్నా ప్రాంతాల వద్ద టెంట్లను, మైకులను తొలగించారు. ఇదే సమయంలో ఆయా ప్రాంతాల్లో టీడీపీ నాయకులు సైతం ఎదురు ధర్నాలు చేయడం గమనార్హం. డీఎస్సీ వేయడం చేతకాని వైసీపీ ప్రభుత్వానికి.. కూటమి ప్రభుత్వాన్ని విమర్శించే అర్హత లేదని విమర్శిస్తూ.. పలు ప్రాంతాల్లో ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులు, ప్రస్తుత మంత్రులు కూడా కౌంటర్ ధర్నాల కు దిగారు. దీంతో పరిస్థితులు ఉద్రిక్తంగా మారాయి. మరోవైపు జగన్ సొంత జిల్లా కడపలోని జమ్మలమడుగు నియోజకవర్గంలో పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారింది. వైసీపీ ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి సహా కొందరు వైసీపీ నేతలను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ క్రమంలో వైసీపీ నేతలు పోలీసులకు మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. అయినప్పటికీ.. వైసీపీ దీక్షా శిబిరాన్ని ఖాళీ చేయించిన పోలీసులు.. దీక్షా శిబిరం వద్ద వైసీపీ శ్రేణులను తరిమికొట్టారు. దీంతో వైసీపీ నాయకులు రాళ్లు రువ్వేందుకు ప్రయత్నించారు. దీంతో పోలీసులు అదనపు బలగాలను రంగంలోకి దింపాల్సి వచ్చింది.

శ్రీకాకుళంలో మరో రగడ..

ఇటీవల వైసీపీ నేత జగన్.. శ్రీకాకుళం పర్యటనకు వెళ్లిన సమయంలో మహిళా ఎస్సైపై కొందరు వైసీపీ నాయకులు గలీజుగా వ్యవహరించారన్న ఫిర్యాదులు అందాయి. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు.. వైసీపీ ఆముదాలవలస నియోజకవర్గం ఇంచార్జ్ చింతాడ రవికుమార్ కోసం గాలింపును ముమ్మరం చేశారు. ఇదేసమయంలో ఆయన అనుచరులను శనివారం ఉదయం అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. అయితే.. ఈ అరెస్టులను ఖండిస్తూ.. వైసీపీ శ్రేణులు వందలాదిగా శ్రీకాకుళంలో ధర్నాకు దిగారు. విజయవాడలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. ఇలా.. రాష్ట్ర వ్యాప్తంగా పరిస్థితి ఉద్రిక్తంగా మారడం గమనార్హం.

ప్రమాదమా? ఉద్దేశపూర్వక దాడా? రాజమండ్రి ప్రియాంక ఘటనలో వెలుగులోకి సంచలన నిజాలు

తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో వైద్య విద్యార్థిని ప్రియాంక తీవ్రంగా గాయపడిన ఘటన రాష్ట్రవ్యాప్తంగా కలకలం రేపుతోంది. ప్రసాద్ ఆదిత్య మాల్ వద్ద మద్యం మత్తులో ఉన్న ఇద్దరు యువకులు కారుతో బీభత్సం సృష్టించారు. ఆదిత్యమాల్ వద్ద ఆ ఇద్దరు యువకులు తాగి ఉన్నారని ఆపారు. అప్పుడు మేం తాగలేదని దబాయిస్తే 'బ్రీత్ అనలైజర్ తో చెక్ చేస్తే 100కు పైగా పాయింట్లు చూపించింది. దీంతో తాగి వస్తే లోపలికి ప్రవేశం లేదంటూ ఆదిత్యమాల్ మేనేజర్ ఆపారు. దీంతో రెచ్చిపోయిన యువకుడు మేనేజర్ ముఖంపై ఫోన్ తో కొట్టాడు. దీంతో మాల్ లోని పనివారు ఈ ఇద్దరు యువకులను పట్టుకోవడానికి రాగా కారులో పారిపోయారు. పారిపోతే మెడికో విద్యార్థినిని కారుతో ఢీకొట్టారు. తాజాగా వెలుగులోకి వచ్చిన సీసీటీవీ దృశ్యాలు ఈ ఘటనపై మరిన్ని అనుమానాలకు తావిస్తున్నాయి. ఇది కేవలం రోడ్డు ప్రమాదమా? లేక ఉద్దేశపూర్వకంగా కారుతో ఢీకొట్టారా? అనే ప్రశ్నలు ఇప్పుడు చర్చనీయాంశంగా మారాయి. ఈ ఘటన ఆగస్టు 3వ తేదీ రాత్రి రాజమండ్రి లోని ఏవీ అప్పారావు రోడ్డులో ఉన్న ప్రసాద్ ఆదిత్య మాల్ వద్ద చోటుచేసుకుంది. తూర్పుగోదావరి జిల్లా రాజానగరంలోని జీఎస్ఎల్ మెడికల్ కాలేజీలో డెర్మటాలజీ మొదటి సంవత్సరం చదువుతున్న పీజీ వైద్య విద్యార్థిని ప్రియాంక.. రేడియాలజీ మొదటి సంవత్సరం విద్యార్థి మల్లి వెంకట దుర్గాసాయి ఉమేశ్‌తో కలిసి మాల్‌లో సినిమా చూసి స్కూటీపై బయటకు వస్తున్నారు. అదే సమయంలో రాజమండ్రి రూరల్ మండలం నామవరానికి చెందిన సూరారపు ధస్వంత్, ఆండ్రూ జోసెఫ్ ఎడ్వర్డ్స్ కారులో సెకండ్ షో సినిమా చూసేందుకు మాల్‌కు వచ్చినట్లు తెలుస్తోంది. వారు మద్యం మత్తులో ఉన్నారని అనుమానించిన మాల్ సిబ్బంది వారిని బ్రీత్ ఎనలైజర్‌తో పరీక్షించినట్లు సమాచారం. మద్యం సేవించినట్లు నిర్ధారణ కావడంతో వారిని థియేటర్‌లోకి అనుమతించలేదని చెబుతున్నారు. దీంతో సెక్యూరిటీ సిబ్బందితో యువకులు వాగ్వాదానికి దిగినట్లు తెలుస్తోంది. యువకులు మాల్ నుంచి కారులో బయటకు వస్తున్న సమయంలోనే ప్రియాంక, ఉమేశ్ స్కూటీపై గేటు దాటుతున్నట్లు సీసీటీవీ దృశ్యాల్లో కనిపిస్తున్నట్లు సమాచారం. మొదట కారు స్కూటీని ఢీకొట్టిన తర్వాత కూడా ఆగకుండా ముందుకు వెళ్లినట్లు తెలుస్తోంది. ప్రియాంక కారు వైపు కోపంగా చూడటంతో యువకులు మరోసారి కారును వెనక్కి తిప్పి స్కూటీని ఢీకొట్టినట్లు ఆరోపణలు ఉన్నాయి.
మొత్తం మూడుసార్లు స్కూటీని ఢీకొట్టినట్లు సీసీటీవీ ఫుటేజీల ఆధారంగా తెలుస్తోందని సంబంధిత వర్గాలు చెబుతున్నాయి. దీంతో ప్రియాంక, ఉమేశ్ ఇద్దరూ రోడ్డుపై పడిపోయారు. అనంతరం కారు వేగంగా ముందుకు దూసుకెళ్లిన సమయంలో కిందపడిన ప్రియాంక తలపై నుంచి కారు వెళ్లిన దృశ్యాలు కూడా సీసీటీవీలో నమోదైనట్లు సమాచారం. ఈ ఘటనను చూసిన మాల్ సిబ్బంది కేకలు వేయడంతో యువకులు అక్కడి నుంచి పరారైనట్లు తెలుస్తోంది.

ప్రియాంక పరిస్థితి విషమం

తీవ్రంగా గాయపడిన ప్రియాంకను ఆమె స్నేహితుడు, మాల్ సిబ్బంది వెంటనే రాజమహేంద్రవరంలోని కంబాలచెరువు ప్రాంతంలోని స్వతంత్ర ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం ఆమెను హైదరాబాద్‌కు తరలించారు. అక్కడి కిమ్స్ ఆస్పత్రిలో ఆమెకు చికిత్స అందుతోంది. తలకు తీవ్ర గాయాలు కావడంతో ఆమె పరిస్థితి అత్యంత విషమంగా ఉందని వైద్యులు వెల్లడించినట్లు కుటుంబ సభ్యులు చెబుతున్నారు. ప్రియాంక మృత్యువుతో పోరాడుతున్న పరిస్థితి కుటుంబ సభ్యులు, వైద్య విద్యార్థుల్లో తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. ఈ ఘటనలో ఉమేశ్‌కు చేతి, ఛాతి భాగాల్లో గాయాలయ్యాయి.

రెండు కేసులు నమోదు

ఘటనపై ప్రసాద్ ఆదిత్య మాల్ థియేటర్ మేనేజర్ విజయ్ ఫిర్యాదు మేరకు ఒక కేసు, ప్రియాంక తండ్రి కనికే వెంకటేష్ ఫిర్యాదు మేరకు మరో కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. సీసీటీవీ ఫుటేజీల్లో నమోదైన కారు నంబర్ ఆధారంగా నిందితులను గుర్తించిన పోలీసులు.. వారిని చింతల నామవరానికి చెందిన సూరారపు ధస్వంత్, ఆండ్రూ జోసెఫ్ ఎడ్వర్డ్స్‌గా గుర్తించి అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం.

రాష్ట్రపతి వెళ్లాల్సిన చోటకు మోడీ.. యువతకు మెసేజ్!

ఐఐటీ-ఢిల్లీ స్నాతకోత్సవం.. శనివారం జరిగింది. అయితే.. ఏ విశ్వవిద్యాలయానికైనా.. గవర్నర్ చాన్సలర్ గా ఉంటారు. ఐఐటీలకు రాష్ట్రపతి చాన్స్‌లర్‌గా వ్యవహరిస్తారు. సో.. ఐఐటీలకు సంబంధించి జరిగే స్నాతకోత్సవాలకు.. రాష్ట్రపతి లేదా ఉపరాష్ట్రపతి వెళ్తారు. అయితే.. దీనికి భిన్నంగా తొలిసారి ఐఐటీ ఢిల్లీ సంస్థ నిర్వహించిన స్నాతకోత్సవానికి ప్రధాని నరేంద్ర మోడీ అతిథిగా హాజరయ్యారు. ఆయన ఈ అవకాశాన్ని ఎందుకు వినియోగించుకునేది ఇప్పుడు చర్చగా మారింది. ఇక, ఈ స్నాతకోత్సవంలో ప్రధాన మంత్రి.. యువతను ఉద్దేశించి కీలక సందేశం ఇచ్చారు. అదే.. "ప్రశ్నించవద్దు" అని!. ఆయన ఏ యాంగిల్‌లో ఈ వ్యాఖ్యలు చేశారన్నది ప్రస్తుతం పక్కన పెడితే.. దేశవ్యా ప్తంగా కాక్రోచ్ జనతా పార్టీ చేసిన నిరసనలు, ఆందోళనలు.. కేంద్రాన్ని ప్రశ్నించినవే. నీట్ పరీక్ష పేపర్ లీకైన నేపథ్యంలో కేంద్ర మంత్రి ధర్మేంద్రప్రధాన్‌తో రాజీనామా చేయించే వరకు కూడా వారు నిద్రపోలేదు. మొత్తంగా ప్రధాన్ తన పదవికి రాజీనామా చేశారు. ఈ వ్యవహారం .. కేంద్రాన్ని ఇంకా వేధిస్తూనే ఉంది. ఈ నేపథ్యంలో తాజాగా వచ్చిన అవకాశాన్ని ప్రధాని సద్వినియోగం చేసుకున్నారు. "సమస్యలు వస్తాయి. అనేక సమస్యలు ఇంకా
ముందు ముందు ఉన్నాయి. వాటిని ప్రశ్నించడం కాదు. పరిష్కారాలు ఆలోచించాలి." అని యువతను ఉద్దేశించి ఆయన వ్యా ఖ్యానించారు. అయితే.. ఎక్కడా జంతర్ మంతర్ వద్ద జరిగిన నిరసనలను కానీ, కాక్రోచ్ జనతా పార్టీ గురించి కానీ, ఆయన ప్రస్తావించలేదు. కానీ, ఆయన మాటల్లో అంతరార్థం మాత్రం అదేనంటున్నారు పరిశీలకులు. ముఖ్యంగా 25-30 ఏళ్ల యువత అత్యంత అప్రమత్తంగా ఉండాలని ప్రధాని చూసించారు. ఇటీవల నిరసనలు చేసింది.. ఈ వయసు వారే కావడం గమనార్హం. అలానే రాబోయే భవిష్యత్తులో మీ పాత్ర ఎంతో ఉందని ప్రధాని చెప్పారు. ఈ నేపథ్యంలో ప్రతి సమస్యను ప్రశ్నిస్తూ కూర్చుంటే పరిష్కారం దొరకదని ఆయన పేర్కొన్నారు. తద్వారా.. ప్రధాని యువతను ప్రశ్నించడం కాదు.. అనే సందేశాన్ని పరోక్షంగా అందించినట్టు అయిందని అంటున్నారు విశ్లేషకులు. మరి మోడీ తన మనసులోని మాటనే చెప్పారో.. లేక ఆయన అంతరంగం ఏంటనేది చూడాలి.

బలోపేతమే అజెండా.. పార్టీల వ్యూహమేంటి?!

తెలంగాణలో అధికార, ప్రతిపక్ష పార్టీలు సంస్థాగతంగా బలోపేతం కావడంపై దృష్టి పెట్టాయి. త్వరలోనే గ్రేటర్ హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ ఎన్నికలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో పార్టీలు సంస్థాగతంగా బలోపేతం కావాలని నిర్ణయించడం గమనార్హం. కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీలు ఇదే వ్యూహంతో ముందుకు సాగుతున్నాయి. వాస్తవానికి.. కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు క్షేత్రస్థాయిలో బలంగానే ఉన్నాయన్న వాదన ఉంది. బీజేపీకి మాత్రమే హైదరాబాద్ సహా.. కొన్ని జిల్లాల్లో బలం ఉన్నా.. రాష్ట్ర వ్యాప్తంగా వెనుకబడే ఉంది. ఈ నేపథ్యంలో బీజేపీ సంస్థాగతంగా నిలదొక్కుకునేందుకు ప్రయత్నాలు చేస్తోంది. ముఖ్యంగా పార్టీ పెద్దలు.. వచ్చే ఎన్నికల్లో తెలంగాణను దక్కించుకునేందుకు రెడీగా ఉన్నారు. కానీ, క్షేత్రస్థాయిలో వారి అంచనాలకు అనుగుణంగా కార్యకర్తలు బలోపేతం కావడం లేదు. పార్టీ నాయకుల మధ్య కూడా సఖ్యత కనిపించడం లేదు. ఈ పరిణామాలను సరిదిద్దుకునేందుకు బీజేపీ సంస్థాగతంగా బలోపేతం కావడంపై దృష్టి పెట్టింది. ఈ మేరకు పార్టీ చీఫ్ రామచందర్‌రావు.. చర్యలు చేపట్టారు. ఇక, సంస్థాగతంగా బాగానే ఉన్న కాంగ్రెస్, బీఆర్ఎస్ లు కూడా.. ఈదిశగానే అడుగులు వేయడం ఏంట నేది చర్చకు దారితీస్తోంది. దీనికి ప్రధానంగా ఒకపార్టీపై మరో పార్టీ చేసుకుంటున్న విమర్శలు.. వేసుకుం టున్న నిందలే కారణమని అంటున్నారు పరిశీలకులు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏమీ చేయడం లేదని, కేసీఆర్ తీసుకువచ్చిన పథకాలను కూడా నీరు గారుస్తోందని,

రైతులు ఉసూరుమంటున్నారని.. బీఆర్ఎస్ పెద్ద ఎత్తున ప్రచారం చేస్తున్న విషయం తెలిసిందే. దీని నుంచి తమను కాపాడుకునేందుకు కాంగ్రెస్ ప్రయత్నిస్తోంది.
ఇక, కాంగ్రెస్ పార్టీ చేస్తున్న ప్రచారం.. ముఖ్యంగా మాజీ సీఎం, బీఆర్ఎస్ అధిపతి కేసీఆర్ కేంద్రంగా సాగుతున్న విమర్శలకు అడ్డుకట్ట వేయాలన్నది బీఆర్ఎస్ వ్యూహంగా ఉంది. ఇక, ఉమ్మడి సమస్యల విషయానికి వస్తే.. క్షేత్రస్థాయిలో చిన్నా చితకా పార్టీల ఆవిర్భావం.. వాటి వల్ల తమ ఓటు బ్యాంకు ప్రభావితమయ్యే పరిస్థితిని బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీలు లెక్కలు వేసుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో ఓటు బ్యాంకును కాపాడుకునేందుకు.. క్షేత్రస్థాయి కార్యకర్తలను కాపాడుకునేందుకు వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నాయి. ఈ క్రమంలోనే సంస్థాగత నిర్మాణంపై దృష్టి పెట్టాయి.

పోలవరం-బనకచర్లపై కేంద్రం కీలక నిర్ణయం.. మంచిదేనా?

ఏపీ సీఎం చంద్రబాబు ప్రతిష్టాత్మకంగా భావించిన పోలవరం-మల్లన్న సాగర్ లేదా బనకచర్ల ఎత్తి పోతల పథకానికి సంబంధించి కేంద్ర ప్రభుత్వం తాజాగా కీలక నిర్ణయం తీసుకుంది. ఈ ప్రాజెక్టుకు సంబంధించి దాదాపు 130 కోట్ల రూపాయల వ్యయంతో రూపొందించిన పూర్తిస్థాయి ప్రాజెక్టు నివేదిక(డీపీఆర్)ను కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వం రెండు నెలల కిందటే పంపించింది. అయితే.. తాజాగా ఈ డీపీఆర్‌ను కేంద్ర జల సంఘం వెనక్కి పంపించింది. ఇది తెలంగాణలో హర్షాతిరేకాలు నింపగా.. ఏపీలో విమర్శలకు దారి తీసింది. కానీ, కేంద్రం ఇలా వెనక్కి పంపడమే మంచిదైందని.. నిపుణులు అభిప్రాయపడుతున్నారు. సీఎం చంద్రబాబు సైతం దీనిని స్వాగతిస్తున్నారు. తొలి దశలోనే డీపీఆర్ వెనక్కి రావడం ఒకరకంగా ఇబ్బందికర పరిణామమే అయినా.. సుప్రీంకోర్టు వరకు ఈ వ్యవహారం వెళ్లకుండా కేంద్ర ప్రభుత్వం మంచి పని చేసిందన్న అభిప్రాయాలు కూడా వ్యక్తమవుతున్నాయి.

ఎందుకు?

పోలవరం-బనకచర్ లేదా మల్లన్నసాగర్ ప్రాజెక్టును తెలంగాణ ప్రభుత్వం తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. ఈ ప్రాజెక్టుతో పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు గండిపడుతుందని.. మహబూబాబాద్ సహా.. పలు జిల్లాలు నీటి ఎద్దడిని ఎదుర్కొంటాయని తెలంగాణ ప్రభుత్వం చెబుతోంది. ముఖ్యంగా గోదావరి నీటిని ఏపీ మళ్లించేస్తే.. తెలంగాణలో సగం జిల్లాలు ఎడారిగా మారే అవకాశం ఉందని పేర్కొంది. ఈ నేపథ్యంలో పోలవరం-బనకచర్ల ప్రాజెక్టును అడ్డుకున్నారు. మరోవైపు.. విభజిత తెలంగాణ రాష్ట్రానికి నీటి కేటాయింపులు జరపాలని.. ఉమ్మడి రాష్ట్రంలో చేసిన నీటి కేటాయింపులే

ఇప్పటికీ కొనసాగుతున్నాయని తెలంగాణ ప్రభుత్వం వాదిస్తోంది. ఈ క్రమంలో ఎలాంటి నీటి కేటాయింపు లేకుండానే ఏపీ ప్రభుత్వం బనకచర్లకు ముందుకు రావడాన్ని తప్పుబడుతోంది. మరోవైపు.. సముద్రంలో కలిసే 2 వేల టీఎంసీల నీటిలో 200 టీఎంసీలనే తాము వాడుకుంటామని ఏపీ చెబుతోంది. అయినప్పటికీ తెలంగాణ అంగీకరించలేదు. మరోవైపు.. ఏపీ పోలవరం-బనకచర్ల విషయంలో పట్టుదలతో ముందుకు సాగుతోంది. సీమకు నీరిచ్చేందుకు ప్రయత్నం చేస్తోంది. ఈ క్రమంలోనే డీపీఆర్ రెడీ చేసి కేంద్రానికి పంపించింది. దీనికి ఓకే అంటే.. తాము సిద్ధమేనని చెప్పింది. అయితే.. కేంద్రం కనుక డీపీఆర్‌ను ఆమోదిస్తే.. సుప్రీం కోర్టుకు వెళ్లాలని తెలంగాణ నిర్ణయించింది. ఈ క్రమంలో డీపీఆర్‌ను కేంద్రం తిరస్కరించింది. అసలు నీటి కేటాయింపులు లేకుండా ఈ ప్రాజెక్టు చేపట్టడం సరికాదని తెలిపింది. సుప్రీంకోర్టుకు తెలంగాణ వెళ్తే.. అసలుకే ఎసరు వస్తుందని అంచనా వేసింది. దీంతో వెనక్కి పంపించడం గమనార్హం. నీటి కేటాయింపుల తర్వాత.. దీనిని మరోసారి పంపించాలని చంద్రబాబు నిర్ణయించారు. అయితే.. దీనిని వైసీపీ ఎద్దేవా చేస్తోంది. చంద్రబాబు నాన్‌ప్లాన్ బెడిసికొట్టిందని ప్రచారంచేస్తుండడం గమనార్హం.

రిటర్న్ ఇండియా.. విదేశాల్లోని 81% మంది 'హోమ్‌సిక్' కుర్రాళ్ళ అసలు కథ ఇదీ

విదేశాలకు వెళ్లి చదువుకోవాలనే ఆశ ప్రతి ఇంట్లోనూ కామనే.. పాస్‌పోర్ట్ చేతిలో పడటం ఆలస్యం.. అమెరికా, కెనడా, యూకే, ఆస్ట్రేలియా విమానాలు ఎక్కేయడమే ఆలస్యం.. మెరుగైన విద్య, భారీ ఆఫర్లు, అంతర్జాతీయ లైఫ్‌స్టైల్ అనుకోవచ్చు. కానీ వీరంతా అక్కడే మూటముల్లె సర్దేసుకుని పర్మనెంట్ గూడు కట్టేస్తారని అనుకుంటే మీరు పొరపాటో పప్పులో కాలో వేసినట్లే. తాజాగా ఆక్స్‌ఫర్డ్ ఇంటర్నేషనల్ వారు నిర్వహించిన 'స్టూడెంట్ గ్లోబల్ మొబిలిటీ ఇండెక్స్' సర్వే ఒక షాకింగ్ విషయాన్ని బయటపెట్టింది. ఈ సర్వేలో పాల్గొన్న 17,925 మంది విద్యార్థులలో ఏకంగా 81 శాతం మంది చదువు పూర్తవ్వగానే "మన దేశమే మేలురా సామీ" అంటూ భారత్‌కు తిరిగి వచ్చేస్తామని చెప్పారట!

పిజ్జాలు, బర్గర్లు తిన్నా.. పప్పుచారు కాదనలేరు..

విదేశాలకు వెళ్లేటప్పుడు ఇన్స్టాగ్రామ్ రీల్స్, ఎయిర్‌పోర్ట్ పోజులు భలే ఆకర్షణీయంగా ఉంటాయి. కానీ తీరా అక్కడికి వెళ్లాక సొంతంగా వంట వండుకోవడం, గిన్నెలు తోముకోవడం, సున్నా డిగ్రీల చలిలో పనులేసుకోవడం గుర్తొచ్చాకే ఈ 'దేశభక్తి' లేదా 'హోమ్‌సిక్' నిద్రలేస్తుందేమో.. "విదేశీ చదువు కేవలం స్కిల్స్, ఎక్స్‌పోజర్ కోసమే తప్ప అక్కడ శాశ్వతంగా పాతుకుపోవడానికి కాదు" అని ఈ 81% మంది మహాశయులు చెబుతున్నారు. ఇక మిగిలిన 15 శాతం మంది మాత్రం "చదువయ్యాక ఏదో ఒక ఉద్యోగానికి అప్లై చేస్తాంలే" అని కవర్ చేశారు. అయితే ఆ ఉద్యోగం హైదరాబాద్‌లో చేస్తారా లేక న్యూయార్క్‌లో చేస్తారా అనేది మాత్రం సస్పెన్స్‌గానే ఉంచారు.

మాటలు ఓకే.. మరి చేతలు?

సర్వే ఫలితాలు సరే కానీ ఇక్కడొక చిన్న లాజిక్ ఉంది. విమానం ఎక్కే ముందు ప్రతీ ఒక్కరూ "చదువుకుని తిరిగొచ్చేస్తా అమ్మో!" అనే చెప్తారు. కానీ తీరా అక్కడ డాలర్లలోనో, పౌండ్లలోనో జీతం చేతికి రావడం మొదలయ్యాక.. వీకెండ్ పార్టీలు, మెరుగైన కార్లు, లైఫ్‌స్టైల్ అలవాటయ్యాక.. మనస్సు మెల్లగా మారుతుంది. విదేశాల్లో కొన్నాళ్ళు పనిచేసి మంచి ప్యాకేజీ రాగానే "మరో రెండేళ్ళు ఉండిపోదాం" అనే లూప్‌లో పడిపోతుంటారు. పెళ్లిళ్లు, స్నేహితులు, ఆస్తులు అని అక్కడ సామాజిక మూలాలు గట్టిపడ్డాక ఈ 81% కాస్తా ఎంత శాతానికి పడిపోతుందో ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు! మొత్తానికి "విదేశీ విద్య అంటే కేవలం సెటిల్ అవ్వడమే కాదు, గ్లోబల్ ఎక్స్‌పోజర్ సాధించి తిరిగి వచ్చి ఇక్కడే జెండా పాతడం" అనే ఆలోచన నేటి యూత్‌లో పెరగడం శుభపరిణామమే. కాకపోతే ఈ 81 శాతం మందిలో ఎంతమంది నిజంగా వాపస్ వస్తారు, ఎంతమంది డాలర్ల మోజులో అక్కడే 'పర్మనెంట్' అయిపోతారో కాలమే సమాధానం చెప్పాలి.

విజయ్.. లెక్క పక్కా!

తమిళనాడులో కొత్తగా ఏర్పడిన టీవీకే సర్కారు ప్రవేశపెట్టిన తొలి పూర్తిస్థాయి బడ్జెట్, ఓటు బ్యాంకు సెక్టార్‌ను ఆకర్షిస్తూనే.. రాష్ట్ర సమగ్రాభివృద్ధి విషయంలో జాగ్రత్తపడింది. దాదాపు ఆరు దశాబ్దాల తర్వాత ద్రవిడేతర పార్టీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ చారిత్రక బడ్జెట్, ఆర్థికాభివృద్ధి, సామాజిక సంక్షేమం, న్యాయం – ఈ మూడింటికీ సమాన ప్రాధాన్యత ఇవ్వాలన్న తమిళనాడు దీర్ఘకాలిక వ్యూహాన్నే కొనసాగించడం విశేషం. ఇదే తమిళనాడును ఇతర రాష్ట్రాలనుంచి వేరు చేసే ప్రత్యేకతగా నిలుస్తోంది. విజయ్ నేతృత్వంలోని టీవీకే ప్రభుత్వం, పలు సంక్షేమ హామీలతో అధికారంలోకి వచ్చింది. మహిళలను లక్ష్యంగా చేసుకుని ప్రకటించిన రెండు ప్రజాకర్షక పథకాలకు రూ. 1,300 కోట్లకు పైగా కేటాయింపులు జరిపారు. ఈ బంగారు సహాయ పథకాలు, ప్రభుత్వ ఆసుపత్రుల్లో పెళ్లి చేసుకునే, ప్రసవించే అర్హులైన మహిళలకు లబ్ధి చేకూర్చనున్నాయి. ఈ రెండు పథకాలకూ లింగ సమానత్వం, ప్రజారోగ్యం కోణంలో విస్తృత ప్రాముఖ్యత ఉంది. ఇవి పరోక్షంగా ఖర్చులను తగ్గించి, పొదుపును పెంచుతాయి. ఉదాహరణకు, నవజాత శిశువుల పథకం ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాలను ప్రోత్సహిస్తుంది, తద్వారా ప్రయివేట్ ఆసుపత్రుల్లో అయ్యే భారీ ఖర్చులను తగ్గిస్తుంది. రాష్ట్రంలో ఇప్పటికే మొత్తం ప్రసవాల్లో దాదాపు 50 శాతం ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే జరుగుతున్న నేపథ్యంలో, పటిష్టమైన ప్రభుత్వ వైద్య మౌలిక సదుపాయాలు ఉన్న రాష్ట్రానికి ఈ పథకం మరింత అర్థవంతం. డీఎంకే పాలనలో మహిళలు, పిల్లల భద్రతా లోపంపై గగ్గోలు పెట్టిన టీవీకే, అధికారంలోకి వచ్చాక పూర్తి మహిళా ప్రత్యేక చర్యల పోలీసు బలగాన్ని ప్రారంభించింది. ఈ బడ్జెట్‌లో సింగపెన్న్ టాస్క్ ఫోర్స్ కోసం రూ. 354 కోట్లు కేటాయించారు. అయితే, గతంలోని ప్రభుత్వాలు కూడా మహిళా కేంద్రిత పోలీసింగ్‌ను ప్రవేశపెట్టడంలో ముందంజలో ఉన్నాయని గుర్తించాలి. అన్ని మహిళా పోలీస్ స్టేషన్లు, పింక్ పెట్రోల్ బృందాల ఏర్పాటు వీటికి నిదర్శనం.

యువత, పిల్లల్లో టీవీకే పార్టీకి భారీ అభిమాన వర్గం ఉంది. అంతేకాదు, ముఖ్యంగా పాఠశాల విద్యపై దృష్టి పెట్టడం తమిళనాడుకు దీర్ఘకాల సంప్రదాయం. దీనికి అనుగుణంగా, ఈ బడ్జెట్‌లో విద్యా రంగానికి రూ. 44,527 కోట్ల భారీ కేటాయింపు ప్రకటించారు. ఉచిత ల్యాప్‌టాప్‌లు, విస్తరించిన అల్పాహార పథకం, పాఠశాల మౌలిక సదుపాయాలు, హాస్టళ్ల నవీకరణకు గణనీయమైన పెట్టుబడులతో పాటు, లక్ష మంది విద్యార్థులకు వసతి కల్పించే సామర్థ్యంతో 200 సమీకృత హాస్టళ్ల నిర్మాణాన్నీ ప్రకటించారు. 3,734 ప్రభుత్వ పాఠశాలల ఆధునికీకరణకు రూ. 300 కోట్లు కేటాయించగా, పరిశుభ్రత, భద్రత లక్ష్యంగా 10,000 పాఠశాలల్లో 'సూపర్ క్లీన్, సూపర్ క్యాంపస్' కార్యక్రమాన్ని రూ. 139 కోట్లతో ప్రారంభించనున్నారు. మునుపటి ప్రభుత్వం భారీ ప్రచారంతో 'నాన్ ముదల్వన్' నైపుణ్యాభివృద్ధి పథకాన్ని ప్రారంభించగా, టీవీకే ప్రభుత్వం తన సొంత 'వెట్రి స్కిల్ డెవలప్‌మెంట్' పథకాన్ని ప్రకటించింది. ఇది 13 లక్షలమందికి పైగా యువతకు పరిశ్రమ అనుకూల, ఉద్యోగావకాశాలున్న నైపుణ్యాలను అందించనుంది. చదువుకున్న యువతలో పెరుగుతున్న నిరుద్యోగాన్ని ఎదుర్కొనేందుకు ఈ పథకాలు దోహదపడతాయని భావిస్తున్నారు. అంతేకాకుండా, ఉన్నత విద్యాశాఖకు రూ. 8,393 కోట్లు కేటాయించగా, మధురైలో ప్రత్యేక న్యాయ కళాశాలను 2027–28 విద్యా సంవత్సరం నుంచి ప్రారంభించనున్నట్టు ప్రకటించారు. రాష్ట్రవ్యాప్తంగా ఐదు కొత్త పారిశ్రామిక శిక్షణ సంస్థలను ఏర్పాటు చేయనున్నారు. 2036 నాటికి రాష్ట్రాన్ని 1.5 లక్షల కోట్ల డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలన్న లక్ష్యాన్ని ఆర్థిక మంత్రి ఎన్ మేరీ విల్సన్ పునరుద్ఘాటించారు.

పొరుగు రాష్ట్రాలైన కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణలు తమను తాము సాంకేతిక కేంద్రాలుగా ప్రచారం చేసుకుంటూ, పెట్టుబడులను ఆకర్షించడంలో దూకుడుగా వ్యవహరిస్తున్న నేపథ్యంలో, తమిళనాడు తీవ్ర పోటీని ఎదుర్కొంటోంది. ఈ బడ్జెట్‌లో వెనుకబడిన జిల్లాల్లో అత్యాధునిక పారిశ్రామిక మౌలిక సదుపాయాల ఏర్పాటు, తూత్తుకూడి, తిరునల్వేలిలో అంతరిక్ష రంగాన్ని (మునుపటి ప్రభుత్వం ప్రారంభించినది) ప్రోత్సహించడం, రవాణా మౌలిక సదుపాయాలు, లాజిస్టిక్స్ పార్కుల అభివృద్ధికి గణనీయమైన కేటాయింపులున్నాయి. తీరప్రాంతాల కోతను ఎదుర్కొనేందుకు, చేపల వేటపై ఆధారపడిన కుటుంబాలకు పరిహారం, పునరావాస చర్యలకు, పల్లికరణై చిత్తడి నేల పునరుద్ధరణకు రూ. 3,000 కోట్లతో ప్రత్యేక వాతావరణ బడ్జెట్‌పైనా దృష్టి ఉంది. దివంగత ముఖ్యమంత్రి జయలలిత ప్రారంభించిన ఉచిత పాడి ఆవుల పంపిణీ పథకాన్ని పునరుద్ధరించడంతో పాటు, బలహీన వర్గాల మహిళల కోసం కొత్త మేకల పెంపక కార్యక్రమాన్ని కూడా ప్రకటించారు. గ్రామీణ జీవనోపాధిని పశుసంపద రంగం ద్వారా బలోపేతం చేయాలన్న లక్ష్యంతో ఇది రూపొందింది. టెండర్లలో పారదర్శకత, "కట్" వసూళ్లను నిలిపివేయడం వంటి సంస్కరణాత్మక చర్యలను కూడా ఆర్థిక మంత్రి బడ్జెట్‌లో ప్రస్తావించారు. రాజకీయ పోటీ, పరస్పర విమర్శలు, వాగ్బాణాలు పక్కనపెడితే, గత ప్రభుత్వాల మంచి కార్యక్రమాలను టీవీకే కొనసాగిస్తూ, తనదైన వినూత్న ఆలోచనలు, వ్యూహాలతో వాటిని మరింత బలోపేతం చేయాల్సిన అవసరముంది. కొత్తగా ఏర్పడిన రాజకీయ పార్టీగా, కొత్త ముఖాలతో కూడిన బృందంతో టీవీకే, తన తొలి బడ్జెట్‌లోనే వేగంగా రాజకీయ మెళకువలు నేర్చుకుంటున్నట్టు స్పష్టమవుతోంది. అయితే, రాష్ట్రాన్ని 1.5 లక్షల కోట్ల డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలన్న తన ప్రతిష్ఠాత్మక లక్ష్య సాధనలో, పథకాల వాస్తవ అమలు విషయంలో మరింత తీవ్రమైన, విమర్శనాత్మక పరిశీలనకు పార్టీ సిద్ధపడాల్సి ఉంటుంది.

టీవీకే ప్రభుత్వానికి ఇది కేవలం తొలి అడుగు మాత్రమే. నిధుల కేటాయింపు సులభమే అయినా, క్షేత్రస్థాయిలో పారదర్శకంగా అమలు చేయడమే అసలైన సవాలు. మహిళా సంక్షేమ పథకాలు, విద్యా కేటాయింపులు, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు కాగితాలపై ఆకర్షణీయంగా కనిపించినా, వాటి ప్రయోజనం లబ్ధిదారులకు చేరినప్పుడే బడ్జెట్ సార్థకత నిరూపితమవుతుంది. ఆర్థిక క్రమశిక్షణను కాపాడుకుంటూనే సంక్షేమ హామీలను నెరవేర్చడం, పెరుగుతున్న రుణభారాన్ని నియంత్రించడం వంటి సవాళ్లు ప్రభుత్వం ముందున్నాయి. వచ్చే ఏడాది బడ్జెట్ నాటికి, ఈ పథకాల ఫలితాలు ఎంత మేరకు ప్రజలకు చేరాయో బేరీజు వేసుకోవడం ద్వారానే, టీవీకే పాలనా సామర్థ్యంపై అసలైన అంచనా వేయగలుగుతాం!

పనికొచ్చే పలుకు

నమ్మకమే.. అదృశ్య ఆయుధం!

ఏదైనా సాధించాలనే సంకల్పం ఉన్నప్పుడు, మనపై మనకుండే నమ్మకమే తొలి విజయం. అమెరికా మాజీ అధ్యక్షుడు థియోడర్ రూజ్‌వెల్ట్ చెప్పిన చిన్న మాట. కాని వ్యాఖ్య వెనుక లోతైన అర్థం, ప్రాముఖ్యత అర్థం చేసుకుంటే –పెద్ద మాటే! "నువ్వు సాధించగలవని గట్టిగా నమ్ము.. దాంతో సగం విజయం నీ సొంతమైనట్లే" అని అగ్రరాజ్య 26వ అధ్యక్షుడు థియోడర్ రూజ్‌వెల్ట్ పేర్కొన్నారు. కొన్ని మాటలు చాలా సరళంగా కనిపిస్తాయి, కానీ వాటిలో కొండంత బలముంటుంది. రూజ్‌వెల్ట్ చెప్పిన ఈ మాటలు కేవలం ఒక స్ఫూర్తి వాక్యం మాత్రమే కాదు, ప్రతి ఒక్కరి జీవితంలో విజయాన్ని ఖాయం చేసే బలమైన పునాది. పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థులైనా, కొత్త వ్యాపారం ప్రారంభించే ఔత్సాహికులైనా, కెరీర్‌లో కొత్త ఎత్తులకు ఎదగాలనుకునే వారైనా.. ఆత్మవిశ్వాసమే విజయానికి తొలి మెట్టు అని ఈ సందేశం స్పష్టం చేస్తోంది.

బాహ్య ప్రపంచంలో ఎన్నో సవాళ్లు ఎదురైనప్పుడు మనల్ని ముందుకు నడిపించేది ఆత్మవిశ్వాసమే. మనం ఒక పని చేయగలమని బలంగా నమ్మినప్పుడు, సందేహాలు, భయాలు తొలగిపోతాయి. "సగం విజయం సాధించినట్లే" అంటే శ్రమ లేకుండానే విజయం వస్తుందని కాదు. మనసులోని ఆత్మసందేహాన్ని జయించడమే సగం విజయం. ఆత్మవిశ్వాసం ఉన్నప్పుడు అవకాశాలను పట్టుకోవడం, పొరపాట్ల నుంచి పాఠాలు నేర్చుకోవడం, కష్ట సమయాల్లోనూ నిలబడటం సాధ్యమవుతాయి. అయితే, కేవలం నమ్మకం మాత్రమే సరిపోదు. ఆ నమ్మకానికి తగిన కృషి తోడైనప్పుడే పూర్తి విజయం లభిస్తుంది.

తీవ్రమైన పోటీ, అనిశ్చితి నెలకొన్న ఈ కాలంలో చాలామంది ఒత్తిడికి గురవుతుంటారు. విమర్శలు, విఫలమవుతామనే ఆందోళన పురోగతిని అడ్డుకుంటాయి. ఇలాంటి సమయంలో రూజ్‌వెల్ట్ మాటలు దిశానిర్దేశం చేస్తాయి. పరిపూర్ణత కంటే నిరంతర ప్రయత్నమే ముఖ్యమని ఈ సందేశం గుర్తుచేస్తుంది. ప్రతిభ, కష్టపడే తత్వం ఉన్నప్పటికీ, ఆత్మవిశ్వాసం లేకపోతే అసలు మొదటి అడుగే పడదు. ప్రపంచంలో విజయం సాధించిన ప్రతి ఒక్కరూ తమ ప్రయాణాన్ని ఆత్మవిశ్వాసంతోనే ప్రారంభించారు. ఆత్మవిశ్వాసాన్ని పెంచుకునే 5 మార్గాలు. రోజువారీ జీవితంలో ఈ సూత్రాన్ని అమలు చేయడం వల్ల ఆలోచనా విధానంలో సానుకూల మార్పు వస్తుంది.

చిన్న లక్ష్యాలు: సాధ్యమయ్యే చిన్న చిన్న లక్ష్యాలను నిర్దేశించుకోవడం. చిన్న విజయాల గుర్తింపు: సాధించిన ప్రతి చిన్న విజయాన్ని గుర్తించి ఆనందించడం. ఓటమి నుంచి పాఠాలు: ఓటమికి భయపడకుండా, లోపాలను సరిదిద్దుకోవడం. సానుకూల వాతావరణం: ప్రోత్సహించే వ్యక్తులతో సమయం గడపడం. నిరంతర పురోగతి: పరిపూర్ణత కోసం కాకుండా నిరంతరం మెరుగవ్వడంపై దృష్టి పెట్టడం.

ఎవరీ థియోడర్ రూజ్‌వెల్ట్?

1901నుంచి 1909 వరకు అమెరికా 26వ అధ్యక్షుడు. అమెరికా చరిత్రలోనే అత్యంత ప్రభావవంతమైన నాయకుడిగా నిలిచారు. రష్యా–జపాన్ యుద్ధాన్ని ముగించడంలో కీలక పాత్ర పోషించినందుకు 1906లో నోబెల్ శాంతి బహుమతి సాధించారు. ఆ బహుమతి పొందిన తొలి అమెరికా అధ్యక్షుడు రూజ్‌వెల్ట్. గొప్ప రచయితగా, చరిత్రకారుడిగా, సైనికుడిగా సేవలు అందించిన రూజ్‌వెల్ట్ 1919లో కన్నుమూశారు.

పింక్ రథం! క్యాన్సర్‌పై యుద్ధం!!

రాయలసీమ పల్లెల్లో క్యాన్సర్ నిర్ధారణకు 'పింక్ బస్' కొత్త ఆశగా మారింది. స్విమ్స్, టీటీడీ ప్రాణదాన ట్రస్ట్ సహకారంతో ఇప్పటివరకు 770 క్యాంపుల్లో 43 వేల మందికి ఉచిత స్క్రీనింగ్ నిర్వహించారు. అనుమానిత 4,500 మందిని తదుపరి పరీక్షలకు రిఫర్ చేయగా, 500 మందికి పూర్తిస్థాయి చికిత్స అందించారు. బస్సులోని వైద్య సిబ్బంది అంతా మహిళలే కావడం గ్రామీణ మహిళలకు మరింత భరోసానిస్తోంది. అయితే, స్థానిక సమన్వయ లోపం ఈ పథకం పూర్తి సామర్థ్యాన్ని అందుకోకుండా అడ్డుపడుతోంది.

రాయలసీమ జిల్లాల్లో, ముఖ్యంగా ఉమ్మడి చిత్తూరు జిల్లా పల్లెల్లో ఇప్పుడు 'పింక్ బస్' అనే పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, టీటీడీ ప్రాణదాన ట్రస్ట్ సహకారంతో శ్రీ వేంకటేశ్వర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (స్విమ్స్), ఈ ప్రత్యేక వాహనాల ద్వారా ప్రజల ఇంటి గుమ్మం వద్దకే వెళ్లి క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తోంది. దేశంలో క్యాన్సర్ ప్రధాన ఆరోగ్య సమస్యగా మారడం, అత్యధిక కేసులు వ్యాధి ముదిరిన దశలోనే బయటపడుతుండటం, స్క్రీనింగ్‌పై సరైన అవగాహన లేకపోవడం, అపోహల కారణంగా ఆసుపత్రులకు వెళ్లేందుకు ప్రజలు వెనుకాడుతుండటం వంటి అంశాలను దృష్టిలో పెట్టుకుని ఈ కార్యక్రమాన్ని రూపొందించారు. దేశవ్యాప్తంగా ఏటా దాదాపు 14 లక్షల కొత్త క్యాన్సర్ కేసులు నమోదవుతున్నట్టు వైద్య నిపుణుల అంచనా. వీటిలో ముఖ్యంగా మహిళలకు వచ్చే రొమ్ము, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్లు, స్త్రీ, పురుషులు ఇద్దరికీ వచ్చే నోటి క్యాన్సర్‌పై పింక్ బస్ ప్రధానంగా దృష్టి సారించింది. మారుమూల గ్రామీణ ప్రాంతాల్లో ఉన్నవారికి క్యాన్సర్ స్క్రీనింగ్, చికిత్స అందించే వసతులు లేని లోటును పూడ్చేందుకు, దాతల సహకారంతో ఒక్కో బస్సుకు దాదాపు రూ. 3 కోట్ల వ్యయంతో రెండు పింక్ బస్సులను ఏర్పాటు చేశారు. తిరుపతివంటి పెద్ద నగరాలకు వచ్చి పరీక్షలు చేయించుకోవాలంటే రూ. 10 వేల వరకూ ఖర్చవుతుందని, దూరాభారం, ఆర్థిక భారం కారణంగా చాలామంది వెనుకంజ వేస్తారని గుర్తించి, వారి ఊళ్లకే వెళ్లి ఉచితంగా ఈ సేవలు అందిస్తున్నారు. క్యాన్సర్ నయం కాని వ్యాధి అనే భ్రమను తొలగించి, ముందుగా గుర్తిస్తే పూర్తిగా చికిత్స చేయవచ్చున్న అవగాహన కల్పించడం, రూ. 5–6 లక్షల విలువైన చికిత్సను ఎన్టీఆర్ వైద్య సేవ, టీటీడీ ప్రాణదానం నిధుల ద్వారా పైసా ఖర్చు లేకుండా అందించడం ఈ కార్యక్రమ లక్ష్యం.

మొదటి దశలో భాగంగా తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో పల్లెపల్లెకు తిరుగుతున్న పింక్ బస్ ద్వారా ఇప్పటివరకు దాదాపు 770 క్యాంపులు నిర్వహించారు. 43 వేలమందికి స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. క్యాన్సర్ ఉండొచ్చనే అనుమానంతో 4,500 మందిని మరిన్ని పరీక్షల కోసం స్విమ్స్‌కు రిఫర్ చేయగా, వీరిలో దాదాపు 500 మందికి సంపూర్ణ చికిత్స అందించారు. పింక్ బస్సులో కేవలం క్యాన్సర్ స్క్రీనింగ్ మాత్రమే కాకుండా దంతవైద్యం, నేత్రవైద్యం, ఈఎన్‌టీ, పిల్లల వైద్య సేవలు కూడా అందిస్తూనే.. గిరిజన ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి పెట్టారు. 2018లో ప్రారంభమైన ఈ కాన్సెప్ట్, ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సంజీవని ఆరోగ్య కార్యక్రమంలో భాగంగా రాష్ట్రమంతటా విస్తరించే యోచనలో ఉన్నారు. ప్రభుత్వ నిధులతోపాటు, టీటీడీ భక్తుల విరాళాలతో నడిచే ప్రాణదానం నిధులు, ఐవోసీఎల్, రిలయన్స్ వంటి సంస్థల కార్పొరేట్ సామాజిక బాధ్యత నిధుల ద్వారా అందించిన అత్యాధునిక పరికరాలను ఈ సేవలకు వినియోగిస్తున్నారు. బస్సులో 35 ఏళ్లు దాటిన ప్రతి మహిళకూ మామోగ్రఫీ ద్వారా రొమ్ము క్యాన్సర్ పరీక్ష, పాప్ స్మియర్ ద్వారా గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ పరీక్ష, అల్ట్రాసౌండ్ స్కాన్, నోటి క్యాన్సర్ గుర్తింపునకు ఓరోస్కోప్ వంటి పరికరాలు అందుబాటులో ఉన్నాయి. బస్సులో పనిచేసే వైద్యులు, సాంకేతిక నిపుణులు అందరూ మహిళలే కావడం విశేషం. డ్రైవర్, భద్రతా సిబ్బంది వినా మిగతా వారంతా మహిళలే. గ్రామీణ ప్రాంతాల్లో పెద్ద ఆసుపత్రులకు వెళ్లే అవకాశం తక్కువగా ఉండే వారికి, దంత సమస్యలు, కంటి, చెవి జబ్బులకు కూడా ఇక్కడే పరీక్షలు, చికిత్స అందుతున్నాయి. క్యాంపులకు వచ్చే వారిలో 70 శాతం మంది పెద్దగా చదువుకోని వారేనని, క్యాన్సర్ అనే పదం వినగానే భయపడిపోతారని వైద్యాధికారులు చెబుతున్నారు. అందుకే క్యాంపులను "జనరల్ హెల్త్ క్యాంప్"గా పిలుస్తూ ప్రజలను ఆకర్షిస్తున్నారు. నోటి క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ –ఈ మూడింటిపైనే ప్రధానంగా అవగాహన కల్పిస్తున్నారు. పొగాకు వాడకం మానేయడం ద్వారా నోటి క్యాన్సర్‌ను, కుటుంబ చరిత్ర ఉన్నవారు ముందస్తుగా పరీక్షలు చేయించుకోవడం ద్వారా రొమ్ము క్యాన్సర్‌ను నివారించే అవకాశం ఉందని నిపుణులు సూచిస్తున్నారు. జాతీయస్థాయిలో చూసినా, గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో క్యాన్సర్ స్క్రీనింగ్ రేటు ఇప్పటికీ చాలా తక్కువగా ఉందని, అవగాహన లేమే ప్రధాన కారణమని పలు అధ్యయనాలు వెల్లడించాయి. దేశవ్యాప్తంగా గ్రామీణ మహిళల్లో అత్యధికులు స్క్రీనింగ్ కార్యక్రమాల గురించి తెలియకపోవడం వల్లే పరీక్షలకు దూరంగా ఉంటున్నారని తెలుస్తోంది.

అయితే, పింక్ బస్ పథకం ఆచరణలో మంచి ఫలితాలు ఇస్తున్నా, నిర్వహణలో సమన్వయ లోపం స్పష్టంగా కనిపిస్తోంది. కార్యక్రమం నిరంతరాయంగా కొనసాగితేనే దీని ప్రయోజనం పూర్తిస్థాయిలో అందుతుందని, కానీ ప్రస్తుతం స్థానిక నేతల సహకారం లభించిన రోజుల్లో మాత్రమే బస్సు గ్రామాలకు వెళ్తుండటం, స్థానిక సమన్వయ లోపంవల్ల ఏర్పాట్లు సక్రమంగా జరగకపోవడం వంటి సమస్యలున్నట్టు నిపుణులు గుర్తించారు. వైద్య, ఆరోగ్య శాఖ, స్విమ్స్ అంకాలజీ విభాగం, దేశంలోనే అతిపెద్ద క్యాన్సర్ ఆసుపత్రి అయిన టాటా ట్రస్ట్ క్యాన్సర్ ఆసుపత్రి –ఈ మూడు సంస్థలూ సమన్వయంతో పనిచేస్తేనే ఈ సేవలు నిజమైన ప్రయోజనం చేకూర్చగలవు. లేకుంటే అవగాహన కల్పించే వేదికగానే మిగిలిపోయే ప్రమాదముంది. దేశవ్యాప్తంగా జాతీయ క్యాన్సర్ గ్రిడ్ 300కు పైగా కేంద్రాలతో ఏర్పాటైనప్పటికీ, గ్రామీణ ప్రాంతాల్లో స్క్రీనింగ్ నుంచి చికిత్స వరకూ సమగ్రమైన రిఫరల్ వ్యవస్థ ఇప్పటికీ బలహీనంగానే ఉందని ఆరోగ్య రంగ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. పింక్ బస్ వంటి పథకాలు గ్రామీణ ప్రాంతాల్లో క్యాన్సర్ నిర్ధారణ ఆలస్యాన్ని తగ్గించే దిశగా ముఖ్యమైన అడుగు అయినప్పటికీ, వీటిని శాశ్వత ప్రాతిపదికన, స్థిరమైన నిధులు, సిబ్బంది, స్థానిక సమన్వయంతో నడిపించినప్పుడే క్యాన్సర్ మరణాల రేటును సమర్థంగా తగ్గించగలమని ఆరోగ్య రంగ నిపుణులు సూచిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రమంతటా ఈ సేవలను విస్తరించాలన్న ప్రభుత్వ లక్ష్యం సాకారమైతే, గ్రామీణ ఆరోగ్య రంగంలో ఇది ఒక మార్గదర్శక నమూనాగా నిలిచే అవకాశం లేకపోలేదు! ■



ఏకాంతంలో మనసు అల్లుకునే ఆలోచనలే, రేపటి మన నిజస్వరూపానికి బీజాలు. లోలోపల సాకులు అల్లుకునేవాడు, బయటి ప్రపంచానికీ సాకులనే బహుమతిగా ఇస్తాడు - ఆశ్చర్యపడాల్సిన పనిలేదు. ఏకాంతపు నిశ్శబ్దంలో నాటిన విత్తనమే, గుంపు మధ్య పంట రూపంలో పండుతుంది. అందుకే, ఒంటరిగా ఉన్నప్పుడు మనసుకు ఏం తినిపిస్తున్నామో గమనించుకోవడం అవసరం - ఎందుకంటే ఆ ఆహారమే, రేపు మన మాటల్లో, చేతల్లో ప్రతిబింబిస్తుంది.

-మహాదేవ

వింతల్లో వింతలు

బ్లాక్ విడోస్!



రష్యా–ఉక్రెయిన్ యుద్ధంలో సైనికులు మరణిస్తే, వారి జీవిత భాగస్వాములకు ప్రభుత్వం 50 లక్షలనుంచి 80 లక్షల రూబుళ్ల (సుమారు రూ. 55 లక్షల నుంచి రూ. 90 లక్షలు) పరిహారం అందిస్తుంది. ఈ నియమాన్నే కొందరు మహిళలు దుర్వినియోగం చేస్తున్నారని రష్యా మీడియా వెల్లడించింది. యుద్ధానికి వెళ్లే బలహీన మనస్తత్వం కలిగిన పురుషులను మోసపూరితంగా వివాహం చేసుకుని, వారు మరణించిన వెంటనే పరిహారం సొమ్మును కాజేస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. సెయింట్ పీటర్స్‌బర్గ్‌కు చెందిన మరియా అనే మహిళ, తన తండ్రి యుద్ధంలో మరణించే వరకూ ఆయన సైన్యంలో చేరిన విషయమే తనకు తెలియదని, ఆయన వివాహం చేసుకున్న మహిళ కూడా తనకు తెలియదని సీఎన్ఎన్‌తో పంచుకున్నారు. ఈ ధోరణి ఆన్‌లైన్‌లో బహిరంగంగా చర్చనీయాంశంగా మారగా, దీన్ని ప్రోత్సహించినట్టు వ్యాఖ్యానించిన ఓ రియల్ ఎస్టేట్ ఏజెంట్‌పై చట్టపరమైన చర్యలు కూడా తీసుకున్నారు.

ఆరోగ్యానికి ఎంతో మేలు చేసే రన్నింగ్..

కొత్తగా ప్రారంభించేవారు తెలుసుకోవాల్సిన విషయాలు ఇవే..

పరుగెత్తడం శారీరక దృఢత్వాన్ని పెంచడంతోపాటు గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరచే అత్యంత సులభమైన వ్యాయామాల్లో ఒకటి. క్రమం తప్పకుండా పరుగెత్తడం వల్ల శరీర సహనశక్తి పెరగడమే కాకుండా, టైప్ 2 డయాబెటిస్, పక్షవాతం వంటి వ్యాధుల ప్రమాదం తగ్గే అవకాశం ఉంటుంది. అలాగే మానసిక ఒత్తిడి తగ్గి రోజంతా ఉత్సాహంగా ఉండేందుకు కూడా ఇది సహాయపడుతుంది. అయితే మొదటిసారి రన్నింగ్ ప్రారంభించేవారు కొన్ని ముఖ్యమైన విషయాలను తెలుసుకుని ముందుకు సాగితే గాయాల ప్రమాదం తగ్గి మంచి ఫలితాలు పొందవచ్చు.పరుగెత్తడం ప్రారంభించే ముందు సరైన రన్నింగ్ షూస్‌ను ఎంపిక చేసుకోవడం చాలా ముఖ్యం. ప్రతి ఒక్కరి పాదాల ఆకృతి, నడక తీరు భిన్నంగా ఉంటుంది. అందుకే రన్నింగ్‌కు అనువైన షూస్ ను నిపుణుల సలహాతో ఎంపిక చేసుకుంటే పాదాలు, చీలమండలు, మోకాళ్లపై అనవసర ఒత్తిడి పడకుండా ఉంటుంది.

దుస్తులు, సమయం..

రన్నింగ్ సమయంలో ధరించే దుస్తులు కూడా పనితీరుపై ప్రభావం చూపుతాయి. చెమటను త్వరగా బయటకు పంపే సింథటిక్ ఫ్యాబ్రిక్‌తో తయారైన దుస్తులు ఉపయోగించడం మంచిది. పూర్తిగా కాటన్‌తో తయారైన దుస్తులు చెమటను నిల్వ ఉంచి చర్మం చికాకు, వాపులు వంటి సమస్యలకు కారణమయ్యే అవకాశం ఉంటుంది.

ప్రారంభంలోనే ఒక స్పష్టమైన ప్రణాళికను రూపొందించుకోవాలి. మొదట ఒక నిమిషం పరుగెత్తి, ఐదు నిమిషాలు నడిచే విధానంతో ప్రారంభించడం ఉత్తమం. క్రమంగా శరీరం అలవాటు పడిన తర్వాత పరుగెత్తే సమయాన్ని పెంచుకోవచ్చు. ముఖ్యంగా రూపొందించుకున్న ప్రణాళికను క్రమం తప్పకుండా పాటించడం విజయానికి కీలకం. మొదటి రోజే ఎక్కువ దూరం లేదా ఎక్కువ సమయం పరుగెత్తేందుకు ప్రయత్నించకూడదు. చిన్న చిన్న వ్యవధులతో ప్రారంభించి, తర్వాత క్రమంగా దూరాన్ని, వేగాన్ని పెంచుకోవాలి. చాలా వేగంగా ప్రారంభించడం వల్ల మోకాళ్లు, చీలమండలపై ఒత్తిడి పెరిగి గాయాలకు అయ్యే ప్రమాదం ఉంటుంది.

తగినంత నీరు అవసరం..

రన్నింగ్ చేసే ముందు శరీరంలో తగినంత నీరు ఉండేలా చూసుకోవాలి. పరుగెత్తడానికి రెండు గంటల ముందు కనీసం అర లీటర్ నీరు తాగడం మంచిది. ఎక్కువసేపు పరుగెత్తే సమయంలో కూడా అవసరాన్ని బట్టి నీరు తాగడం వల్ల డీహైడ్రేషన్ సమస్య రాకుండా ఉంటుంది. పరుగెత్తే ముందు వార్మప్ చేయడం తప్పనిసరి. ఐదు నిమిషాలు నడవడం లేదా తేలికపాటి స్ట్రెచింగ్, వార్మప్ వ్యాయామాలు చేయడం ద్వారా కండరాలు సడలిపోతాయి. దీంతో గాయాల ప్రమాదం తగ్గి శరీరం పరుగుకు సిద్ధమవుతుంది. రన్నింగ్‌తోపాటు విశ్రాంతి కూడా అంతే అవసరం. వ్యాయామం చేసిన తర్వాత కండరాలు కోలుకోవడానికి శరీరానికి సమయం ఇవ్వాలి. ప్రారంభ దశలో ఒక రోజు పరుగెత్తి, మరుసటి రోజు విశ్రాంతి తీసుకోవడం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు.

ఇతర వ్యాయామాలు కూడా చేస్తే..

రన్నింగ్‌తో పాటు ఇతర వ్యాయామాలు కూడా చేయడం ఉపయోగకరం. సైక్లింగ్, ఈత, యోగా లేదా ఇతర క్రీడల్లో పాల్గొనడం వల్ల శరీర సమతుల్యత మెరుగుపడుతుంది. అలాగే ఒకే రకమైన వ్యాయామం వల్ల కండరాలపై పడే ఒత్తిడి కూడా తగ్గుతుంది. కొన్ని రోజులు అలసటగా అనిపించినా లేదా బద్ధకంగా ఉన్నా రన్నింగ్‌ను పూర్తిగా మానేయకూడదు. ఒక రోజు వాయిదా వేయడం అలవాటై, తర్వాత పూర్తిగా ఆపివేసే పరిస్థితి రావచ్చు. అందుకే క్రమశిక్షణతో వ్యాయామాన్ని కొనసాగించడం చాలా ముఖ్యం. ఎప్పుడూ ఒకే విధంగా పరుగెత్తకుండా అప్పుడప్పుడు మార్పులు చేసుకోవాలి. కొన్నిసార్లు స్ప్రింట్లు, మరికొన్నిసార్లు నెమ్మదిగా జాగింగ్ చేయడం మంచిది. అలాగే ప్రతిరోజూ ఒకే ప్రదేశంలో కాకుండా పార్కులు, కొండ ప్రాంతాలు వంటి కొత్త ప్రదేశాల్లో పరుగెత్తడం వల్ల ఆసక్తి పెరగడంతోపాటు సహనశక్తి, కండరాల బలం కూడా మెరుగుపడుతుందని నిపుణులు సూచిస్తున్నారు.

పసుపు తెలుపు రంగులోనూ ఉంటుందని మీకు తెలుసా..

దాంతో ఎలాంటి లాభాలు కలుగుతాయంటే..?

తెల్ల పసుపు (వైట్ టర్మరిక్) లేదా జెడోయరీ భారతీయులకు పెద్దగా పరిచయం లేని అరుదైన సుగంధ ద్రవ్యం. మన దేశంలో ఎక్కువగా పసుపు రంగు పసుపును పండిస్తారు. అందువల్ల తెల్ల పసుపు చాలా తక్కువగా కనిపిస్తుంది. ఇది అల్లంలా కనిపించినప్పటికీ, ప్రత్యేకమైన ఔషధ గుణాలు కలిగిన దుంప. శాస్త్రీయంగా దీనిని కుర్కుమా జెడోయారియా (Curcuma zedoaria) అని పిలుస్తారు. కొన్ని భారతీయ భాషల్లో దీనిని అంబా పసుపు అని కూడా అంటారు. మామిడి, పసుపు కలిసినట్లుగా ఉండే సువాసన దీని ప్రత్యేకత. తెల్ల పసుపు బయటకు గోధుమరంగు తొక్కతో, లోపల నారింజ లేదా లేత పసుపు రంగులో గట్టి దుంపలా ఉంటుంది. అల్లంలా కనిపించినప్పటికీ, ఇది పసుపు కుటుంబానికి చెందిన మొక్క. సాధారణంగా పొడి రూపంలో, ఎండబెట్టిన ముక్కలుగా లేదా తాజాగా మార్కెట్‌లో లభిస్తుంది. భారతీయ వంటల్లో తెల్ల పసుపును తాజాగా వాడటమే కాకుండా ఊరగాయల తయారీలో కూడా ఉపయోగిస్తారు. ఇండోనేషియా వంటి దేశాల్లో దీనిని ఎండబెట్టి కరివేపాకు పొడులు, ముఖ్యంగా సముద్ర ఆహార కూరల్లో మసాలాగా ఉపయోగిస్తారు.

యాంటీ ఇన్‌ఫ్లమేటరీ, యాంటీ మైక్రోబియల్ గుణాలు..

తెల్ల పసుపులో యాంటీ ఇన్‌ఫ్లమేటరీ (వాపులను తగ్గించే), యాంటీ మైక్రోబియల్ (సూక్ష్మక్రిములను నిరోధించే) గుణాలు ఉంటాయి. అందువల్ల జీర్ణకోశం, శ్వాసకోశానికి సంబంధించిన కొన్ని సమస్యలను తగ్గించడంలో ఇది సహాయపడుతుందని నిపుణులు సూచిస్తున్నారు. జీర్ణక్రియ సరిగా లేకపోవడం, గ్యాస్, అజీర్ణం, మలబద్ధకం వంటి జీర్ణ సమస్యలను తగ్గించడంలో తెల్ల పసుపు ఉపయోగపడుతుంది. జీర్ణవ్యవస్థ పనితీరును మెరుగుపరచడంలో ఇది సహాయకారిగా ఉంటుంది. తెల్ల పసుపులో ఉండే వాపు నిరోధక గుణాలు కీళ్ల వాపు, ఆర్థ్రైటిస్ వంటి సమస్యలతో బాధపడేవారికి కొంత ఉపశమనం కలిగిస్తాయి. అలాగే చిన్న గాయాలు, కొన్ని చర్మ సమస్యల నుంచి కోలుకోవడంలో కూడా ఇది ఉపయోగపడుతుంది. ఇందులో ఉండే కుర్కుమెనోల్ అనే సమ్మేళనం నొప్పిని తగ్గించడంలో సహాయపడుతుందని కొన్ని అధ్యయనాలు సూచిస్తున్నాయి.

యాంటీ ఆక్సిడెంట్లు అధికం..

ఇందులోని యాంటీ ఆక్సిడెంట్లు శరీర కణాలను దెబ్బతీసే ఫ్రీ రాడికల్స్ ప్రభావాన్ని తగ్గించడంలో సహాయపడతాయి. అలాగే ఇందులో ఉండే కుర్కుమిన్ వంటి సమ్మేళనాలు అలెర్జీ ప్రతిచర్యలను ప్రేరేపించే కొన్ని రసాయనాల విడుదలను తగ్గించడంలో కూడా కీలక పాత్ర పోషిస్తాయని పరిశోధనలు సూచిస్తున్నాయి. శ్వాసకోశ ఆరోగ్యానికి కూడా తెల్ల పసుపు ఉపయోగకరంగా ఉంటుందని చెబుతున్నారు. ఊపిరితిత్తుల్లో కఫం, శ్లేష్మం పేరుకుపోవడం వల్ల ముక్కు మూసుకుపోవడం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, దగ్గు, జలుబు, ఆస్తమా వంటి సమస్యలు తలెత్తితే, తెల్ల పసుపులోని కొన్ని గుణాలు ఈ సమస్యలను తగ్గించడంలో తోడ్పడతాయని నిపుణులు చెబుతున్నారు. అయితే తెల్ల పసుపుపై జరిగిన పరిశోధనలు ఇంకా పరిమితంగానే ఉన్నాయి. కాబట్టి దీనిని ఆరోగ్య ప్రయోజనాల కోసం అధికంగా తీసుకునే ముందు వైద్యులు లేదా పోషకాహార నిపుణుల సలహా తీసుకోవడం మంచిది. సమతుల్య ఆహారంలో భాగంగా ఊరగాయలు, టీ లేదా కూరల్లో పరిమిత మోతాదులో చేర్చుకోవడం ద్వారా దీని రుచి, పోషక ప్రయోజనాలను పొందవచ్చు.

అసలు ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్లు అంటే ఏమిటి.. వీటి వల్ల ఎలాంటి లాభాలు కలుగుతాయి, వేటిని తీసుకోవాలి..

ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్లు శరీరానికి అత్యంత అవసరమైన ఆరోగ్యకరమైన కొవ్వులలో ఒకటి. ఇవి మెదడు పనితీరు, గుండె ఆరోగ్యం, శరీర కణాల పనితీరుకు కీలక పాత్ర పోషిస్తాయి. అయితే శరీరం ఈ ముఖ్యమైన కొవ్వులను స్వయంగా తయారు చేసుకోలేదు. అందుకే ఆహారం ద్వారా తప్పనిసరిగా తీసుకోవాలి. సమతుల్య ఆహారంలో ఒమెగా 3 సమృద్ధిగా ఉండే పదార్థాలను చేర్చుకోవడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు పొందవచ్చు. ఒమెగా3 ఫ్యాటీ యాసిడ్లు శరీరంలో వాపులను తగ్గించడంలో సహాయపడతాయి. అలాగే గుండె సంబంధిత వ్యాధుల ప్రమాదాన్ని తగ్గించడంలో కూడా ఇవి కీలక పాత్ర పోషిస్తాయని పరిశోధనలు సూచిస్తున్నాయి. ఇవి మెదడు ఆరోగ్యానికి కూడా ఎంతో ఉపయోగపడతాయి. అందుకే రోజువారీ ఆహారంలో ఒమెగా 3 అధికంగా ఉండే ఆహారాలను చేర్చాలని నిపుణులు సూచిస్తున్నారు.

చేపలు, చియా విత్తనాలు..

సాల్మన్ చేప ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్లకు అత్యుత్తమ వనరులలో ఒకటి. ఇందులో ఒమెగా 3తోపాటు ప్రోటీన్, పొటాషియం, సెలీనియం వంటి ముఖ్యమైన పోషకాలు కూడా సమృద్ధిగా ఉంటాయి. క్రమం తప్పకుండా చేపలు తినేవారికి ఇది మంచి ఎంపికగా నిలుస్తుంది. చియా గింజలు కూడా ఒమెగా 3కి అద్భుతమైన వనరు. వీటిని స్మూతీలు, మిల్క్‌షేక్‌లు, పెరుగు లేదా ఓట్స్‌లో కలిపి తీసుకోవచ్చు. అలాగే ధాన్యాలకు ప్రత్యామ్నాయంగా కూడా వీటిని ఉపయోగించవచ్చు. చిన్న పరిమాణంలోనే ఎక్కువ పోషకాలు అందించే గింజలలో చియా గింజలు ముఖ్యమైనవి. వాల్‌నట్స్‌లో ఒమెగా 3తో పాటు యాంటీ ఆక్సిడెంట్లు, ఖనిజ లవణాలు సమృద్ధిగా ఉంటాయి. వీటిని ఆరోగ్యకరమైన స్నాక్‌గా తీసుకోవచ్చు. రోజూ కొద్దిపాటి వాల్‌నట్స్ తినడం వల్ల గుండె ఆరోగ్యానికి మేలు కలగడమే కాకుండా శరీరానికి అవసరమైన మంచి కొవ్వులు కూడా అందుతాయి.

అవిసె గింజలు, సోయాబీన్స్..

అవిసె గింజలు (ఫ్లాక్స్‌సీడ్స్) సూపర్‌ఫుడ్‌గా గుర్తింపు పొందాయి. వీటిలో ఒమెగా 3తో పాటు ఫైబర్, ఇతర ముఖ్యమైన పోషకాలు కూడా ఉంటాయి. ఇవి ఆకలిని నియంత్రించడంలో, తీపి పదార్థాలపై కోరికను తగ్గించడంలో, బరువు నియంత్రణకు సహాయపడటంలో ఉపయోగపడతాయి. వీటిని పొడి చేసి చపాతీ పిండి, పెరుగు లేదా స్మూతీల్లో కలిపి తీసుకోవచ్చు. సోయాబీన్స్ కూడా ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్లకు మంచి వనరు. ముఖ్యంగా ఇందులో ఉండే ఆల్ఫా-లినోలెనిక్ యాసిడ్ గుండె ఆరోగ్యాన్ని కాపాడటానికి తోడ్పడుతుంది. సోయాబీన్స్‌ను వివిధ వంటకాల రూపంలో ఆహారంలో చేర్చుకోవచ్చు. ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్ల లోపం వల్ల చర్మం పొడిబారడం, మూడ్ మార్పులు, జ్ఞాపకశక్తి తగ్గడం, అలసట వంటి సమస్యలు కనిపించే అవకాశం ఉంటుంది. దీర్ఘకాలికంగా లోపం కొనసాగితే గుండె ఆరోగ్యంపై కూడా ప్రతికూల ప్రభావం పడే ప్రమాదం ఉంటుంది. అందువల్ల చియా గింజలు, వాల్‌నట్స్, అవిసె గింజలు, సోయాబీన్స్, సాల్మన్ వంటి ఒమెగా 3 అధికంగా ఉండే ఆహారాలను రోజువారీ ఆహారంలో భాగం చేసుకోవడం ద్వారా శరీరానికి అవసరమైన ఈ ముఖ్యమైన పోషకాన్ని పొందడంతోపాటు మొత్తం ఆరోగ్యాన్ని మెరుగుపరచుకోవచ్చని ఆరోగ్య నిపుణులు తెలియజేస్తున్నారు.

ఉదయం అల్పాహారంలో పాలు లేదా నారింజ రసం.. ఏది ఉత్తమ ప్రయోజనాలను ఇస్తుంది..?

పొద్దున్నే అల్పాహారం రోజంతా శరీరానికి శక్తిని అందించే అత్యంత ముఖ్యమైన భోజనం. రాత్రంతా ఉపవాసం చేసిన తర్వాత శరీరానికి పోషకాలు, శక్తిని అందించే ఆహారం అవసరం. అల్పాహారంలో పాలు తాగాలా? లేక నారింజ రసం తాగాలా? అనే సందేహం చాలా మందికి ఉంటుంది. ఈ రెండింటికీ ప్రత్యేకమైన పోషక విలువలు ఉన్నప్పటికీ, ఆరోగ్యపరంగా కొన్ని లాభాలు, నష్టాలు కూడా ఉన్నాయి. పాలను అల్పాహారంలో తీసుకోవడం వల్ల శరీరానికి మంచి నాణ్యమైన ప్రోటీన్ అందుతుంది. ఒక గ్లాస్ పాలలో రోజువారీ అవసరమైన ప్రోటీన్‌లో సుమారు 20 శాతం వరకు లభిస్తుంది. ఈ ప్రోటీన్ ఎక్కువసేపు కడుపు నిండిన భావన కలిగించి మధ్య మధ్యలో చిరుతిళ్లు తినాలనే కోరికను తగ్గించడంలో సహాయపడుతుంది. దీంతో మధ్యాహ్న భోజన సమయంలో అతిగా తినే అవకాశం కూడా తగ్గుతుంది. అంతేకాకుండా పాలలో ఉండే కాల్షియం శరీర బరువును నియంత్రించడంలో సహాయపడే కొన్ని హార్మోన్ల పనితీరుకు తోడ్పడుతుంది.



పాలను తాగితే ఏం జరుగుతుంది..

అయితే పాలకు కొన్ని ప్రతికూల అంశాలు కూడా ఉన్నాయి. ముఖ్యంగా పూర్తి కొవ్వు (ఫుల్ ఫ్యాట్) ఉన్న పాలలో శాచురేటెడ్ ఫ్యాట్ ఎక్కువగా ఉంటుంది. దీన్ని అధికంగా తీసుకోవడం వల్ల గుండె సంబంధిత వ్యాధుల ప్రమాదం పెరిగే అవకాశం ఉంటుందని కొన్ని పరిశోధనలు సూచిస్తున్నాయి. ముఖ్యంగా మధుమేహం లేదా ఊబకాయం ఉన్నవారు పాల రకాన్ని ఎంపిక చేసుకునేటప్పుడు జాగ్రత్త వహించాలి. నారింజ రసం కూడా అల్పాహారంలో చాలామంది ఇష్టంగా తీసుకునే పానీయం. ఒక గ్లాస్ నారింజ రసం ద్వారా శరీరానికి రోజుకు అవసరమైన విటమిన్ సి దాదాపు పూర్తిగా అందుతుంది. విటమిన్ సి శక్తివంతమైన యాంటీ ఆక్సిడెంట్‌గా పనిచేసి చర్మాన్ని సూర్యకిరణాల వల్ల కలిగే నష్టాల నుంచి రక్షించడంలో సహాయపడుతుంది. అలాగే వాతావరణ కాలుష్యం వల్ల మెదడుపై పడే ప్రతికూల ప్రభావాలను తగ్గించడంలో కూడా ఇది ఉపయోగపడుతుందని పరిశోధనలు సూచిస్తున్నాయి.

నారింజ రసం సేవిస్తే..

అయితే నారింజ రసాన్ని తరచూ లేదా ఎక్కువసేపు కొద్దికొద్దిగా తాగడం వల్ల దంతాల పైపొర (ఎనామెల్) దెబ్బతినే అవకాశం ఉంటుంది. అలాగే పండ్ల రసాల్లో సహజ చక్కెరలు ఎక్కువగా ఉండటం వల్ల బరువు తగ్గాలని ప్రయత్నించే వారికి ఇవి పరిమిత మోతాదులోనే మంచివి. అందుకే పండ్లను నేరుగా తినడం, రసాన్ని మాత్రం అప్పుడప్పుడు మాత్రమే తీసుకోవడం ఉత్తమం. నిపుణుల అభిప్రాయం ప్రకారం.. అల్పాహారంలో పండ్ల రసాల కంటే పాలు మెరుగైన ఎంపికగా పరిగణించవచ్చు. ముఖ్యంగా సేంద్రియ (ఆర్గానిక్) పాలు తీసుకుంటే విటమిన్ ఇ, ఒమెగా 3 కొవ్వు ఆమ్లాలు కొంత ఎక్కువగా లభించే అవకాశం ఉంటుంది. అదే సమయంలో నారింజ రసాన్ని పూర్తిగా మానేయాల్సిన అవసరం లేదు. అయితే దానిని కొద్దికొద్దిగా ఎక్కువసేపు తాగకుండా, ఒకేసారి తాగడం వల్ల దంతాలపై ఆమ్ల ప్రభావం తగ్గుతుంది. అలాగే సమతుల్యమైన అల్పాహారంతోపాటు తీసుకుంటే దాని పోషక ప్రయోజనాలను కూడా పొందవచ్చు.

శ్రీలంక సిరీస్‌కు ముందు టీమిండియాకు మరో షాక్.. సాయి సుదర్శన్ దూరం!

- నంబర్-3 స్థానంపై టీమిండియాలో చర్చ
- వార్మప్‌లో సెంచరీతో రేసులోకి పడిక్కల్
- బుమ్రా, హర్షిత్ రాణా, నితీశ్, సుందర్ కూడా దూరం
- డబ్ల్యూటీసీ పాయింట్ల కోసం భారత్, శ్రీలంక పోరు
- 2027 డబ్ల్యూటీసీ ఫైనల్ రేసులో భారత్‌కు సిరీస్ కీలకం
- కీలక ఆటగాళ్లు లేకుండానే బరిలోకి భారత్

హైదరాబాద్ పెన్ పవర్: శ్రీలంకతో జరగనున్న రెండు టెస్టుల సిరీస్‌కు ముందు టీమిండియాకు మరో ఎదురుదెబ్బ తగిలింది. బ్యాటర్ సాయి సుదర్శన్ గాయం కారణంగా సిరీస్‌కు దూరమయ్యాడు. దీంతో కీలకమైన నంబర్-3 స్థానంపై జట్టు మేనేజ్‌మెంట్ మరోసారి ఆలోచించాల్సిన పరిస్థితి ఏర్పడింది.
టెస్టుల్లో సుదర్శన్ అరంగేట్రం చేసిన తర్వాత మూడో స్థానంలో భారత్ ప్రధాన ఎంపికగా మారాడు. అయితే ఆ స్థానాన్ని పూర్తిగా సుస్థిరం చేసుకోకముందే గాయం కారణంగా సిరీస్‌కు దూరమయ్యాడు. ప్రస్తుతం జరుగుతున్న వార్మప్ మ్యాచ్‌లో దేవదత్ పడిక్కల్ సెంచరీ చేయడంతో అతడికి మూడో స్థానంలో అవకాశం వచ్చే సూచనలు కనిపిస్తున్నాయి.సుదర్శన్‌కు ముందు స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా కూడా ఈ సిరీస్‌కు దూరమయ్యాడు. హర్షిత్ రాణా, నితీశ్ కుమార్ రెడ్డి, వాషింగ్టన్ సుందర్ కూడా గాయాలతో అందుబాటులో లేరు. దీంతో శ్రీలంక పర్యటనకు భారత్ కీలక ఆటగాళ్లు లేకుండానే బరిలోకి దిగనుంది.సుదర్శన్ ఎంపిక సమయంలోనే అతడి ఫిట్‌నెస్‌పై సందేహాలు ఉన్నాయి. కాలి గాయం నుంచి కోలుకుంటున్న అతడికి సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ నుంచి ఫిట్‌నెస్ క్లియరెన్స్ రావాల్సి ఉంది. తాజాగా అతడు సిరీస్‌కు పూర్తిగా దూరమైనట్లు తేలింది.రెండు టెస్టుల సిరీస్ ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ పరంగా భారత్‌కు కీలకం. ప్రస్తుతం భారత్ ఐదో స్థానంలో ఉంది. శ్రీలంక ఆరో స్థానంలో ఉంది. 2027 డబ్ల్యూటీసీ ఫైనల్ రేసులో ముందుకు వెళ్లాలంటే ఇరు జట్లకు ఈ సిరీస్‌లో పాయింట్లు కీలకం. సుదర్శన్ గైర్హాజరీతో భారత్ బ్యాటింగ్ కూర్పులో మార్పులు తప్పనిసరయ్యాయి. పడిక్కల్ సెంచరీ చేయడంతో నంబర్-3 స్థానానికి పోటీ ఆసక్తికరంగా మారింది. మరోవైపు కీలక బౌలర్లు దూరం కావడంతో శ్రీలంక సిరీస్ టీమిండియా బెంచ్ బలానికి పరీక్షగా మారనుంది.

అయ్యో పాపం.. వెస్టిండీస్ వరల్డ్‌కప్ ఆశలపై నీళ్లు చల్లిన ఆఫ్ఘన్.. క్వాలిఫికేషన్ రేసులో మళ్లీ గందరగోళం!

హైదరాబాద్ పెన్ పవర్: వరల్డ్ కప్ ట్రోఫీలు గెలిచిన దిగ్గజ చరిత్ర మాది అని చెప్పుకోవడం తప్ప, కనీసం టోర్నీకి నేరుగా అర్హత సాధిద్దాం అనే ఆలోచన వెస్టిండీస్ క్రికెట్ బోర్డుకి అస్సలు ఉన్నట్లు కనిపించడం లేదు.. 2027 వన్డే వరల్డ్ కప్‌కు కనీసం ఈసారైనా క్వాలిఫైయర్స్ ఆడకుండా డైరెక్ట్‌గా వెళ్తారేమో అని ఫ్యాన్స్ ఆశపడితే.. మాకింత సీన్ లేదు బాస్ అని మళ్లీ పాత దారినే సెలక్ట్ చేసుకుంటున్నారు. ఐర్లాండ్‌పై ఆఫ్ఘనిస్తాన్ 92 రన్స్ తేడాతో గెలవడంతో, విండీస్ డైరెక్ట్ క్వాలిఫికేషన్ ఆశలు గాల్లో కలిసిపోయాయి. ఆతిథ్య దేశాలుగా దక్షిణాఫ్రికా, జింబాబ్వేలకు అప్పుడే నేరుగా బెర్త్‌లు ఖరారయ్యాయి. సెప్టెంబర్ 30, 2026 నాటికి ఐసీసీ వన్డే ర్యాంకింగ్స్‌లో టాప్-8లో ఉంటేనే డైరెక్ట్ ఎంట్రీ దక్కుతుంది. కానీ విండీస్ వీరులు మాత్రం ర్యాంకింగ్స్ అడుగున స్థిరపడటమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నారు.

వరల్డ్ కప్ క్వాలిఫికేషన్‌లో విండీస్‌ది వింతైన రికార్డు:

2019 వరల్డ్ కప్: డైరెక్ట్ ఎంట్రీ దక్కక క్వాలిఫైయర్స్ ఆడి అతికష్టం మీద టోర్నమెంట్లోకి వచ్చారు.

2023 వరల్డ్ కప్: క్వాలిఫైయర్స్ లో జింబాబ్వే, నెదర్లాండ్స్, స్కాట్లాండ్ చేతిలో దెబ్బతిని.. అసలు వరల్డ్ కప్‌కే రాకుండా టీవీల్లో మ్యాచ్‌లు చూడాల్సి వచ్చింది.

2027 వరల్డ్ కప్: సెప్టెంబర్ 30వ తేదీ నాటికి ఏమైనా అద్భుతం జరిగి ర్యాంకింగ్స్ పెరిగితే సరేసరి, లేదంటే హ్యాట్రిక్ బులెట్ లాగా మళ్లీ క్వాలిఫైయర్స్ ఆడటానికి విండీస్ సిద్ధం కావలసిందే.

విండీస్ ఆశలపై నీళ్లు చల్లిన ఆఫ్ఘన్:

న్యూజిలాండ్ చేతిలో సిరీస్ ఓటమితో విండీస్ స్థానం మరింత పాతాళానికి పడిపోగా, ఆఫ్ఘనిస్తాన్ మాత్రం వరుస విజయాలతో ముందుకు దూసుకుపోతుంది.

క్రికెట్ ఫ్యాన్స్‌కు బ్యాడ్ న్యూస్.. ది హండ్రెడ్ లీగ్ నుంచి జెమీమా ఔట్!

హైదరాబాద్ పెన్ పవర్: ది హండ్రెడ్ ఉమెన్స్ టోర్నమెంట్‌లో అద్భుతమైన ఫామ్‌తో చెలరేగుతున్న భారత స్టార్ బ్యాటర్ జెమిమా రోడ్రిగ్స్ సదర్న్ బ్రేవ్ జట్టుకు దూరమైంది. హ్యామ్‌స్ట్రింగ్ గాయం కారణంగా ఆమె టోర్నీలోని మిగిలిన మ్యాచ్‌ల నుంచి వైదొలిగినట్లు ఫ్రాంచైజీ ధృవీకరించింది. సదర్న్ బ్రేవ్ తరఫున అత్యంత కీలక బ్యాటర్‌గా రాణిస్తున్న జెమిమా స్థానంలో ఆస్ట్రేలియాకు చెందిన చార్లీ నాట్ ను రీప్లేస్‌మెంట్‌గా తీసుకున్నారు. కాగా జెమిమా ఈ టోర్నీలో 6 మ్యాచ్‌ల్లో 35.75 సగటు, 131.19 స్ట్రైక్ రేట్‌తో 143 పరుగులు చేసి జట్టు విజయాల్లో కీలక పాత్ర పోషించింది.

వరుసగా రెండుసార్లు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు:

సదర్న్ బ్రేవ్ సాధించిన వరుస విజయాల్లో జెమిమా రోడ్రిక్స్ ఇన్నింగ్స్‌లు మ్యాచ్ విన్నర్లుగా నిలిచాయి. 36/3తో జట్టు కష్టాల్లో ఉన్న సమయంలో జెమిమా 34 బంతుల్లో 42 పరుగులతో నాటౌట్‌గా నిలిచి సదర్న్ బ్రేవ్‌కు 5 వికెట్ల విజయాన్ని అందించింది. ఈ మ్యాచ్‌లో ఆమె ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ గా ఎంపికైంది. అలాగే ఆ తర్వాత మ్యాచ్‌లో 22 బంతుల్లోనే 32 రన్స్ (స్ట్రైక్ రేట్ 145.45) చేసి జట్టు 126 పరుగులు సాధించడంలో సహాయపడింది. ఆపై బ్రేవ్ ఒక్క పరుగు తేడాతో గెలవగా, జెమిమా వరుసగా రెండోసారి ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డును దక్కించుకుంది.

సదర్న్ బ్రేవ్ ప్రస్తుత పరిస్థితి:

మొదటి 5 మ్యాచ్‌లలో వరుస విజయాలు సాధించి పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో నిలిచిన సదర్న్ బ్రేవ్‌కు జెమిమా లేకపోవడం పెద్ద లోటే అని చెప్పాలి.. ఆగస్టు 3వ తేదీన వెల్ష్ ఫైర్ తో జరిగిన మ్యాచ్‌లో 121/5 పరుగులు చేయగా, ప్రత్యర్థి జట్టు ఆఖరి బంతికి లక్ష్యాన్ని ఛేదించి 4 వికెట్ల తేడాతో ఓడించింది.

ప్రధాన బ్యాటర్లు: లారా వోల్వార్ట్, మైయా బౌచియర్, లిజెల్ లీ.

ప్రధాన బౌలర్లు: లారెన్ బెల్, ఇస్సీ వాంగ్, సారా గ్లెన్, సోఫీ మోలినెక్స్.

ఆగస్టు 8వ తేదీన, శనివారం సౌతాంప్టన్‌లోని రోజ్ బౌల్ వేదికగా మాంచెస్టర్ సూపర్ జెయింట్స్‌తో పెనాల్టిమేట్ లీగ్ మ్యాచ్‌లో బ్రేవ్ తలపడనుంది. జెమిమా లేని లోటును చార్లీ నాట్ ఏ మేరకు భర్తీ చేస్తుందో చూడాలి మరీ.

'ఇస్మార్ట్' బ్యూటీ నాభా నటేష్: కెరీర్ విశేషాలు ಡ రాబోయే చిత్రాలు

చిక్ కేఫే స్టైల్‌లో పూజా హెగ్డే గ్లామర్ షో.. యెల్లో డ్రెస్ హైలైట్!

బుట్టబొమ్మ పూజా హెగ్డే మరోసారి తన గ్లామర్‌తో సోషల్ మీడియాను షేక్ చేస్తున్నారు. విదేశీ వీధుల్లో, ఒక వినూత్నమైన కేఫే బ్యాక్‌డ్రాప్‌లో దిగిన ఆమె లేటెస్ట్ ఫొటోలు ఇప్పుడు నెట్టింట తెగ వైరల్ అవుతున్నాయి. పసుపు రంగు బాడీకాన్ డ్రెస్‌లో తన స్టైలిష్ లుక్స్‌తో కుర్రకారు హృదయాలను కొల్లగొడుతున్నారు. క్యూట్ ఎక్స్‌ప్రెషన్స్ ఇస్తూ షేర్ చేసిన ఈ గ్లామరస్ పిక్స్ అభిమానులను అమితంగా ఆకట్టుకుంటున్నాయి. ఆ ఫొటోషూట్ విశేషాలు మీకోసం.

బుడాపెస్ట్ కేఫేలో చిక్ అండ్ గ్లామరస్ లుక్:

ప్రస్తుతం వెకేషన్ మూడ్‌లో ఉన్న పూజా హెగ్డే, బుడాపెస్ట్‌లోని ఒక వినూత్నమైన కేఫేలో ఈ సరదా ఫొటోషూట్ చేశారు. గోడల నిండా చేతిరాత నోట్లు, నేలపై ఎండుగడ్డి చల్లి ఉన్న క్రియేటివ్ కేఫేలో ఒక కలప స్టూల్‌పై కూర్చుని ఆమె క్యూట్‌గా ఫోజులిచ్చారు. "పుట్ ద పెస్ట్ ఇన్ బుడాపెస్ట్" అని తన ఫొటోలకు ఇచ్చిన సరదా క్యాప్షన్ నెటిజన్లను భలే ఆకట్టుకుంటోంది.

యెల్లో అవుట్‌ఫిట్ అట్రాక్షన్:

ఈ ఫొటోషూట్‌లో పూజా హెగ్డే ధరించిన యెల్లో కలర్ ఫిట్టెడ్ మినీ డ్రెస్ ఆమె అందాన్ని మరింత పెంచింది. డీప్ వి-నెక్‌లైన్‌తో ఉన్న ఈ అవుట్‌ఫిట్‌కు తోడు ఓవర్ సైజ్డ్ క్రీమ్ షేడ్ సన్ గ్లాసెస్, కలర్‌ఫుల్ ప్యాటర్న్ వేస్ట్ బ్యాగ్ మరియు హైహీల్డ్ మెటాలిక్ ప్లాట్‌ఫార్మ్ శాండల్స్‌ను మ్యాచ్ చేశారు. ఇక తన పక్కనే కలర్‌ఫుల్ బ్యాగ్ ఉంచి, ఒక చేతితో జుట్టును సరిచేసుకుంటూ ఆమె ఇచ్చిన క్యూట్ స్మైల్ నెటిజన్లను ఫిదా చేస్తోంది.

తొలి అడుగు నుంచి సౌత్, నార్త్ పాన్ ఇండియా రేంజ్:

'ముగమూడి' అనే తమిళ సూపర్ హీరో చిత్రంతో వెండితెరకు పరిచయమైన పూజా, తెలుగులో 'ఒక లైలా కోసం', 'ముకుంద' చిత్రాలతో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. ఆ తర్వాత 'మొహెంజోదారో'తో బాలీవుడ్‌లో ఎంట్రీ ఇచ్చారు. 'దువ్వాడ జగన్నాథమ్', 'మహర్షి', 'అల వైకుంఠపురములో', 'మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచిలర్' వంటి వరుస హిట్‌లతో టాలీవుడ్‌లో అగ్ర నటిగా నిలిచారు. ఇక విజయ్ సరసన 'బీస్ట్', ప్రభాస్ సరసన 'రాధే శ్యామ్' వంటి భారీ చిత్రాల్లోనూ మెరిసారు.

చేతినిండా క్రేజీ ప్రాజెక్ట్‌లు:

ఇటీవలే హిందీ థ్రిల్లర్ 'దేవా', సూర్యతో కలిసి 'రెట్రో', అలాగే 'కూలీ' సినిమాలో ప్రత్యేక పాత్రలో మెరిసిన పూజా హెగ్డే, నటించి అలరించారు. ఇక ఇటీవల వరుణ్ ధావన్‌తో కలిసి 'హై జవానీ తో ఇష్క్ హోనా హై', విజయ్ కాంబినేషన్‌లో 'జన నాయగన్', మూవీస్ తో ప్రేక్షకుల ను పలకరించారు. ఇక దుల్కర్ సల్మాన్‌తో 'శ్రీ శ్రీ' అనే తెలుగు రొమాంటిక్ డ్రామా మరియు 'కాంచన 4' చిత్రాలతో ప్రేక్షకుల ముందుకు రావడానికి సిద్ధమవుతున్నారు.కేవలం సినిమాలతోనే కాకుండా సోషల్ మీడియాలో తన స్టైలిష్ ఫొటోషూట్‌లతో నిత్యం ట్రెండింగ్‌లో ఉండటం పూజా హెగ్డే ప్రత్యేకత. పాన్ ఇండియా స్థాయిలో వరుస సినిమాలతో అలరిస్తూనే, ఇలాంటి గ్లామరస్ లుక్స్‌తో ఎప్పటికప్పుడు ఫ్యాన్స్‌కు డబుల్ ట్రీట్ ఇస్తున్న ఈ బుట్టబొమ్మ రాబోయే చిత్రాలతో మరింత ఘనవిజయాలు సాధించాలని కోరుకుందాం.

పీచ్ రంగు ఆర్గాంజా చీరలో అద్భుతమైన అందంతో ఆమ్నా షరీఫ్; కాలాతీతమైన సాంప్రదా య హుందాతనాన్ని చాటుతున్న ఈ సుందరమైన చిత్రం.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001
and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965